






# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 11 సంచిక : 300 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ ఆదివారం 6 జూలై 2025 వెల : 5/-రూ॥

VOLUME : 11 ISSUE :300 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SUN 6 JULY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada,Visakhapatnam, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## అమరావతికి మరో 20 వేల ఎకరాలు...

# సీఆర్డీఏ గ్రీన్ సిగ్నల్

- సీఎం చంద్రబాబు నివాసంలో ముగిసిన సీఆర్డీఏ 50వ సమావేశం
- రాజధానిలో అదనంగా 20,494 ఎకరాల భూ సమీకరణకు ఆమోదం
- హైడెన్సిటీ రెసిడెన్షియల్ జోన్లకు ఆర్ఎఫ్‌పీ పిలిచేందుకు గ్రీన్ సిగ్నల్
- నగరంలో నాలుగు కొత్త కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి ఓకే
- నిర్మాణ పనుల కోసం ఇసుక డ్రెడ్జింగ్‌కు సీఆర్డీఏకు అనుమతి
- గోపీచంద్ అకాడెమీ, ఎమ్మెస్కే ప్రసాద్ అకాడెమీ సహా 16 సంస్థలకు భూ కేటాయింపులు



పెన్ పవర్ డెస్క్:రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. రాజధాని పరిధిలో అదనంగా 20 వేల ఎకరాలకు పైగా భూమిని సమీకరించేందుకు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్డీఏ) అథారిటీ ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఉండవల్లిలోని నివాసంలో జరిగిన 50వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు.ఈ సమావేశంలో మొత్తం 7 ప్రధాన అంశాలపై చర్చించి ఆమోదముద్ర వేశారు. ఇందులో భాగంగా అమరావతి, తుళ్లూరు మండలాల్లోని ఏడు గ్రామాల్లో కలిపి మొత్తం 20,494 ఎకరాల భూమిని సమీకరించాలన్న ప్రతిపాదనకు అథారిటీ పచ్చజెండా ఊపింది. దీంతో పాటు, రాజధానిలో అభివృద్ధి పనులను పరుగులు పెట్టించేందుకు మరికొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. మందడం, రాయపూడి, పిచుకలపాలెం వంటి ప్రాంతాల్లో హైడెన్సిటీ రెసిడెన్షియల్ జోన్లు, మిశ్రమ అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణం కోసం ఆసక్తి వ్యక్తీకరణ (ఆర్ఎఫ్‌పీ) పిలిచేందుకు అనుమతించారు. అంతేకాకుండా, అమరావతిలో నిర్మించనున్న ఫైవ్‌స్టార్ హొటళ్లకు సమీపంలో నాలుగు చోట్ల కన్వెన్షన్ సెంటర్లను నిర్మించే ప్రతిపాదనకు కూడా ఆమోదం లభించింది. రాజధాని నిర్మాణ పనులకు ఇసుక కొరత లేకుండా చూసేందుకు, ప్రకాశం బ్యారేజీ ఎగువన డీసిల్టేషన్ ప్రక్రియ ద్వారా ఇసుకను తవ్వుకునేందుకు సీఆర్డీఏకు అనుమతి ఇచ్చారు. రానున్న రెండేళ్లలో నిర్మాణాలకు 159.54 క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరమవుతుందని అధికారులు అంచనా వేశారు. కేబినెట్ సబ్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు సీబీఐ, జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడెమీ, ఎమ్మెస్కే ప్రసాద్ క్రికెట్ అకాడెమీ, కిమ్స్ హాస్పిటల్ సహా 16 ప్రముఖ సంస్థలకు 65 ఎకరాల భూమిని కేటాయించేందుకు కూడా సీఆర్డీఏ అంగీకరించింది. వీటితో పాటు రాజధానిలోని ఈ-15 రహదారిపై ఆరు లేన్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణానికి, పొట్టి శ్రీరాములు, అల్లూరి సీతారామరాజు స్మారక చిహ్నాల ఏర్పాటుకు స్థలం కేటాయించేందుకు కూడా ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## చిన్నారుల కలల సాకారానికి

# అండగా నిలుస్తాం

- చదువు కోసం కమిషనర్‌ను వేడుకున్న చిన్నారులు... చలించిపోయిన మంత్రి నారా లోకేశ్
- చదువు చెప్పించాలని కమిషనర్‌ను వేడుకున్న నెల్లూరు చిన్నారులు
- వారి దీనస్థితిపై స్పందించిన మంత్రి నారా లోకేశ్
- పిల్లల విద్యాభ్యాసానికి ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం
- పేదరికాన్ని జయించే ఆయుధం చదువేనని వ్యాఖ్య
- చిన్నారుల కలలు సాకారం చేసేందుకు అండగా ఉంటామని హామీ

పెన్ పవర్ డెస్క్:చదువుకోవాలన్న తపనతో ఇద్దరు చిన్నారులు అధికారులను వేడుకున్న ఘటనపై రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా చలించిపోయారు. ఆ పిల్లల విద్యాభ్యాసానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను తక్షణమే ఆదేశించారు. వారి కలలను సాకారం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. వివరాల్లోకి వెళితే, నెల్లూరు నగరంలోని వీఆర్ స్కూలు వద్ద పెంచలయ్య, వెంకటేశ్వర్లు అనే ఇద్దరు చిన్నారులు తమను బడిలో చేర్పించాలంటూ

వివరాలు 2లో..

## మూడేళ్లలో అమరావతి తొలి దశ నిర్మాణం పూర్తి



పెన్ పవర్ డెస్క్: రాజధాని అమరావతిలో స్మార్ట్ ఇండస్ట్రీస్, స్పోర్ట్స్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం కోసమే 10వేల ఎకరాలు అవసరమవుతుందని మంత్రి నారాయణ అన్నారు. భూ సేకరణ వల్ల రైతులు నష్టపోతారనే ఉద్దేశంతోనే భూ సమీకరణకు వెళ్తున్నట్లు తెలిపారు. అమరావతి రెండో దశ భూ సమీకరణకు ఇప్పటికే 7 గ్రామాల పరిధిలో 20 వేల ఎకరాలు ఇచ్చేందుకు రైతులు సమ్మతించినట్లు తెలిపారు. ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబా బు అధ్యక్షతన నిర్వహించిన సీఆర్‌డీఏ 50వ అథారిటీ సమావేశంలో 7 అంశాలకు ఆమోదం తెలిపినట్లు నారాయణ వెల్లడించారు.స్మార్ట్ ఇండ స్ట్రీస్, స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు మరో 2,500 ఎకరాల చొప్పున కేటాయించేందుకు సీఎం అంగీక రించారని వివరించారు.

వివరాలు 2లో..

## భాగ్యనగరాన్ని ముంచెత్తిన భారీ వర్షం..

# రోడ్లన్నీ జలమయం

- హైదరాబాద్ నగరంలో పలుచోట్ల కుండపోత వర్షం
- బేగంబజార్, కోఠి, ఖైరతాబాద్ సహా ప్రధాన ప్రాంతాలు జలమయం
- రోడ్లపై నీరు చేరడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
- పలు ముఖ్యమైన రహదారులపై నిలిచిపోయిన ట్రాఫిక్
- పనులపై బయటకు వెళ్లిన ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు



పెన్ పవర్ డెస్క్:భాగ్యనగరంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఆకస్మికంగా కురిసిన కుండపోత వర్షానికి నగరంలోని పలు ప్రధాన ప్రాంతాలు జలమయమ య్యాయి. కార్యాలయాలు, ఇతర పనుల నుంచి ఇళ్లకు తిరిగి వెళ్లే నగరవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నగరంలోని కోఠి, బేగంబజార్, అబిడ్స్, సుల్తాన్ బజార్, బషీర్ బాగ్, నాంపల్లి,

వివరాలు 2లో..

## ట్రంప్‌కు మోదీ తలొగ్గుతారు..

# గోయల్ గుండెలు బాదుకుంటారు

- అమెరికా సుంకాలకు ప్రధాని మోదీ తలొగ్గుతారని రాహుల్ విమర్శ
- మంత్రి పీయూష్ గోయల్ గుండెలు బాదుకోవడం ఖాయమన్న రాహుల్
- జులై 9 గడువులోగా భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై తీవ్ర చర్చలు
- గడువుల కోసం ఒప్పందాల్లో తొందరపడబోమని స్పష్టం చేసిన కేంద్రం

పెన్ పవర్ డెస్క్:అమెరికాతో వాణిజ్య ఒప్పందం విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలకు ప్రధాని మోదీ తలొగ్గుతారని, ఈ విషయంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ గుండెలు బాదుకోవడం తప్ప ఏమీ చేయలేరని ఆయన వ్యాఖ్యానించారు. తన మాటలను రాసిపెట్టుకోవా లంటూ సవాల్ విసిరారు.మూడు నెలల క్రితం భారత్‌పై అమెరికా 26 శాతం సుంకాలు

వివరాలు 2లో..



## ఐదేళ్లు అరాచకాలు చేసి..

# ఇప్పుడు నీతులు చెబుతున్నారా?



పెన్ పవర్ డెస్క్: వైకాపా ఖాళీ అవడం ఖాయమని రా ష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. వైకాపా నాయకులు అధికారం కోల్పోవడంతో మతిభ్రమించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఐదేళ్లు అరాచకాలు చేసి, ప్రజలను పీడించుకొని తిని.. నీతులు చెబుతున్నారని ధ్వజమె త్తారు. త్వరలో వైకాపా కార్యాలయానికి టూ-లెట్ బోర్డు పెట్టబోతున్నారని.. అందుకే ఆందోళనలో ఆ పార్టీ నాయకులు ఏదేదో మాట్లాడుతున్నారని అన్నారు. బియ్యం కొట్టేసిన దొంగతో ప్రెస్ మీట్ పెట్టించ డం సిగ్గుమాలిన చర్య అని పేర్కొన్నారు. దొంగల తో ప్రయాణం చేస్తున్న జగన్ రెడ్డి.. పెద్ద దొంగ అని మంత్రి అన్నారు. సింగయ్య మృతికి సంబం ధించి విజువల్స్ అంతా క్లియర్‌గా ఉంటే తమకు ఎలాంటి సంబంధం లేదని జగన్ రెడ్డి

వివరాలు 2లో..

## శేషాచలం ఫారెస్ట్ లో 'పుష్ప' సీన్...

# పోలీసులపై స్మగ్లర్ల దాడి



- శేషాచలంలో పోలీసులపై ఎర్రచందనం స్మగ్లర్ల ఎదురుదాడి
- అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండలంలో చోటుచేసుకున్న ఘటన
- తమిళనాడుకు చెందిన స్మగ్లర్ గోవిందన్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు
- రూ. 80 లక్షల విలువైన 26 ఎర్రచందనం దుంగలు స్వాధీనం
- తప్పించుకున్న మరో 10 మంది కోసం ముమ్మర గాలింపు
- స్మగ్లర్ల నుంచి కత్తులు, గొడ్డళ్లు స్వాధీనం చేసుకున్న అధికారులు

వివరాలు 2లో..

## తాడిపత్రికి వెళ్లేందుకు పెద్దారెడ్డి మరో ప్రయత్నం

- తాడిపత్రి వెళ్లేందుకు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మరో ప్రయత్నం
- అనుమతి కోరుతూ ఎస్పీ జగదీశ్‌కు తాజాగా లేఖ
- హైకోర్టు ఆర్డర్ ఉన్నా అనుమతి కోసం ఎదురుచూపులు



పెన్ పవర్ డెస్క్:అనంతపురం జిల్లా తాడిపత్రి రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లేందుకు చేస్తున్న ప్రయత్నాలు స్థానికంగా ఉత్కంఠ రేపుతున్నాయి. వైసీపీ అధినేత జగన్ పిలుపునిచ్చిన 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమాన్ని తాడిపత్రిలో నిర్వహించాలని ఆయన నిర్ణయించారు. ఇందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఎస్పీ జగదీశ్‌కు తాజాగా ఓ లేఖ రాశారు. ఈ లేఖతో తాడిపత్రిలో ఆయన ప్రవేశం అంశం మళ్లీ తెరపైకి వచ్చింది.

వివరాలు 2లో..

## సుపరిపాలనలో తొలి అడుగు... కరపత్రాలతో

# ప్రజల్లోకి వెళ్లిన మంత్రి అచ్చెన్నాయుడు



- 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు
- శ్రీకాకుళం జిల్లాలో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో ముఖాముఖి
- కూటమి ప్రభుత్వ ఏడాది పాలన విజయాలను వివరించిన మంత్రి
- సూపర్ సిక్స్ హామీలను దాదాపుగా నెరవేర్చామని వెల్లడి
- రాష్ట్రానికి పరిశ్రమలను తిరిగి తీసుకువస్తున్నామని స్పష్టీకరణ

వివరాలు 2లో..

## మనుషుల్ని చంపడమే

# ఆయన పని

## పుతిన్‌పై ట్రంప్ ఆగ్రహం

- ట్రంప్, పుతిన్ మధ్య విఫలమైన శాంతి చర్చలు
- పుతిన్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన డొనాల్డ్ ట్రంప్
- యుద్ధ విరమణ ప్రతిపాదనను తిరస్కరించిన రష్యా
- చర్చలు ముగిశాక ఉక్రెయిన్‌పై పెరిగిన దాడులు
- గంటపాటు మాట్లాడినా ఎలాంటి పురోగతి లేదని ట్రంప్ వెల్లడి
- ఇప్పటికి ఆరుసార్లు భేటీ అయినా ఫలితం శూన్యం



పెన్ పవర్ డెస్క్:ఉక్రెయిన్ యుద్ధాన్ని నిలువరించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రయత్నాలు మరోమారు విఫలమయ్యాయి. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో జరిపిన చర్చల్లో ఎటువంటి పురోగతి లేకపోవడంతో ట్రంప్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పుతిన్‌పై ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ఇరువురు నేతలు దాదాపు గంటసేపు ఫోన్ లో సంభాషించారు.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# మారలేదుగా అంతేనా?

వైసీపీలో నాయకత్వంపై నేతలకు ఇంకా నమ్మకం కలగడం లేదు. జనంలో పార్టీ పట్ల కొంత పాజిటివ్ వేవ్స్ కనిపిస్తున్నా అది నిలబెట్టుకుంటారన్న నమ్మకం నేతలకు లేదు. అందుకు నాయకత్వ వైఖరి కారణం. జగన్ ఇంకా తన పాత వైఖరిని అవలంబిస్తున్నారు. కోటరీ మధ్యనే ఆయన ఇంకా కూరుకుపోయి ఉన్నారు.అనేక మంది నేతలు కోటరీపై విమర్శలు చేస్తూ బయటకు వెళ్లిపోయాని జగన్ తీరు మారలేదని అంటున్నారు. అందుకు కారణం వారిని జగన్ బలంగా నమ్మడమేనని, అంతకు మించి వారి చేతుల్లో జగన్ ఉన్నారని నేతలకు స్పష్టమయింది. అందుకే నేతలు గతంలో మాదిరిగా ఉత్సాహంగా జగన్ పిలుపు నిచ్చిన కార్యక్రమాల్లో పాల్గొనడం లేదని అంటున్నారు.

**వాస్తవ పరిస్థితులు...**

జగన్ చుట్టూ ఇంకా కోటరీ చుట్టుముట్టి ఉందని, దాటిని దాటుకుని వెళ్లి వాస్తవ పరిస్థితులు చెప్పేందుకు వీలు కలగడం లేదంటున్నారు. తమ నియోజకవర్గాల్లో మాత్రమే కాదు రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో కార్యకర్తలు పడుతున్న ఇబ్బందులతో పాటు నేతలపై నమోదవుతున్న కేసులు ఒకవైపు పార్టీకి దూరం చేస్తుంటే మరొక వైపు కోటరీ తో జగన్ కు, లీడర్లకు మధ్య గ్యాప్ పెరిగిందంటున్నారు. పార్టీకి నాయకత్వం వహించేవారు జనంలో నిత్యం తిరిగే నేతల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటే వాస్తవ పరిస్థితులు తెలుస్తాయి. దానికి అనుగుణంగా మార్పులు చేర్పులు చేసుకోవడానికి వీలుంటుంది. కానీ జగన్ నిర్వహిస్తున్న సమావేశాలన్నీ ఏకపక్షంగా సాగుతున్నాయన్నది ఎక్కువ మంది నాయకుల అభిప్రాయం.

**సీనియర్ నేతల సలహాలు...**

వైసీపీలో సీనియర్ నేతలకు కొదవ లేదు. రాజకీయ అనుభవం ఉన్నవాళ్లున్నారు. దశాబ్దాల నుంచి రాజకీయాలను ఒడిసిపట్టిన నేతలను కూడా జగన్ ఉపయోగించుకోవడం లేదంటున్నారు. సీనియర్ నేతలు అని కూడా చూడకుండా తాను చెప్పిందే వినాలని, కోటరీ చెప్పిన మాటలనే సమావేశాల్లో జగన్ చెబుతుండటంతో నేతలు చేష్టలుడిగి చూస్తున్నారు. గత ఎన్నికల్లో ఇంత దారుణంగా దెబ్బతిన్నప్పటికీ, కేవలం పదకొండు సీట్లకే పరిమితమయినా దానిపై కనీసం సమీక్షలు చేయకుండా, కారణాలు అన్వేషించకుండా భవిష్యత్ లో ఏం చేయాలన్న దానిపై సీనియర్ నేతలతో చర్చింకుండా కార్యక్రమాలను ప్రకటించడం పట్ల కూడా పలువురు నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

**వ్యతిరేకతపైనే...**

ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని, నాలుగేళ్లలో మరింత వ్యతిరేకత పెరిగి వైసీపీ విజయం ఖాయమని జగన్ అనుకుంటున్నారే తప్పించి ఫీల్డ్ లెవెల్లో పరిస్థితులను తెలుసుకుని దానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలన్న ధ్యాస కనిపించడం లేదని నేతలు వాపోతున్నారు. అందుకే దాదాపు ఎనభై శాతం మంది నేతలు కోటరీకి భయపడి అంటీ ముట్టనట్లు వ్యవహరిస్తూ, సమావేశాల్లో జగన్ చెప్పిన దానికి తలూపి వస్తున్నారని అంటున్నారు. నిజానికి గత వైసీపీ హయాంలో చేసిన తప్పులను తెలుసుకుని తిరిగి తాము అధికారంలోకి వస్తే వాటిని అమలు చేయమని ప్రజలకు భరోసా ఇవ్వాల్సిన సమయంలో అధికార పార్టీ వ్యతిరేకతపైనే జగన్ ఆధారపడి ముందుకు వెళుతున్నారంటున్నారు. అదే ఇప్పుడు ఫ్యాన్ పార్టీలో హాట్ టాపిక్ గా మారింది.

# శేషాచలం ఫారెస్ట్ లో 'పుష్ప' సీన్... పోలీసులపై స్మగ్లర్ల దాడి

శేషాచలం అడవుల్లో 'పుష్ప' సినిమా సీన్ కనిపించింది. ఎర్రచందనం స్మగ్లర్లు మరోసారి రెచ్చిపోయారు. అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులపైనే ఎదురుదాడికి దిగారు. ఈ ఘటన అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండలంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఈ దాడిలో ఒక స్మగ్లర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు, సుమారు రూ. 80 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు.వివరాల్లోకి వెళితే, సుండుపల్లి మండలం కావలిపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలను ఒక డంపింగ్ కేంద్రం నుంచి తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని స్మగ్లర్లను పట్టుకునేందుకు ప్రయత్నించారు. అయితే, పోలీసులను చూసిన సుమారు 11 మంది స్మగ్లర్లు, కూలీలు వారిపై కత్తులు, గొడ్డళ్లతో దాడి చేసి తప్పించుకునేందుకు ప్రయత్నించారు.ంఈ క్రమంలో పోలీసులు ధైర్యంగా వారిని ఎదుర్కొని, తమిళనాడుకు చెందిన గోవిందన్ అనే స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన 10 మంది అక్కడి నుంచి పరారయ్యారు. ఈ సందర్భంగా, రూ. 80 లక్షల విలువ చేసే 26 ఎర్రచందనం దుంగలతో పాటు, రెండు కత్తులు,

రెండు గొడ్డళ్లను స్వాధీనం చేసుకున్నట్లు అదనపు ఎస్పీ వెంకటాద్రి తెలిపారు. గోవిందన్‌పై గతంలోనూ ఇలాంటి నాలుగు కేసులు ఉన్నాయని ఆయన వెల్లడించారు. పరారైన స్మగ్లర్ల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు ఆయన వివరించారు. తమిళనాడు నుంచి కొందరు వ్యక్తులు ఈ ప్రాంతంలో స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నట్లు సమాచారం ఉండటంతో గ్రామాల్లో నిఘా పెంచామని పోలీసులు తెలిపారు.

# సుపరిపాలనలో తొలి అడుగు... కరపత్రాలతో ప్రజల్లోకి వెళ్లిన మంత్రి అచ్చెన్నాయుడు

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రజల్లోకి వెళ్లారు. ప్రభుత్వం చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఆయన శ్రీకాకుళం జిల్లా, కోటబొమ్మాళి మండలంలోని చిన్న బమ్మిడి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి స్వయంగా ఇంటింటికీ తిరుగుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు.

చిన్న బమ్మిడి గ్రామానికి చేరుకున్న అచ్చెన్నాయుడికి స్థానిక ప్రజలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన గ్రామంలోని ప్రతి ఇంటి గడప తొక్కుతూ, ప్రభుత్వ పనితీరును ప్రజల దృష్టికి తీసుకెళ్లారు. ఏడాది పాలనలో ప్రతి కుటుంబానికి ఏదో ఒక రూపంలో మేలు జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు తీరును, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని వారికి వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన సూపర్

సిక్స్ హామీలను తమ ప్రభుత్వం దాదాపుగా నెరవేర్చిందని స్పష్టం చేశారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం విడిచి వెళ్లిపోయిన పరిశ్రమలను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషితో తిరిగి తీసుకువస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నిలబెట్టుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.

# భాగ్యనగరాన్ని ముంచెత్తిన భారీ వర్షం.. రోడ్లన్నీ జలమయం

- మొదటి పేజీ తరువాయి

హిమాయత్ నగర్, నారాయణ గూడ, లక్డీకాపుల్, ఖైరతాబాద్, ట్యాంక్ బండ్ వంటి కీలక ప్రాంతాల్లో రహదారులు నీటితో నిండిపోయాయి. రోడ్లన్నీ చెరువులను తలపించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. వర్షం కారణంగా వాహనదారులు, పాదచారులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి అవస్థలు పడ్డారు.

# ఐదేళ్లు అరాచకాలు చేసి.. ఇప్పుడు నీతులు చెబుతున్నారా?

- మొదటి పేజీ తరువాయి

తప్పిం చుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగయ్య మృతితో ఎలాంటి సంబంధం లేనప్పుడు కుటుంబాన్ని ఎందుకు పరామర్శించారని మంత్రి ప్రశ్నించారు. కక్షపూరిత రాజకీయాలకు జగన్ కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయారని విమర్శించారు.

# చిన్నారుల కలల సాకారానికి అండగా నిలుస్తాం

- మొదటి పేజీ తరువాయి

కమిషనర్‌ను ప్రాధేయపడ్డారు. ఈ విషయం మీడియా ద్వారా వెలుగులోకి రావడంతో మంత్రి లోకేశ్ దృష్టికి వెళ్లింది.

ఈ ఘటనపై ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "చిన్నారులు తమకు చదువు చెప్పించాలని కమిషనర్‌ను ప్రాధేయపడటం నన్ను కదిలించింది. వారి చదువుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాల్సిందిగా అక్కడి అధికారులను ఆదేశించాను" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

పేదరికం నుంచి బయటపడటానికి విద్య ఒక్కటే బలమైన సాధనమని లోకేశ్ అభిప్రాయపడ్డారు. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరాలన్న కసి, పట్టుదల ఉంటే ఎలాంటి కష్టాలనైనా అధిగమించవచ్చని ఆయన అన్నారు. ఈ చిన్నారుల ఆశయ సాధనకు ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. ఈ మేరకు ఓ వెబ్‌సైట్‌లో వచ్చిన కథనాన్ని కూడా ఆయన తన పోస్టుతో పాటు పంచుకున్నారు.

# మనుషుల్ని చంపడమే ఆయన పని

- మొదటి పేజీ తరువాయి

ఈ చర్చల అనంతరం ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ, "పుతిన్ మారరు. ఆయనకు మనుషులను చంపుతూనే ఉండాలని ఉంది. ఇది ఏమాత్రం మంచిది కాదు" అంటూ ఆగ్రహం వెలిబుచ్చారు. "ఈ రోజు మా చర్చల్లో ఎలాంటి పురోగతి లేదు. ఉక్రెయిన్ విషయంలో నేను ఏమాత్రం సంతృప్తిగా లేను" అని తన నిరాశను వ్యక్తం చేశారు.

తక్షణమే కాల్పుల విరమణ చేపట్టాలని ట్రంప్ చేసిన సూచనను పుతిన్ తిరస్కరించినట్లు ఆయన సహాయకుడు యూరీ ఉష్కోవ్ ధృవీకరించారు. యుద్ధంలో తమ లక్ష్యాలను సాధించేందుకే కట్టుబడి ఉన్నామని రష్యా స్పష్టం చేసింది. అయితే, దౌత్యపరమైన పరిష్కారానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. ఈ ఫోన్ కాల్ ముగిసిన కొద్దిసేపటికే రష్యా సేనలు ఉక్రెయిన్ రాజధాని కీవ్‌తో పాటు మరో 13 నగరాలపై భీకర దాడులకు దిగడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఉక్రెయిన్‌లో శాంతి స్థాపన కోసం ట్రంప్, పుతిన్ మధ్య చర్చలు జరగడం ఇది ఆరోసారి.

# ట్రంప్‌కు మోదీ తలొగ్గుతారు.. గోయల్ గుండెలు బాదుకుంటారు

- మొదటి పేజీ తరువాయి

విధిస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సుంకాల సస్పెన్షన్ గడువు జులై 9తో ముగియనుండటంతో ఆలోగా ఓ వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు ఇరు దేశాలు ప్రయత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఈ విమర్శలపై కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పందించారు. అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల విషయంలో భారత్ పటిష్ఠమైన విధానాలను అనుసరిస్తోందని స్పష్టం చేశారు. గడువులను చూసి కీలక ఒప్పందాలపై తొందరపడబోమని, ఇరు దేశాలకూ ప్రయోజనం చేకూరితేనే ముందుకెళ్తామని ఆయన తెలిపారు.ఈ ఒప్పందంలో భాగంగా వస్త్రాలు, ఆభరణాలు, రొయ్యలు, ప్లాస్టిక్స్ వంటి ఉత్పత్తులపై సుంకాల మినహాయింపును భారత్ కోరుతోంది. మరోవైపు ఎలక్ట్రిక్ వాహనాలు, పారిశ్రామిక వస్తువులు,

పాడి ఉత్పత్తులపై సుంకాలు తగ్గించాలని అమెరికా డిమాండ్ చేస్తోంది. అయితే, పాడి, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలు తగ్గిస్తే దేశీయ రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయనే ఆందోళనల నేపథ్యంలో ఆ డిమాండ్లకు భారత్ అంగీకరించడం లేదు. ఇప్పటికే చర్చల నిమిత్తం అమెరికా వెళ్లిన భారత బృందం తిరిగిరావడంతో జులై 9లోగా ఓ మధ్యంతర ఒప్పందం కుదిరే అవకాశం ఉందని సమాచారం.

# గుడివాడ వన్ టౌన్ పీఎస్ కు వెళ్లిన కొడాలి నాని

### రావి వెంకటేశ్వరరావు వస్త్ర దుకాణంపై దాడి కేసులో బెయిల్

### షరతుల్లో భాగంగా గుడివాడ పీఎస్ కు వెళ్లిన కొడాలి నాని

### పీఎస్ లో సంతకం చేసిన మాజీ మంత్రి



వైసీపీ నేత, మాజీ మంత్రి కొడాలి నాని గుడివాడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో హాజరయ్యారు. ఓ కేసులో భాగంగా కోర్టు విధించిన ముందస్తు బెయిల్ షరతులను పాటిస్తూ ఆయన పోలీస్ స్టేషన్‌కు వచ్చి సంతకం చేసి వెళ్లారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా ఉన్న ఆయన, ఇటీవల మళ్లీ గుడివాడలో కనిపిస్తున్నారు.

వివరాల్లోకి వెళితే, గుడివాడ మాజీ ఎమ్మెల్యే, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావుకు చెందిన వస్త్ర దుకాణంపై దాడి జరిగిన ఘటనలో కొడాలి నానిపై కేసు నమోదైంది. ఈ కేసులో అరెస్ట్ కాకుండా ఉండేందుకు ఆయన హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే, కింది కోర్టులోనే బెయిల్ తీసుకోవాలని హైకోర్టు సూచించడంతో, ఆయన గుడివాడ కోర్టును ఆశ్రయించారు.అక్కడ అవసరమైన పత్రాలు సమర్పించగా, గుడివాడ కోర్టు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఆ షరతుల్లో భాగంగానే కొడాలి నాని ఈ రోజు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి సంతకం చేశారు. గతంలో ఆయన అరెస్ట్ అయ్యారంటూ వచ్చిన వదంతులను పోలీసులు అప్పుడే ఖండించిన విషయం తెలిసిందే. తాజా పరిణామంతో ఆయన బెయిల్ షరతులను పాటిస్తున్నట్లు స్పష్టమైంది.

# తాడిపత్రికి వెళ్లేందుకు పెద్దారెడ్డి మరో ప్రయత్నం

- మొదటి పేజీ తరువాయి

ఒకప్పుడు టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డికి ఎదురైన పరిస్థితులే ఇప్పుడు కేతిరెడ్డికి ఎదురవుతున్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వాస్తవానికి, కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రి వెళ్లేందుకు ఎలాంటి అడ్డంకులు లేవని, ఆయనకు తగిన భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏప్రిల్ 30వ తేదీన స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ, గతంలో ఆయన చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇప్పుడు హైకోర్టు ఆదేశాలు, తాజాగా ఆయన రాసిన లేఖ నేపథ్యంలో ఈసారి పోలీసు యంత్రాంగం ఎలా స్పందిస్తుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కేతిరెడ్డికి అనుమతి లభిస్తుందా లేదా అనే విషయంపై తాడిపత్రి రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తోంది.

# మూడేళ్లలో అమరావతి తొలి దశ నిర్మాణం పూర్తి

- మొదటి పేజీ తరువాయి

అమరావతిలో 5 స్టార్ హొటళ్లకు అనుబంధంగా 10వేల మంది సామర్థ్యంతో కన్వెన్షన్ సెంటర్ కట్టే సంస్థలకు అదనంగా 2.5 ఎకరాలు, 7,500 మంది సామర్థ్యంలో కన్వెన్షన్ సెంటర్ కట్టే సంస్థలకు మరో 2 ఎకరాలు ఇవ్వాలని నిర్ణయించారు. రాజధాని నిర్మాణానికి అవసరమైన ఇసుకను కృష్ణా నదిలో తవ్వుకునేలా సీఆర్‌డీఏకు అనుమతులు మంజూరు చేశారు. ప్రణాళిక ప్రకారం వచ్చే మూడేళ్లలో రాజధాని అమరావతి తొలి దశ నిర్మాణం పూర్తవుతుందని నారాయణ స్పష్టం చేశారు.

**సీఆర్‌డీఏ నిర్ణయాలు**

రాజధానిలో హైడెన్సిటీ రెసిడెన్షియల్ జోన్ సహా మిశ్రమ అభివృద్ధి ప్రాజెక్టులకు ఆర్ఎఫ్‌పీగా పిలిచేందుకు ఆమోదం

అమరావతిలో నిర్మించే ఫైవ్ స్టార్ హొటళ్ల సమీపంలో కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణం కోసం సీఆర్‌డీఏ ప్రతిపాదనకు అథారిటీ ఆమోదం

మందడం, తుళ్లూరు, లింగాయపాలెంలో 2.5 ఎకరాల చొప్పున నాలుగు చోట్ల కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి క్యూబీఎస్ ప్రాతిపదికన అమోదం

అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనుల కోసం ప్రకాశం బ్యారేజీ ఎగువన డీసిల్టేషన్ ప్రక్రియ ద్వారా ఇసుక తవ్వుకునేందుకు అనుమతి

వచ్చే రెండేళ్లలో రాజధాని నిర్మాణానికి 159.54 క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరం అవుతుందని అంచనా

భూముల కేటాయింపులపై కేబినెట్ సబ్ కమిటీ తీసుకున్న నిర్ణయాలకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదం

సీబీఐ, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ, ఎంఎస్‌కే ప్రసాద్ క్రికెట్ అకాడమీ, కిమ్స్ సహా 16 సంస్థలకు 65 ఎకరాల భూ కేటాయింపులకు ఆమోదం

రాజధానిలోని ఈ–15 రహదారిపై 6 లైన్ల ఆర్వోబీ నిర్మాణానికి ఆమోదం

పొట్టి శ్రీరాములు, అల్లూరి సీతారామరాజు స్మారక చిహ్నాలు ఏర్పాటుకు స్థలం కేటాయించేందుకు ఆమోదం.

# పెన్ పవర్

ఉభయ గోదావరి

కాకినాడ | డా॥బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ | తూ॥ గోదావరి | ప॥ గోదావరి | ఏలూరు


## ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే శిరీష దేవి



**గంగవరం, పెన్ పవర్ జూలై 5 :** రాష్ట్ర ప్రజల సంక్షేమం అభివృద్ధి కూటమి ప్రభుత్వం ధ్యేయమని రంపచోడవరం శాసనసభ్యురాలు మిరియాల శిరీష దేవి అన్నారు. శనివారం రంపచోడవరం నియోజకవర్గం గంగవరం మండలంలోని చిన్న అడ్డపల్లి, పెద్ద అడ్డపల్లి గ్రామాలలో సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి స్వయంగా గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్రంలో ముఖ్యమంత్రి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, పెట్టుబడులు, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిం చారు. ప్రజల వద్దకు వెళ్లి పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అన్నది అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీసీసీ డైరెక్టర్ గొర్లె సునీత, గంగవరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పాము అర్జున్, రైతు అధికార ప్రతినిధి కనిగిరి రాంబాబు, పార్టీ ప్రధాన కార్యదర్శి . భాను ప్రకాష్, మాజీ ఎంపీపీ డాక్టర్ తీగలు ప్రభ, వీరభద్రారెడ్డి, వెంకటరెడ్డి, నరసన్న దొర, జనసేన పార్టీ మండల అధ్యక్షులు కుంజం సిద్దు, సుభాష్, నాగేశ్వరరావు, శ్యామల, చిన్నబ్బారెడ్డి, చిన్నారావు, సత్యవేణి, బుల్లియమ్మ, సునీత, ఎన్డీఏ కూటమి నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్, కేఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

## గోదావరి వరద భీభత్సం



- గండి పోశమ్మ ఆలయ దర్శనాలు తాత్కాలికంగా నిలిపివేత..
- దేవాదాయ శాఖ,ఆలయ అధికారులు వెల్లడి..

దేవీపట్నం,పెన్ పవర్,జూలై5 : మండలంలో గొందూరు గ్రామంలో గోదావరి నది నీటి మట్టం పెరగడంతో,ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన స్వయంభూ శ్రీ గండి పోశమ్మ అమ్మవారి ఆలయం వరద నీటిలో మునిగిపోయింది.వరద నీరు ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించడంతో భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేసినట్టు దేవస్థానం అధికారులు తెలిపారు.శ్రీ గండి పోశమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద ఐరన్ బారికేడ్లు ఏర్పాటు చేసి భక్తులను ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. గోదావరి నది ప్రస్తుతం ఉధృతంగా ప్రవహిస్తుండటంతో,భక్తులు ఆలయానికి రావద్దని,నది దరిదాపుల్లోకి పోకూడదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.పట్టణ ప్రజలు,భక్తులు,పర్యాటకులు గోదావరి ఒడ్డులకు ఫోటోలు, సెల్ఫీలు తీయడానికి వెళ్ళరాదని, ప్రాణ భద్రత కోసం జాగ్రత్తలు పాటించాలని కోరారు.భక్తులకు తిరిగి దర్శనానికి అనుమతించే తేదీని త్వరలో ప్రకటిస్తామని దేవదాయ శాఖ స్పష్టం చేసింది.





## అగమ్యగోచరంగా దందుడారి పుంత రోడ్డు

**పెన్ పవర్, ఉంగుటూరు, జూలై 5 :** ఏలూరు కాలువపై నారాయణపురం బ్రిడ్జి శిధిలావస్థకు చేరడంతో అధికారులు అక్కడి రాకపోకలు పూర్తిగా నిలిపివేశారు. ఈ కారణంగా నారాయణపురం-తాల్లాపురం దందుడారి పుంత రోడ్డుమీదుగా భారీ వాహనాల రాకపోకలు జరగడం ప్రారంభమైంది. అయితే ఇటీవలే ఈ మార్గంలో గ్రావెల్ పనులు చేసినప్పటికీ ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్డంతా బురదమయమై కనీసం సైకిల్ కూడా వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. ఈ మార్గాన్ని ఉపయోగిస్తున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే ధర్మరాజు గమనించి అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో అధికారులు క్వారీ కంకర రాళ్లతో రోడ్డును పటిష్టం చేసి, పైగా కంకర పొయ్యించి చదును చేయిస్తూ వాహనాలు వెళ్లేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. గ్రామస్తులు మాత్రం శాశ్వతంగా పక్కా రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

### రాయుడుగారి మిలటరీ హోటల్‌లో

## తిరుమల సెట్ తొలగించండి

- లేకుంటే ఇక్కడే నిరాహార దీక్షకు కూర్చుంటాం - ఏపీ సాధు పరిషత్ అధ్యక్షులు స్వామీజీ శ్రీనివాసనంద సరస్వతి

**జగ్గంపేట(గండేపల్లి), పెన్ పవర్, జూలై 5 :** గండేపల్లి మండలం మల్లేపల్లి జాతీయరహదారి పక్కన ఏర్పాటు చేసిన రాయుడుగారి మిలటరీ హోటల్‌లో తిరుమల వెంకటేశ్వరుని సెట్ తొలగించాలని లేకుంటే ఇక్కడే నిరా హార దీక్షకు కూర్చుంటామని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షులు స్వామీజీ శ్రీనివాసనంద సరస్వతి హెచ్చరించారు. గత వారం రోజుల నుంచి వివాదంలో ఉన్న ఈ హోటల్ ను శనివారం స్వామీజీ పలువురుతో కలిసి సందర్శించారు. వెంకటేశ్వరస్వామి సెట్ ను పరిశీలించి ఇది అచ్చం తిరుమల ఆనందనిలయంగా ఉందని ఇక్కడ నాన్వెజ్ వంటకాలు చేయడం భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ఉందన్నారు. దీనిపై యాజమాన్యంతో మాట్లాడి ఈ సెట్ తొలగించి వెంకటేశ్వరుని చిత్రపటం పెద్దగా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అనంతరం స్వామీజీ మీడియాతో మాట్లాడుతూ కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి అంటే కోట్లాది మంది భక్తులకు నమ్మకమని అటువంటి స్వామి ఆనంద నిలయాన్ని రెస్టారెంట్ లో ఏర్పాటు చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీశారన్నారు. టీటీడీ బోర్డు మెంబర్ జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సొంత నియోజకవర్గంలో ఈవిధంగా సెట్ ఏర్పాటు చేశారని వెంటనే దీన్ని ఆయన పరిశీలించి తొలగించే ఏర్పాట్లు చేయాలన్నారు. వ్యాపార సముదాయాల్లో భక్తులు భగవంతుడి ఫోటోలు పెట్టుకోవచ్చని అది తప్పు కాదని ఇలా పెద్దగా ఆలయ నమూనా సెట్ వేయడం బాధాకరమన్నారు. ఈ విషయంపై ఇప్పటికే తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా భక్తులు మనోభావాలు దెబ్బతీశారని వెంటనే తొలగించ కుంటే ఇక్కడే నిరాహార దీక్షకు కూర్చుంటామని స్వామీజీ పేర్కొన్నారు.





## మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

### 548 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేత



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 5 :** స్థానిక ప్రభుత్వ మోడ్రన్ డిగ్రీ కళాశాలలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్, వికాస ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ముందుగా కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతులనవీన్ హాజరై వచ్చిన అభ్యర్థుల అందర్నీ పేరుపేరునా పలకరించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వికాస పీడీ లక్ష్మణరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో జగ్గంపేట నియోజకవర్గం నిరుద్యోగులందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని 33 బ్రాండెడ్ కంపెనీలతో నిర్వహించిన ఈ మెగా జాబ్ మేళాకు 1206 అభ్యర్థుల హాజరై ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. 548 మంది ఉద్యోగాలకు ఎంపికవగా వారికి నియామక పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. జ్యోతుల నవీన్ మాట్లాడుతూ నియోజవర్గంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వికాస ఆధ్వర్యంలో ఈ యొక్క మెగా జాబ్ మేళా ఏర్పాటు చేయడం జరిగిందని ఈ జాబ్ మేళా ఉపయోగించుకుని ఉద్యోగ అవకాశాలు పొందాలని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ మెగా జాబ్ మేళాల్లో యువత ఉద్యోగాలు అందిపుచ్చుకుంటే మీ తల్లిదండ్రులను ఆనందించే విధంగా మీరు ఏదో ఒక ఉద్యోగంలో జాయిన్ అవుతే మీ తల్లిదండ్రుల ఆనందానికి అవధులు ఉండవని అన్నారు. అందుకే ఈ చిరు ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నారావు, అడపా భరత్ బాబు, తోట రవి, తోట గాంధీ, కొత్త కొండబాబు, అడబాల భాస్కరరావు, బస్వా వీరబాబు, మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు, చదరం చంటిబాబు, జంపన సీతారామ చంద్ర వర్మ, నీలం శ్రీను, దేవరపల్లి మూర్తి, పాలచర్ల నాగేంద్ర చౌదరి, తూము కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి సుభాష్‌కు తులాభారం నిర్వహించిన వట్రపూడి గ్రామస్తులు

### బెల్లపు కుందులతో అమ్మవారికి మొక్కు చెల్లింపు




**కె.గంగవరం, పెన్ పవర్ జూలై 5 :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పట్ల రామచంద్రపురం నియోజవర్గ ప్రజలు తమ అభిమానాన్ని చాటుకుంటూ తమ ప్రేమను పలు విధాలుగా వెల్లడి చేస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో రామచంద్రపురం నియోజకవర్గం నుంచి మంత్రి సుభాష్ అత్యధిక మెజారిటీతో గెలవాలని కోరుకుంటూ కె.గంగవరం మండలం వట్రపూడి గ్రామ ప్రజలు అమ్మవారికి మొక్కుకున్నారు. ఎన్నికల్లో మంత్రి సుభాష్ అనూహ్య రీతిలో అత్యధిక మెజార్టీతో గెలవడంతోపాటు రాష్ట్ర క్యాబినెట్లో కార్మిక శాఖ మంత్రిగా కొలువు తీరిన సంగతి తెలిసిందే. నాటి నుంచి నియోజకవర్గ ప్రజల ఆలనా పాలన కష్టసుఖాల్లో తోడుగా ప్రజల్లో ఒకరిగా మమేకమై పనిచేస్తున్నారు మంత్రి సుభాష్.ఈ నేపథ్యంలో శనివారం వట్రపూడి గ్రామంలోని వెలగాలమ్మ తల్లి సమక్షంలో తమ మొక్కును చెల్లించుకున్నారు. అమ్మవారి సమక్షంలో బెల్లపు కుందులుతో మంత్రి సుభాష్‌కు తులాభారం చేసి ఆ వెలగాలమ్మ తల్లి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసే మా నాయకుడు చల్లగా ఉండాలంటూ మనసారా కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు దూడల నరేష్, దూడల సతీష్, బిరద నూకరాజు, దూడల లక్ష్మీనారాయణ, బొండా గంగాధర్ రావు, బిరదా మరిడేశ్వరరావు, దాసరి సత్తిరాజు (పెదకాపు) దూడల వీర్రాజు, గ్రామ ప్రజలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

### ఇసుక అధికంగా లోడ్ చేస్తున్న వారిపై

## కఠిన చర్యలు తీసుకోండి

- జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, జులై 5 :** పరిమితికి మించి ఇసుకను అధికంగా లోడ్ చేస్తున్న వాహనదారులపై కఠిన చర్యలు చేపట్టాలని, వాహనాలను సీజ్ చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇసుక అంశంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ తాళ్లపూడి, ప్రక్కిలంక, వేగేశ్వరపురం పూడికతీత చేసే రీచ్ ల వద్ద వాహనాలలో ఇసుకను అధికంగా లోడ్ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. ఈ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిఘా వ్యవస్థ పెంచాలని అధికారులను ఆదేశించారు. నిబంధనలు పాటించని పూడికతీత రీచ్ ల ఏజెన్సీస్‌ల లైసెన్సును రద్దు చేయాలన్నారు. జిల్లా అంతటా బృందాలను పంపించాలని, ఉల్లంఘనలకు పాల్పడుతున్న ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. వాహనాల లోడింగ్, రహదారిపై పడిన ఇసుక తొలగింపు ఏజెన్సీలదే భాధ్యత అని, ఈ అంశాల పర్యవేక్షణ బాధ్యతను ఆయా మండల స్థాయి అధికారులకు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేయాలని అధికారుల్ని కలెక్టర్ ఆదేశించారు. ఇసుక నింపిన వాహనాలను టార్పాలిన్ తో తప్పక కప్పి ఉంచాలని, వాహన సామర్థ్యానికి మించి లోడ్ చేయరాదని, రహదారిపై పడిన ఇసుకను అదే రోజు సాయంత్రంలోపు తొలగించాల్సిన బాధ్యత ఏజెన్సీలపై ఉందని చెప్పారు. ఇసుక తొలగింపుకు, ముందు తొలగించిన తర్వాత తీసిన ఫోటోలను ఏజెన్సీలు జిల్లా యంత్రాంగానికి సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఈ నిబంధనలు పాటించని ఏజెన్సీల ఆథరైజేషన్ ను ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా రద్దు చేస్తామని చెప్పారు. ప్రతి ఏజెన్సీ జాతీయ హరిత ట్రైబ్యునల్ ఆదేశాలను పాటించాలన్నారు. జిల్లాలో జూన్ 1 నుంచి అక్టోబర్ 15 వరకు ఇసుక తవ్వకాలపై నిషేధం ఉందని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా మైనింగ్ అధికారి ఎం.ఫణి భూషణ్ రెడ్డి, జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ కుమార్‌లు పాల్గొన్నారు.

## జ్యూట్ బ్యాగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన రాజోలు ఎమ్మెల్యే దేవ



**అమలాపురం /రాజోలు పెన్ పవర్ జూలై 5 :** అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో తదేకం ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన జ్యూట్ బ్యాగ్ శిక్షణ, ఉపాధి కేంద్రాన్ని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రారంభించారు,ఈ కార్యక్రమంలో జనసేన మహిళా నేత స్టేట్ సివిల్ సప్లై డైరెక్టర్ కడలి ఈశ్వరి పాల్గొన్నారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా మహిళలకు స్వయం ఉపాధి ఏర్పడుతుందని, మహిళలు ఆర్థికంగా ఎదగడానికి అవకాశం ఏర్పడు తుందని, ఈ శిక్షణ కార్యక్రమాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కోరారు. కడలి ఈశ్వరి మాట్లాడుతూ మహిళలకు ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో తదేకం ఫౌండేషన్ సహకారంతో ఈ జ్యూట్ బ్యాగ్ తయారీ మిషనరీని ఏర్పాటు చేసామన్నారు, ఇక్కడ నెలరోజులపాటు ఉచితంగా శిక్షణ తీసుకుని మహిళలు స్వయం ఉపాధిగా ఎదిగేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆమె తెలియజేశారు.



## నూతన టికెట్ కౌంటర్ ప్రారంభించిన అమలాపురం ఎమ్మెల్యే





**అమలాపురం పెన్ పవర్ జూలై 5 :** పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నూతనంగా ఏర్పాటు చేసిన టికెట్ కౌంటర్ ను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యానిర్వాహక కార్యదర్శి మెట్ల రమణ బాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు,ఈ.ఒ వేంకటేశ్వర రావు, పట్టణ అధ్యక్షులు తిక్కిరెడ్డి నేతాజీ, అబ్బాయి వెంకన్న, కౌన్సిలర్ గండి హారికస్వామి, ఏడిద శ్రీను, గంధం శ్రీను, కుంచె వెంకన్నబాబు,బండారు వెంకన్న, నల్లా చిట్టి తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్ల బిగింపు రద్దు చేయాలి




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జూలై 5 :** స్మార్ట్ మీటర్ల బిగింపు రద్దు చేయాలని శనివారం మండల కేంద్రమైన పెంటపాడు గేటు సెంటర్లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ పెంటపాడు మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు పెట్టిన షాపులు వాళ్ళకు కొన్ని చోట్ల వస్తున్న బిల్లులను చూచి ఇప్పటికే చిరు వ్యాపారస్తులు గుండెలు బాదుకుంటున్నారని తెలిపారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటు వాళ్ళకు అప్పగించటం కోసం ముందస్తు చర్యగా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని ఆయన విమర్శించారు. స్మార్ట్ మీటర్లు బిగించాలంటే మన అనుమతి కావాలి. ఒక సారి స్మార్ట్ మీటరు బిగిస్తే మనం అనుమతించినట్లే. క్రమేణా మన కరెంటు కనెక్షన్ ఆదానీ చేతికి పోతుందిని లక్ష్మణరావు తెలిపారు. ఈ మీటరు ఖరీదును వినియోగదారులు భరించాలిని సింగిల్ ఫేజ్ మీటరు ఖరీదు రూ.8,927, త్రీఫేజ్ మీటరు ఖరీదు రూ.17,286 ఈ మొత్తాన్ని 93 నెలల పాటు ఇన్‌స్టాల్ మెంట్లుగా బిల్లుతో బాటు వసూలు చేస్తారని పేర్కొన్నారు. సిపిఐ నాయకులు బండారు శ్రీనివాసరావు, వంక అప్పారావు మాట్లాడుతూ ఈ మీటర్లు ప్రీ పెయిడ్ మీటర్లు. సెల్ ఫోన్ మాదిరిగా ముందుగా రీ చార్జీ చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఉన్న పోస్ట్ పెయిడ్ విధానంలో బిల్లు చెల్లించటానికి 15 రోజులు గడువు ఉంటుందని, చెల్లించకపోతే పెనాలిటీతో చెల్లించటానికి, అప్పటికీ చెల్లించకపోతే, కనెక్షన్ కట్ చేయటానికి నిర్దిష్టమైన గడువు ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పెంటపాడు మండల సహాయ కార్యదర్శి కొణతాల నాగరాజు, దిద్దే నాగేశ్వరావు, కలింగ లక్ష్మణ్ రావు, ఎం.రాజేష్, ఎం.కిరణ్ చిన్నం రాజు గెల రాంబాబు చింతాడ అశోక్ ఎర్ర రామకృష్ణ పాల్గొన్నారు.

## వైయస్సార్సీపి జిల్లా కార్యదర్శిగా పొగాకు శీను




**అమలాపురం పెన్ పవర్ జూలై5 :** డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వై. యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గా పొగాకు శ్రీను ఎన్నికయ్యారు. ఉప్పలగుప్తం మండలం ఎస్. యానాంనకు చెందిన నాయకులు పొగాకు శ్రీనుకి పలువురు హృద్య పూర్వాక శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా తనకు అప్పగించిన ఈ పదవికి వన్నె తెస్తానని, వైయస్సార్సీపి బలోపేతా నికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## ఆదిత్య కళాశాలలో బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలు




**అమలాపురం పెన్ పవర్ జూలై 5 :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులకు బుద్దాల నాగరత్నం మెమోరియల్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో బ్లడ్ గ్రూప్ నిర్ధారణ కార్యక్రమం శనివారం నిర్వహించడం జరిగింది.ఈ సంధర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సి హెచ్. సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతి విదార్థికి తమ బ్లడ్ గ్రూపు తెలుసుకోవడం అనేది కనీస భాద్యత అని, అత్యవసర పరిస్థితుల్లో స్వచ్ఛందంగా రక్తదానం చేయుటకు చాలా ఉపయోగకరమని పేర్కొన్నారు.పూర్తి ఆరోగ్యవంతులు ప్రతి ఒక్కరూ నింవత్సరానికి కనీసం రెండు సార్లయినా రక్తదానం చేయాలని తద్వారా కొంత మందికి ప్రాణదాతలుగా విదార్థులు నిలుస్తారని విద్యార్థులకు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు కళాశాల సిబ్బంది పొల్గొన్నారు.

# సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్

### కేసు నమోదు చేసిన ఎస్ఐ జ్వాలా సాగర్



**అమలాపురం, పెన్ పవర్ జూలై 5 :** అంబేద్కర్ కోనసీమ జిల్లా... ముమ్మిడివరం నియోజకవర్గం,ముమ్మిడివరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్లు, ముఖ్య భూమిక పోషిస్తున్న కొంత మంది లేకర్లు,బ్రోకర్లు,రిటైర్డ్ జైలు శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ కుటుంబీకుల భూమి అక్రమ రిజిస్ట్రేషన్ విచారణలో వెల్లడవంతో కేసు నమోదు చేసినట్లు ముమ్మిడివరం ఎస్ఐ జ్వాలా సాగర్ పేర్కొన్నారు. ముమ్మిడివరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రిటైర్మెంట్ అయిన జైల్లు శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.భోగేశ్వర్రావు కుటుంబానికి రాజమండ్రిలో సుమారు 14 సెంట్ల భూమి ఉంది.ఇటీవల ఆ భూమికి సంబంధించి ఈసీ తీయించిన సదరు రిటైర్డ్ ఉద్యోగి ఆ భూమి వేరేవారి పేరున ఉన్నట్లు గుర్తించి అవాక్కయ్యారు. ముమ్మిడివరంలో ఈ సంవత్సరం జూన్ 18న రిజిస్ట్రేషన్ అయినట్లు గుర్తించి కోనసీమ జిల్లా పోలిసులును ఆశ్రయించారు. ఎస్పీ కృష్ణారావు ఆదేశాలతో ముమ్మిడివరం ఎసై జ్వాలా సాగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రార్ ఎం.సుదాకర్‌ను విచారించగా కాకినాడ జిల్లా పెద్దాపురం నకు చెందిన గంధం భవానీకి చెందిన భూమిగా రికార్డులు చూపించి ఆమె కుమారుడు రామ సుబ్రహ్మణ్యం పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని,ఈ రిజిస్ట్రేషన్ లో స్థానిక లేఖరి యర్రాప్రగడ కృష్ణ ముఖ్య పాత్ర పోషించినట్లు గుర్తించారు. తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ జరిగినట్లు తేలడంతో ఈ అక్రమ రిజిస్ట్రేషన్ ను అదికారులు రద్దు చేసారు, రిజిస్ట్రేషన్ రద్దు చేసినప్పటికీ ఎస్పీ ఆదేశాలతో ఈ ఘటనపై కేసు నమోదు, దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ జ్వాలా సాగర్ తెలిపారు.

# నూతన రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిని కలిసిన బీజేపీ శ్రేణులు



**ప్రత్తిపాడు, పెన్ పవర్, జూలై 5 :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన పీవీఎన్ మాధవ్‌ను శనివారం ఉదయం విశాఖపట్నంలోని ఆయన నివాసంలో కాకినాడ జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షులు చిలుకూరి రామ్‌కుమార్, జిల్లా వైస్‌ప్రెసిడెంట్ ఉమ్మిడి వెంకట్రావు ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా బీజేపీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్‌కి శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీకి ఆయన నేతృత్వం మరింత శక్తివంతంగా మారుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గంకి సంబంధించిన పలు ప్రజా సమస్యలపై రాష్ట్ర అధ్యక్షుడితో నేతలు చర్చించారు. పార్టీ బలోపేతానికి సంఘటితంగా పని చేయాలని మాధవ్ సూచించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో పైలా సుభాష్ చంద్రబోస్, ప్రత్తిపాడు మండల అధ్యక్షుడు ఊటా వీరబాబు, ఏలేశ్వరం టౌన్ బీజేపీ అధ్యక్షుడు పైలా అయ్యప్ప, ఏలేశ్వరం రూరల్ అధ్యక్షుడు నీలి సురేష్, రౌతులపూడి మండల అధ్యక్షుడు లవుడు శ్రీను, పూర్వ మండల అధ్యక్షుడు ఊటా శ్రీనివాస్, ఏలేశ్వరం రూరల్ వైస్‌ప్రెసిడెంట్ పతివాడ వెంకటేశ్వరరావు, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు చిట్రా పాపారావు, జిల్లా కార్యదర్శి బాలేపల్లి చక్రి, ప్రత్తిపాడు నియోజకవర్గ యువమోర్చా నాయకులు సోము సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



# జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ జయంతి



**అమలాపురం పెన్ పవర్ జూలై 5 :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా దుర్గా మల్లేశ్వర స్వామి కార్పెంటర్ చేతి వృత్తుల సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు దేవాదుల సూర్య నారాయణ మూర్తి ఆధ్వర్యంలో సంఘ కార్యాలయంలో సంఘ సభ్యులచే స్వర్గీయ జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సంఘ సభ్యులు నివాళులు అర్పించారు,అధ్యక్షులు మాట్లాడుతూ స్వర్గీయ జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ కృష్ణా జిల్లాలో అతి సామాన్య కుటుంబంలో జన్మించిన రావూరి కేవలం ఏడవ తరగతి వరకు మాత్రమే చదువుకున్నారని, చిన్ననాటి నుండి పేదరికంతో ఎన్నో ఇబ్బందులు పడుతూ సాహిత్యంతో మక్కువతో రచనా రంగం చేపట్టారని, ఆకాశవాణిలో, పాత్రికేయ రంగంలో పనిచేశారని, భారతదేశంలో తెలుగులో జ్ఞానపీఠ అవార్డులు పొందిన వారిలో ముగ్గురు అని మొదటగా విశ్వనాథ సత్యనారాయణ ద్వితీయంగా డాక్టర్ సి.నారాయణరెడ్డి తృతీయ భాగంగా భరద్వాజగారని," పాకుడు రాళ్లు " నవలా రచయితగా జ్ఞానపీఠ అవార్డు వచ్చినదని, పాకుడు రాళ్లు అంటే చిత్ర పరిశ్రమలో తెర వెనుక ఉండే నటీనటుల సాంకేతిక కార్మిక శ్రమ జీవుల యొక్క పాకుడు రాలేని రచనలో వ్రాసేరని, ఈ పాకుడు రాళ్లు తెలుగు నవల 850 పేజీలు ఉన్నదని,ఈయన రచనలు సుమారుగా 180 ఉన్నాయని, ఈయనకు అవార్డులు గోపీచంద్, రాష్ట్ర సాహిత్య అవార్డు, కేంద్ర సాహిత్య అవార్డులు, సాహిత్య రంగంలోనే రచయితగా జ్ఞానపీఠ అవార్డు పొందడం, ఈయన రచనలు నేటికి చిరస్థాయిగా నిలిచినవని, నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని, రావూరి భరద్వాజ తెలుగు ముద్దుబిడ్డని, తెలుగు వెలుగుని కొనియాడారు. ఈ కార్యక్రమంలోప్రధానకార్యదర్శి గున్నేపల్లి భీమ శంకరం, పితాని బేబీ రావు, సాధనాల రామకృష్ణ, కొనుకు వెంకటేశ్వరరావు,కేత సోమేశ్వరరావు, గానుగులసత్యనారాయణ, యాలంగిరామకృష్ణ పాలమూరు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే నెహ్రూను సత్కరించిన డిగ్రీ కాలేజ్ సిబ్బంది




**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 5 :** స్థానిక ప్రభుత్వ మోడరన్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చెన్నా రావు ఆధ్వర్యంలో శనివారం జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూను ఘనంగా సత్కరించి జ్ఞాపిక బహుక రించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చెన్నారావు మాట్లాడుతూ కొండలతో, గుట్టలతో ఉన్న ఈ ప్రాంతాన్ని ఆహ్లాదకరమైన వాతావరణంగా తీర్చిదిద్ది మోడల్ డిగ్రీ కళాశాలను ఎమ్మెల్యే నెహ్రూ నిర్మించారన్నారు. ఇప్పటికే గర్ల్స్ హాస్టల్ ఏర్పాటు చేయడం జరిగిందని బాయ్స్ హాస్టల్, కాంపౌండ్ వాల్ నిర్మించాలని ఎమ్మెల్యేని కోరారు. దీనిపై ఎమ్మెల్యే నెహ్రూ స్పందిస్తూ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తో మాట్లాడి నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, మారిశెట్టి భద్రం, అడబాల భాస్కరరావు, జంపన సీతారామచంద్ర వర్మ, దాసరి సీతారామకృష్ణ, కొండ్రోతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### కాట్రావులపల్లి పీహెచ్‌సీకి

# వైద్యాధికారులను నియమించండి



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 5 :** జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామంలోని పీహెచ్సీలో డాక్టర్ పోస్టు ఖాళీగా ఉండటంతో గ్రామంలోని ప్రజలు వైద్యం కొరకు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గ్రామ టిడిపి అధ్యక్షులు ముసిరెడ్డి నాగేశ్వరరావు కాకినాడలోని జిల్లా వైద్యాధికారి డాక్టర్ జె.నరసింహ నాయక్ ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. కాట్రావులపల్లి గ్రామానికి తక్షణం వైద్య అధికారులను నియమించి పీహెచ్సీలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులు భర్తీ చేయాలని డిఎంహెచ్వోను కోరినట్లు ముసిరెడ్డి నాగేశ్వరరావు తెలియశాజేశారు. తక్షణం స్పందించిన జిల్లా వైద్యాధికారి నరసింహ నాయక్ కాట్రావులపల్లి ఆసుపత్రికి ఒక లేడీ మెడికల్ ఆఫీసర్, ఒక జంట్ మెడికల్ ఆఫీసర్ ను నియమించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలియజేశారు. వెంటనే స్పందించి కాట్రావులపల్లి గ్రామానికి వైద్య అధికారులను నియమించేందుకు చర్యలు చేపట్టినందుకు జిల్లా వైద్యాధికారికి ముసిరెడ్డి నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

## కాజులూరులో వికసిత భారత్ ప్రచారం




**కాజులూరు,జూలై 5 పెన్ పవర్ :** భారతీయ జనతా పార్టీ కాజులూరు మండల శాఖ ఆధ్వర్యంలో వికసిత భారత్ 2047 ప్రచారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా బీజేపీ అధ్యక్షులు అడబాల సత్యనారాయణ పిలుపు మేరకు, కాజు లూరు గ్రామంలో జరిగింది.కార్యక్రమానికి మండల అధ్యక్షులు పుణ్యమంతుల శివాజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి జల జీవన్ మిషన్ ద్వారా కేంద్రం విస్తృతంగా నిధులు కేటాయించి మండలంలోని అన్ని గ్రామాల్లో మంచినీటి సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవతో వేగంగా పనులు కొనసాగుతు న్నాయని పేర్కొన్నారు. అలాగే ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన ద్వారా మండలంలో సుమారు 5 వేల మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందారని చెప్పారు. ముఖ్యంగా బీజేపీ ఎంపీటీసీ కొప్పన లక్ష్మి గారి ప్రయత్నాలతో జగన్నాథగిరిలో అనేకమంది ఈ సౌకర్యాన్ని పొందినట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి నరేంద్ర మోడీ 11 ఏళ్ల పాలన కార్యక్రమ మండల కన్వీనర్ పోలిశెట్టి శ్రీనివాస్ సమన్వయం వహించగా, మండల ప్రధాన కార్యదర్శులు నిమ్మన రాజేష్, వాసంశెట్టి రామకృష్ణ, మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులు జక్క శ్రీనివాస్, గుండారపు శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## అటవీశాఖ ఐటి ప్రొడక్ట్స్ సలహాదానికి ఘన స్వాగతం



**అమలాపురం/పి గన్నవరం పెన్ పవర్ జూలై 5 :** పి గన్నవరం నియోజకవర్గం ఉడిమూడి గ్రామ వాసి పెన్నమరెడ్డి నాగబాబుకి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ అటవీ శాఖ ఐటీ ప్రోడక్ట్ సలహాదారులుగా నియామతులైన సందర్భంగా ముందుగా మూడు రోడ్ల సెంటర్ లో అంబేద్కర్ విగ్రహనికి పూలమాల వేసి పి. గన్నవరం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నందు కార్యక్రమంలో భాగంగా స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. పి గన్నవరం శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ పి గన్నవరం నియోజకవర్గం టీడీపీ కన్వీనర్ నామన రాంబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు పెనమల లక్ష్మి సంసాని పెద్దిరాజు మేడిద సాయి మైపాలా తాతాజీ శెరు శ్రీనుబాబు పెదపూడి రాము, ఆరెగేల సూరిబాబు, అడబాల తాతకాపు, దొమ్మేటి సాయి కృష్ణ నూకపైయి ప్రసన్నకుమార్ కోర్లపాటి గోపి యడ్ల యేసు వాసంశెట్టి కుమార్ పెచ్చేట్టి ఈశ్వరరావు, తవిటికి బుజ్జి కొలనాటి పాలరాజు అయ్యగారి సూరిబాబు, కొప్పినీడి ఈశ్వరరావు, ముచర్ల సోమరాజు మరియు అధిక సంఖ్యలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వికలాంగ అనాధాశ్రమంలో భోజనాలు వితరణ



**అమలాపురం/ రాజోలు పెన్ పవర్ జూలై 5 :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలులో, హైదరాబాద్ చెందిన దొంగ ప్రభాకర్ రావు నాగలక్ష్మి దంపతులు కుమారుడు అర్జున్ ప్రీతం పుట్టినరోజు సందర్భంగా రాజోలు మనోజ్ మానసిక వికలాంగుల అనాధాశ్రమలో భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పంచదార చినబాబు చైర్మన్ లక్ష్మి పాల్గొన్నారు.

# రెండవ రోజు కొనసాగిన ఎలక్టోరల్ మేనేజ్మెంట్ శిక్షణ






**దేవీపట్నం,పెన్ పవర్, జూలై 5 :** అల్లూరి సీతారామరాజు జిల్లా 53 రంపచోడవరం(ఎస్.టి) శాసనసభ నియోజకవర్గానికి చెందిన బూత్ లెవెల్ ఆఫీసర్లకు ఎన్నికల జాబితా నిర్వహణపై శిక్షణా కార్యక్రమం కొనసాగింది. ఈ శిక్షణను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సబ్ కలెక్టర్ కల్పశ్రీ పర్యవేక్షిస్తు న్నారు. భారత ఎన్నికల సంఘానికి అనుబంధ సంస్థ అయిన ఇండియా ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్మెంట్ మార్గదర్శకాల్లో భాగంగా ఇది నిర్వహిస్తున్నారు.శనివారం జరిగిన రెండవ రోజు శిక్షణలో బ్యాచ్ నెం.2గా 51 మంది బూత్ లెవెల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.ప్రతి రోజు 50 మందికి చొప్పున మొత్తం 9 బ్యాచ్‌లలో 399 మంది బిఎల్ఓల కోసం ఈ శిక్షణ కొనసాగుతుంది. శిక్షణలో ఎలక్షన్ డీటీలర్ సునీత, మాస్టర్ ట్రైనర్ సుధా ప్రకాష్ మార్గనిర్దేశం చేశారు.

## మానుకొండ సూర్యవతి 32వ వర్ధంతి



**టీ నర్సాపురం, పెన్ పవర్, జులై 5 :** అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు మానుకొండ సూర్యవతి 32వ వర్ధంతి సభ స్థానిక ఎస్సార్ నగర్ లో జరిగింది. ఈ సందర్భంగా ఐద్వా మండల కార్యదర్శి మడకం కుమారి అధ్యక్షతవహించగా, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఏ శ్యామల రాణి మాట్లాడుతూ మానుకొండ సూర్యవతి 1921 లో జన్మించి గన్నవరం తాలూకా ఇందుపల్లి గ్రామంలో సంపన్న కుటుంబంలో జన్మించి స్వతంత్ర ఉద్యమంలో పాల్గొని క్రమశిక్షణ అనే సహజ లక్షణాలు సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా ఉద్యమాల్ని నిర్వహించారు.సమస్యల పరిష్కారానికి స్త్రీల విద్య కొరకు కృషి చేశారని, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా వితంతు పునర్వివాహాలు, విద్య కొరకు పని చేశారని దాన్ని సమాజంలో సగభాగంగా ఉన్న మహిళా చైతన్యం సనాతన భావాలకు వ్యతిరేకంగా మహిళలను సంఘటన పోరాటాలు నిర్వహించడమే కాక ఆచరణలో పెట్టి సరళీకరణ విధానాలు మహిళలపై భారాలు పెంచుతున్నాయని, స్త్రీలను వ్యక్తిత్వం ఉన్న మనిషిగా కాక సరిగ్గా చూపిస్తున్నారని అత్యాచారాల్లో లైంగిక దాడులు పెరుగుతున్నాయని, సమాజంలో భద్రత లేకపోవడం సూర్యావతి పంచాయతీరాజ్ ఎమ్మెల్సీ సర్పంచ్గా కూడా చేశారని తెలిపారు. ఈ ఉద్యమాల నిర్వహణ కోసం అహర్నిశలు పాటు పడ్డారన్నారు. 1993 జులై 4న అస్తమించారు ఆమె వర్ధంతి ఏ ఎస్ ఆర్ నగర్ లో జరిగిన సభ నివాళులర్పించింది కమిటీ సభ్యులు మండ్రు శిరీష బరగడ కుమారి మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వైసీపీ ఆరోపణలు అమాయక ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం

### - రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి



**దేవీపట్నం/రంపచోడవరం:/పెన్ పవర్/జూలై5 :** వైసీపీ మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి చేసిన వ్యాఖ్యలను రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి తీవ్రంగా ఖండించారు.శనివారం రంపచోడవరం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాది కాలంలోనే వేల కోట్లు తీసుకొచ్చి అభివృద్ధి,సంక్షేమం అందిస్తున్నామని చెప్పారు.సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ హామీలను ఇంటింటికీ తీసుకెళ్లి వివరించామని,ప్రజల నుంచి బ్రహ్మరథం అందుకుంటున్నామని తెలిపారు.ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయకత్వంలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి బాటలో సాగుతోందని పేర్కొన్నారు.గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం వల్ల గిరిజనులకు మంజూరైన సంక్షేమ పథకాలు కూడా అందలేదన్నారు.పింఛన్ 4000కి పెంపు,తల్లికి వందనం పథకం కింద ప్రతి విద్యార్థికి రూ.15,000,ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు అమలవుతున్నాయని వివరించారు.రాష్ట్రానికి దిగ్గజ కంపెనీలను తెస్తున్న లోకేష్ గారిని విమర్శించే అర్హత వైసీపీకి లేదు అని మండిపడ్డారు. అనంతబాబు హత్య ఘటనను ప్రస్తావిస్తూ...ఇటువంటి వారు మమ్మల్ని విమర్శించడానికి అర్హులు కాదు అని ధ్వజమెత్తారు.ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబు రమేష్,మార్కెట్ యార్డు చైర్మన్ లోత లక్ష్మణరావు,టిడిపి మాజీ అధ్యక్షులు అడబాల బాపిరాజు,కార్యదర్శి పెంటపాటి అనంత మోహన్, ఏఎంసి వైస్ చైర్మన్ సలాది బాపిరాజు,తదితరులు పాల్గొన్నారు.

### లోక్ అదాలత్‌లో

## 33 కేసులు పరిష్కారం



**అడ్డతీగల, పెన్ పవర్ ,జూలై05 :** శనివారం అడ్డతీగల మండల న్యాయ సేవాధికార కమిటీ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరిగింది. అడ్డతీగల లో 33 కేసులు రాజీ చేయడం జరిగింది ఇందులో చెక్ బౌన్స్ కేసులు 2, ఎక్సైజ్ కేసులు 5, మెయింటినెన్స్ కేసు 1, క్రిమినల్ కేసులు 25 పరిష్కారమయ్యాయని మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ ఎం.మురళి గంగాధర రావు తెలిపారు. ఇందులో న్యాయవాదులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా వంగవీటి మోహన్ రంగా 78వ జయంతి వేడుకలు



**కె.గంగవరం పెన్ పవర్ జూలై 5 :** కోట గ్రామంలో బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి స్వర్గీయ వంగవీటి మోహన్ రంగా గారి 78వ జయంతి వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాపు నాయకులు, ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు తోట త్రిమూర్తులు హాజరయ్యారు.రంగా విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యక్రమంలో పాల్గొన్న వారందరితో కలసి పంచుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ "స్వర్గీయ వంగవీటి మోహన్ రంగా గారు బడుగు, బలహీన వర్గాలకు ఆశాజ్యోతి, అందరి ఆరాధ్య దైవం. ఆయన జీవిత స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి" అని అన్నారు.ఈ కార్యక్రమంలో తోటబాబులు గ్రామ పెద్దలు, రంగ యూత్ కుర్రవాళ్ళు తదితరులు పాల్గొన్నారు.మండల కేంద్రమైన గంగవరం గ్రామంలో స్వర్గీయ వంగవీటి మోహన రంగా జయంతి వేడుకలు అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.గంగవరం మెయిన్ సెంటర్ ,దంగేరు రోడ్ సెంటర్ లో మోహన్ రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం విగ్రహం దగ్గర కేక్ కటింగ్ చేసి అందరికీ పంచారు.ఈ కార్యక్రమంలో వంగవీటి మోహన రంగా అభిమానులు భారీ ఎత్తున పాల్గొన్నారు. అదేవిధంగా సత్యవాడ,కుందూరు,కుడుపూరు, పామర్రు గ్రామంలో గ్రామ పెద్దలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



## ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

### - ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్



**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 5 :** ఆర్టీసీ (పి టి డి) ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించా లని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ఆర్టీసీ డిపో మెయిన్ గేటు వద్ద కార్మికులు శనివారం ఆందోళన చేపట్టారు. దీనిలో భాగంగా ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కామ్రేడ్ కెవి రావు మాట్లాడుతూ ప్రభుత్వం పరిధిలో పనిచేస్తున్న పిటిడి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు ఇప్పటికీ పరిష్కారానికి నోచుకోకపోవడం తో నిరసన కార్యక్రమాలు కు రాష్ట్ర కమిటీ ఆదేశించినట్లుగా ఆయన తెలిపారు.

ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులు మొదటి డ్యూటీ నుండి ఎర్రరిబ్బన్లు విధులకు హాజర య్యారన్నారు. పిటిడి ఉద్యోగులకు పదోన్నతులు వెంటనే కల్పించా లని, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రారంభించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 3000 కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, పదివేల మంది సిబ్బంది నియమించాలని కోరారు. ఉద్యోగ భద్రత సర్కులర్ 2019 సంవత్సరంలో జారీ చేసిన 1/2019 జీవోను యధావిధిగా అమలు చేయాలని, పాత పద్ధతిలోనే వైద్య సౌకర్యాలు కల్పించాలన్నారు.

11వ పిఆర్సి బకాయిలు చెల్లించాలని, 12వ పి.ఆర్.సి కమిషన్ వేసి ఐఆర్ ప్రకటించాలని, డిఏ బకాయిలు, ఎస్ ఆర్, బి ఎస్, ఎస్బిటి సొమ్ము ఇవ్వవలసిన వారికి ప్రకటించాలని, సిసిఎస్ కార్యాలయం తరలింపు, నిధులు దుర్వినియోగాన్ని అరికట్టాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వ సహాయంతో ఆర్టీసీ కొనుగోలు చేసి ఆర్టీసీ సిబ్బందితోనే నడపాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పదవి విరమణ పొందిన ఉద్యోగులకు ముందుండే ఆర్ ఈ ఎం ఎస్ స్కీమ్ వెంటనే అమలు చేయాలని, కాలం చెల్లిన బస్సులు బ్రేక్ డౌన్‌కు గ్యారేజీ ఉద్యోగులను బాధ్యులను చేయడం మానుకోవాలని, మహిళ ఉద్యోగులు, గ్యారేజీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తోట గంగారావు, ఎల్ ఎన్ రావు, జి.ఎస్.నారాయణ, ఎల్.వి.ఎస్ నారాయణ, ఆర్ ఎన్ బి రావు, బి ఎల్ రాజు, కె ఎస్ దొర, కె.బి దొర, కొండ, సిహెచ్. లోవరాజు, పల్ల ప్రసాద్, గ్యారేజీ చలం తదితరులు పాల్గొన్నారు.

## రంపచోడవరం అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక

### ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి





**దేవీపట్నం, పెన్పవర్, జూలై5 :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రంపచోడవరం నియోజకవర్గ అభివృద్ధికి కృషి జరుగుతోందని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి తెలిపారు.శనివారం ఐటీడీఏ సమావేశపు హాలులో సబ్ కలెక్టర్ కల్పశ్రీతో కలిసి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 దృష్టిలో ఉంచుకొని మండలాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అడవి ఉత్పత్తులు,పర్యాటక అభివృద్ధి, మెడికల్ కాలేజీ,ఓకేషనల్ శిక్షణా కేంద్రాల స్థాపన,చిరుధాన్యాలు,పచ్చళ్ళు,చేపల పెంపకం వంటి రంగాల్లో ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు.మద్ది గడ్డ రిజర్వాయర్ ప్రాంతాన్ని పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.జీడి మామిడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు,కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం ఐటీడీఏ చర్యలు చేపడుతోందన్నారు. అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పనిచేసి డేటా సమర్పించాలని సబ్ కలెక్టర్ కల్పశ్రీ సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలు తదితర శాఖలు అవసరమైన నివేదికలు సమర్పించాలని సూచించారు.ఈ సమావేశంలో జిసిసి డైరెక్టర్ జి.ఎస్.సునీత,పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్,ఇంజినీర్లు గాబ్రియల్,రవికుమార్,వ్యవసాయ శాఖ అధికారులతో పాటు పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలల్లో బోధన పద్ధతులు మెరుగుపర్చాలి

### ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి



**దేవీపట్నం,పెన్ పవర్,జూలై5 :** ఏజెన్సీ పాఠశాలల్లో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలన్నారు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం.శనివారం బందపల్లి గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల,అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మికంగా పర్యటించి పలు అంశాలు పరిశీలించారు.

**విధ్య బోధనపై ఆదేశాలు.. :** విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమయ్యేలా బోధించాలన్న ఆయన, మెను నిబంధనల మేరకు అమలు చేయాలని ఆదేశించారు. పాఠ్య పుస్తకాలు, నోటుపుస్తకాల సరఫరా స్థితిని, విద్యార్థుల హాజరును, సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. పాలు, గుడ్లు, కోడి మాంసం సరఫరా తీరుపై సమీక్ష నిర్వహించారు. సీజనల్ వ్యాధులకు వైద్యం కల్పించాలని సూచించారు.





**అంగన్వాడి కేంద్రంలో సమీక్ష.. :** అంగన్వాడిలో పిల్లల సంఖ్యతో పాటు గర్భిణులు, బాలింతల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆటపాటల ద్వారా పిల్లలకు విద్య బోధించాలని చెప్పారు.

**సీతపల్లిలో పర్యటన.. :** సీతపల్లి మండల పరిషత్ పాఠశాల పరిరక్షణ, పాఠ్యపుస్తకాల సరఫరాపై సమీక్షించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ నిబంధనల మేరకు అమలు చేయాలన్నారు.

## ఆర్టీసీ కార్మికుల ధర్నా



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్,జులై 5 :** ఆర్టీసీ గ్యారేజ్ వద్ద ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండి ఆలీ ఆధ్వర్యంలో రెండోరోజు శనివారం ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎఐటియుసి ఏరియా అధ్యక్షుడు ఓ.వి.రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలీ మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమీషన్ వెంటనే నియమించాలని, లేకపోతే ఐ.ఆర్. ప్రకటించాలని కోరారు. పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా 3000 కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, ప్రభుత్వం ప్రకటించిన మహిళలకు ఉచిత ప్రయాణం స్కీం సక్సెస్ కావాలంటే కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్త బస్సులు ప్రవేశపెట్టాలని తెలిపారు. అర్హులైన ఆర్టీసీ ఉద్యోగులందరికీ పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు ఇవ్వాలని, ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పది వేల మంది సిబ్బంది నియామకాల కు ప్రభుత్వం వెంటనే అనుమతి ఇవ్వాలని కోరారు.ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ నే సొంతంగా కొనుగోలు చేయాలని, వాటిని ఆర్టీసీ సిబ్బంది తోనే నిర్వహించాలని,పెండింగ్ డిఎలు, బకాయిలు తో సహా చెల్లించాలని, డబుల్ డ్యూటీ చేసే సిబ్బంది డిడి మొత్తాన్నిపెంచాలని, కాలం చెల్లి న బస్ ల బ్రేక్డౌన్‌కు గ్యారేజ్ సిబ్బంది ని భాద్యులును చేసి అక్రమ చార్జ్ షీట్ లు ఇచ్చేవిధానాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిపో సెక్రటరీ కే. శ్రీను, భాషా, బి.ఎన్.రాజు, శివ, కే.శ్రీనివాస్, సువర్ణ రాజు, మురళి, ఆర్.ఎల్. కుమారి, సలేషా, ప్రకాష్, యాభై మంది సభ్యులు పాల్గొన్నారు.

## జిల్లా వైయస్సార్సీపీ అధికార ప్రతినిధిగా కాశి రామకృష్ణ



**అమలాపురం పెన్ పవర్ జూలై :** జిల్లా వైఎస్ఆర్సీపీ అధికార ప్రతినిధిగా ముమ్మిడివరం మండలం కొమనపల్లికి చెందిన కాశి రామకృష్ణ ఎంపిక అయ్యారు. ఎంపిక చేసిన వైయస్సార్సీపి అధినేత జగన్మోహన్ రెడ్డికి,జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి కి. ముమ్మిడి వరం మాజీ శాసనసభ్యులు పొన్నాడ వెంకట సతీష్ కుమార్ కి,మాజీ మంత్రి విశ్వరూప్ కి ధన్యవాదాలు తెలుపుతూ పార్టీ ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కూటమి పార్టీ చేపడుతున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను నిలదీస్తాను అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ఏజెన్సీ భూముల్లో గిరిజనేతరుల అక్రమ కట్టడాలు తక్షణమే తొలగించాలి

### - గిరిజన సంఘాల డిమాండ్





**చింతూరు, పెన్ పవర్, జూలై 5 :** ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరులు అక్రమంగా కబ్జా చేసిన భూములపై గిరిజన సంఘాలు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశాయి. గిరిజనుల హక్కులు కాపాడేందుకు రూపొందించిన 1/70 భూసంరక్షణ చట్టాన్ని గిరిజనేతరులు తూట్లు పొడుస్తున్నారనీ, ఇది న్యాయ విరుద్ధమని పేర్కొన్నారు. గిరిజనేతరులు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, ప్రార్థనా మందిరాలు, హోటళ్ల పేరుతో పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపట్టి గిరిజన భూములను ఆక్రమించుకుంటున్నారని మండిపడ్డారు. హైకోర్టులో నడుస్తున్న వివిధ కేసుల్లో, గతంలో ఇచ్చిన తీర్పుల్లోనూ ఈ కట్టడాలు చట్ట విరుద్ధమని స్పష్టమైందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రెవెన్యూ, అటవీ, ఐటిడిఏ శాఖల సమన్వయంతో గిరిజనేతరుల కబ్జాలను తొలగించాలని, కాకపోతే ప్రజా ఉద్యమాలు తారాస్థాయికి చేరుతాయని హెచ్చరించారు. ప్రభుత్వ ఉత్తర్వు నం.188 ప్రకారం కూడా ఏజెన్సీ భూముల్లో గిరిజనేతరుల కట్టడాలు అనుమతిలేనివేనని గుర్తు చేశారు. గిరిజనుల హక్కులను కాపాడేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి.

## సాధ్యమైనంత త్వరగా అర్జీలు పరిష్కరించాలి

### మండల ప్రత్యేక అధికారి బి.రాంప్రసాద్



**సీతానగరం, పెన్ పవర్, జూలై 05 :** సీతానగరం మండలంలోని శనివారంనాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవో మూర్తి ఆధ్వర్యంలో మండల ప్రత్యేక అధికారి బి. రాంప్రసాద్ మండల అధికారులతో సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన జరగబోయే మెగా పేరెంట్స్ మీటింగ్ కు విద్యాశాఖ అధికారికి పలు సూచనలు తెలిపారు, తల్లికి వందనం గ్రీవెన్స్ అర్జీలపై సాధ్యమైనంతవరకు అర్జీలు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు, హౌసింగ్ ఏఈ యు.సుబ్రహ్మణ్యం ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఇనగంటి వారి పేట హౌసింగ్ లే అవుట్ పరిశీలించి ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేసే క్రమంలో లే అవుట్ లలో మౌలిక సదుపాయాలు కల్పన కోసం ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని తెలిపారు, పి.4 కార్యక్రమంపై మండల స్థాయి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు, ఈ కార్యక్రమంలో ప్రాథమికవైద్య అధికారి డాక్టర్ఏవీకే చైతన్య, మండలం తాసీల్దార్ శ్రీనివాస్, ఎంపీహెచ్ఓ వైఎస్ రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## 9 కేజీల గంజాయి స్వాధీనం.. నలుగురు అరెస్ట్



**అమలాపురం పెన్ పవర్ జూలై 5 :** అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని ఐ.పోలవరం మండలం, మురమళ్ల పుష్కర ఘాట్ వద్ద తొమ్మిది కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని నలుగురు యువకులను అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు,మురమళ్ల పుష్కర ఘాట్ వద్ద గంజాయి కలిగి ఉన్నట్లు గుర్తించిన పోలీసులు తనిఖీలు నిర్వహించి నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుండి 9 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన నలుగురిలో ముగ్గురు పాత నేరస్థులుగా పోలీసులు గుర్తించారు.ఈ కేసులో మరొక వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. గంజాయి కలిగి ఉన్నా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. జిల్లాలో గంజాయి నిరోధానికి కఠిన చర్యలు తీసుకుంటామని, అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించేది లేదని పోలీసులు స్పష్టం చేశారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దాతృత్వంలో మునిగిన భక్తి.. జగన్మోహిని కేశవ స్వామికి విరాళం




**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 5 :** ర్యాలి గ్రామంలో వెలిసిన పురాతనమైన దేవాలయం శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయం శనివారం వేకువ జామున ఆలయ స్వామివారికి విశిష్ట సేవ పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకులు ఖండవల్లి సీతారామాచార్యులు అత్యంత అద్భుతంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వ్యక్తిగత భక్తి అంతరంగాన్ని మించి, సమాజానికి సాయపడే స్థాయికి చేరుకుంటే అది పవిత్రతకు ప్రతీకగా మారుతుంది. అలాంటి ఓ అరుదైన ఉదాహరణ రావులపాలెం గ్రామానికి చెందిన గోరింట అయ్యప్ప వెంకట రామకృష్ణ కుమార స్వామి రాజు. భక్తిశ్రద్ధలతో శ్రీ జగన్మోహిని కేశవ&గోపాలస్వామి దేవస్థానాన్ని సందర్శించారు. స్వామివారి సన్నిధిలో నమ్మకంతో, కృతజ్ఞతతో ఆయన తన దాతృత్వాన్ని వ్యక్తపరిచారు. మానవ సేవే మాధవ సేవ అనే తత్వాన్ని ఆచరణలో పెట్టారు. ఈ దర్శన సమయంలో, ఆయన ఆలయానికి మొత్తం 20,348 రూ, విరాళాన్ని సమర్పించారు. ఇందులో భాగంగా శ్రీ స్వామి వారి అన్నదాన పథకానికి రూ.5,116, ఒక సంవత్సరం పాటు నిత్య గోత్ర నామార్చన కోసం 10,116 రూ, ప్రతి శుక్రవారం నిర్వహించే కుంకుమార్చన కార్యక్రమానికి 5,116 రూ ను విరాళంగా సమర్పించారు. ఈ విరాళాలు కేవలం ఆర్థిక సాయమే కాకుండా, ఆయన అంకితభావాన్ని, భక్తి మార్గంలో దాటి సమాజానికి తన వంతు సేవ చేసే తపనను ప్రతిబింబిస్తున్నాయి. ఆలయ ప్రధాన అర్చకులు, విశేష భక్తులతో కలిసి ఆయనకు శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వారి ఆశీర్వచనాలు అందజేశారు. ఆయురారోగ్యాలతో, కుటుంబ సమృద్ధితో ఆయన్ను శ్రీ స్వామి వారు కాపాడాలని ప్రార్థించారు. ఈ తతంగం ఆలయ ప్రాంగణాన్ని భక్తి భావంతో నింపింది. "ఇలాంటి భక్తులే ఆలయ పరిరక్షణకు, సేవా కార్యక్రమాల విజయానికి మూలస్తంభాలు," అని దేవస్థానం అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆలయ అధికారి ఎ.శ్రీనివాసు భక్తులు పాల్గొన్నారు.

## నేను బడికి పోతా కార్యక్రమం

### ఎంఈఓ హెచ్ఎంలకు సూచనలు





**టీ నర్సాపురం, పెన్ పవర్, జూలై 5 :** మండల కేంద్రం నందు నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా టి. నర్సాపురం మండలంలో ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత, ఉన్నత పాఠశాల, ప్రధానోపాధ్యాయులందరికీ సమావేశము ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశము నందు గ్రామములోని అందరూ 5 సంవత్సరాలు దాటిన విద్యార్థులను 100% శాతం పాఠశాలల్లో చేర్పించే విధంగా ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని, 6 నుండి 14సం. పిల్లలందరూ బడిలోనే ఉండాలని ఏ ఒక్క పిల్లవాడు బడిబయట ఉండకూడదని దీనిపై డ్రైవ్ నిర్వహించాలని, ప్రతి పాఠశాలలో తల్లిదండ్రుల మీటింగ్స్ నిర్వహించి, విద్యార్థులందరినీ బడిలో చేర్పించే కార్యక్రమం అందరూ జరపాలని మండల విద్యాశాఖ అధికారులు, మండల తహసీల్దార్ ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నేను బడికి పోతా అనే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంఈఓ టి.రామ్మూర్తి తెలిపారు.

# దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి




**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 5 :** దేశవ్యాప్తంగా జూలై 9న నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐసీసీటియు రాష్ట్ర నాయకుడు గొడుగు సత్య నారాయణ, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జున్ రావు లు పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ (ఎంఎల్ ) లిబరేషన్ కార్యాలయంలో ఆల్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (ఏ.ఐ.సి.సి.టి.యు) ఏలేశ్వరం ఏరియా సమావేశం శనివారం నిర్వహించారు.జిల్లా నాయకుడు గుర్రం వీరబాబు అధ్యక్షతన జరిగిన సమావేశానికి గొడుగు సత్య నారాయణ, ఏగుపాటి అర్జున్ రావు లు సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్లకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్లను తెచ్చిందని, ఫలితంగా విశాల కార్మికవర్గం తమ హక్కులను, చట్టాలను కోల్పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పని గంటలు పెంచుతూ తీసుకున్న నిర్ణయంతో పాటు మహిళలకు రక్షణ లేని ప్రస్తుత కాలంలో రాత్రి వేళల్లో మహిళలు పని చేయాలని తీసుకున్న నిర్ణయాలను తక్షణం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణం, ఆటో, హమాలీ తదితర అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు అందరికీ భద్రత కల్పించాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, స్కీమ్ వర్కర్లు అందరినీ రెగ్యులర్ చేసి, వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలని, ప్రభుత్వ శాఖలలో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

నేడు పెరిగిన ధరల ప్రకారం అన్ని రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు కనీసవేతనం 41 వేలు ఇవ్వాలని, విద్యా-వైద్యాన్ని ప్రభుత్వమే అన్ని వర్గాల ప్రజలకు ఉచితంగా అందించాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ లాంటి ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని, ఉపాధిహామీ పథకంలో కనీస వేతనం రూ. 600లు, 200 పనిదినాలు కల్పించాలన్నారు. వీటిని సాధించుకోవడం కోసం జూలై 9న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో అన్నివర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సమ్మె ప్రచారానికి సంబంధించిన కర పత్రాలను విడుదల చేశారు. ఈసమావేశంలో వివిధ సంఘాల కార్మిక నాయకులు పి.వీరబాబు, పి.అర్జునరావు, ఏ. నాగమణి, ఏ. రత్నం, ఏ.నాగరాజు, పి.నాగేశ్వరరావు,కె.చినరాజు, ఏ.గుర్రాజు, పి.నాగమణి, ఏ.ఎన్.రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏజెన్సీలో ప్లాస్టిక్ నిర్మూలనపై సబ్ కలెక్టర్ దిశానిర్దేశం

### పర్యావరణ పరిరక్షణ బాధ్యత మనందరిపై.... చెత్త కుండీలు,డిస్ప్లే బోర్డులతో అవగాహన పెంచాలి.. ప్లాస్టిక్ వినియోగం ఎక్కడైనా కనిపిస్తే చర్యలు తప్పవు... రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ..





**దేవీపట్నం, పెన్ పవర్, జూలై5 :** ఏజెన్సీలో పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ వినియోగం నిర్మూలనపై ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ పిలుపునిచ్చారు. శనివారం ఐటీడీఏ సమావేశ హాలులో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పర్యటక ప్రాంతాల్లో టూరిస్టులు ప్లాస్టిక్ ఉత్పత్తులు వాడకుండా, చెత్త కుండీల్లోనే వేసేలా అవగాహన కల్పించాలని సూచించారు.

డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్,వ్యవసాయ శాఖ అధికారులు సిహెచ్.కెవి.చౌదరి, సావిత్రి, సర్కిల్ ఇన్స్పెక్టర్ రవికుమార్,అటవీ శాఖ అధికా రులు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ కిట్లు అందజేత

### - జనసేన మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ - జనసేన మండల మహిళా అధ్యక్షురాలు బి.ప్రమీలరాణి



**వి.ఆర్.పురం, పెన్‌పవర్, జూలై 5 :** మండలంలోని వడ్డిగూడెం గ్రామంలో శనివారం మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ,జనసేన మండల మహిళా అధ్యక్షురాలు బాగుల ప్రమీలరాణి ఆధ్వర్యంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ కిట్లు,ఇన్సూరెన్స్ ఐ.డి. కార్డులు పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా జనసేన మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ మాట్లాడుతూ నిరంతరం ప్రజా శ్రేయస్సు కోరే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్,సంవత్సరం కాలంలోనే అవినీతి లేని పాలన,గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నారని,అన్నారు.గిరిజనుల పట్ల చూపిస్తున్న శ్రద్ధ,ప్రేమ అంతా ఇంతా కాదని,గ్రామ పంచాయతీల అభివృద్ధే లక్ష్యమని పేదల కన్నీరు తుడిచే పార్టీ జనసేన పార్టీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బాగుల అంజనరావు,సహాయ కార్యదర్శిలు ముంజపు శ్రీరామ్, మాచర్ల వేణు బాబు,యూత్ నాయకులు పెడపెట్ల పవన్ కళ్యాణ్, ముంజపు సాయిరాం,గూటాల సమ్మరాజు, కాపారపు పవన్ కుమార్,బొర్రా రాజేష్, గూటల పుల్లేష్,పొద్దుల అప్పన్న,చోడే గంగాధర్, కెచ్చల పోసిరెడ్డి,ముత్యాల సింహాద్రి,పిడుగురాళ్ల నాగేంద్ర,కోట్ల అమ్మాజీ,కడుపు కుమారి, కామేశ్వరి జన సైనికులు,వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు మేలు చేసే పాలన మాది

### జగ్గంపేటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 5 :** కూటమి పాలనలో అమలవు తున్న సంక్షేమం, జరుగుతున్న అభివృద్ధిపై ప్రజల్లో సంతృప్తి కనబడుతుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వ్యాఖ్యానించారు. శనివారం జగ్గంపేట మర్రిమొక్క వీధిలో జగ్గంపేట టౌన్ టిడిపి అధ్యక్షులు పాండ్రంగి రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రజలకు ఏడాది సుపరిపాలన తొలి అడుగు కరపత్రాలను పంపిణీ చేస్తూ రాష్ట్రంలోనూ, నియోజకవర్గంలోనూ జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ప్రజలతో మాట్లాడారు. అందుతున్న సంక్షేమం, జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ వైసీపీలా తమది పరదాల పాలన కాదని, ప్రజాపాలన అని తెలిపారు. జగన్ ప్రజల్లోకి రావడానికే భయపడేవారని, పరదాలు కట్టుకుతిరిగేవారని, నేటి ప్రజాపాలనలో మన ముఖ్యమంత్రి నిత్యం ప్రజల్లోనే ఉంటున్నారన్నారు. నాడు అరాచకం రాజ్యమేలితే నేడు అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో జరుగుతుందన్నారు. జగ్గంపేటకు కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రాబోయే నాలుగు సంవత్సరాల్లో జగ్గంపేట పట్టణానికి శుద్ధి చేసిన మంచినీరు, రైతులకు సాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్యం, వాకింగ్ ట్రాకు, పట్టణ యువతకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమలు కూడా స్థాపిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, వేములకొండ జోగారావు, కొండ్రోతు శ్రీను, కింగంరమణ, సుంకర బ్రదర్స్,సందక బ్రదర్స్, మారిశెట్టి గంగ, మర్రి మొక్క వీధి, సంఘం వీధి, పల్లపు వీధి కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే ముప్పిడి



**తాళ్ళపూడి, పెన్ పవర్, జూలై 5 :** మండలంలోని తాడిపూడి గ్రామంలో శుక్రవారం సుపరి పాలన తొలి అడుగు డోర్ టు డోర్ కార్యక్రమంలో పాల్గొన్న కొవ్వూరు నియోజకవర్గ శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వర రావు. ముందుగా గ్రామంలోని డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, పనులను వివరించారు. అదేవిధంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని వివరించారు. త్వరలో కూటమి ప్రభుత్వం చేపట్టబోయే కార్యక్రమాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నామా కొండబాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించొద్దు




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జులై 5 :** స్మార్ట్ మీటర్లు , ట్రూ అప్ ఛార్జీలు, విద్యుత్ ఛార్జీలు పెంపుపై ప్రభుత్వం పునరాలోచించుకోవాలని లేనిపక్షంలో వీధి పోరా టాలకు సైతం వెనుకాడ బోమని సిపిఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు హెచ్చరిం చారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని నిలిపివేయాలని, అదానీతో సోలార్ విద్యుత్ ఒప్పందం రద్దు చేయాలని, ట్రూఅఫ్ ఛార్జీలు రద్దు చేయాలని, విద్యుత్ ఛార్జీలు తగ్గించా లని కోరుతూ సబ్ స్టేషన్ వద్ద సిపిఐ నాయకులు శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నాగేశ్వరరావు మాట్లాడుతూ పెరుగుతున్న విద్యుత్ భారాలపై ప్రజలకు షాక్ లు కొడుతున్నాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో 4 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి కోట్లాది రూపాయల భారం ప్రజలపై మోపారని నిప్పులు చెరిగారు. అదానీ విద్యుత్ ఒప్పందం వల్ల వచ్చే పాతికేళ్లు నెల నెలా ప్రజలు అదనంగా డబ్బు కట్టాల్సిం దేనని దీనిపై పునరాలోచిం చాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక్కో స్మార్ట్ మీటరుకు 18 వేలు ఖర్చువుతోందని దీన్ని ఎవరిపై రుద్దుతారని ఆయన ప్రశ్నించారు. నెలా నెలా ఇచ్చే విద్యుత్ బిల్లులో స్మార్ట్ మీటర్లు బిల్లులు సైలెంట్ గా కలిపేస్తారని ఆయన విమర్శించారు. స్మార్ట్ మీటర్లతో కరెంట్ యూనిట్లు రెండు, మూడు రెట్లు అదనంగా నమోదవు తాయని, వాటిని బిగిస్తే తిరుగుబాటు తప్పదని మండల నాగేశ్వరరావు హెచ్చరించారు. అనంతరం విద్యుత్ సబ్ స్టేషన్ సిబ్బంది బి.హనుమంతు, ఎ.వి.వి.సత్యనారాయణలకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు వర్మ, నాగరాజు నాగలక్ష్మి, ఎస్.వరలక్ష్మి, ఎస్.భవాని, కె.లక్ష్మి, కె.పోలమ్మ జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## అవ్వ గుడిసెకు మానవతా ఆశ్రయం



**పెన్ పవర్, ఉంగుటూరు, జులై 5 :** ఉంగుటూరు మండలం కైకరం గ్రామం 12వ వార్డులో నివసించే వాసె కాంతమ్మ (80) అనాథ జీవితం గడుపుతోంది. నలుగురు సంతానముండి ఉండాల్సిన ఈ వృద్ధ మహిళకు భర్త మరణిం చిన 20 సంవత్సరాలుగా ఎవరూ తోడు లేకుండా జీవితం సాగిస్తున్నారు. ఇంటి గుడిసె నాలుగు వైపులా గుంజలు జారిపోవడంతో ఏ క్షణమైనా కూలిపోవచ్చనే భయంతో గడిపేస్తున్నారు. గ్రామ వార్డు సభ్యుడు నత్త వెంకటేశ్వరరావు మానవతా దృక్పథంతో స్పందిం చారు. కాంతమ్మకు రోజూ రెండు పూటలా భోజనం ఏర్పాటుచేయడమే కాదు, గుడిసె ప్రమాదకరంగా ఉందని మానవతా స్వచ్ఛంద సంస్థ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మానవతా రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి, మండల కమిటీ అధ్యక్షుడు కోనె వీర వెంకట సత్యనారాయణ వెంటనే స్పందించారు. గుడిసెకు మరమ్మత్తులు చేసి నిలువునీడ కల్పించేందుకు ముందుకు వచ్చారు. స్థానికులు మానవతా సభ్యుల దయా గుణానికి హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అన్నదాన పథకానికి విరాళం



**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 5 :** మండల పరిధిలోని తిరుపతి గ్రామంలో కొలువైన శ్రీదేవీ, భూదేవీ సమేత శృంగార వల్లభ స్వామి వారికి దాతలు అన్నదాన పథకానికి విరాళం అందించారు. రాజానగరం మండలం ముక్కినాడ గ్రామానికి చెందిన అన్నదాసు సాయిరాం, స్వాతిమణి దంపతులు రూ. 1,08,000 విరాళం అందజేసినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులకు అర్చకులు వేద ఆశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు పెద్దింటి పురుషోత్త మాచార్యులు, పెద్దింటి నారాయణచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌చార్జ్ ఎం.పి.డి.ఓగా ఎ.పి.ఎల్.నరసింహం

**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 5 :** అంబాజీపేట మండల పరిషత్ ఇన్ చార్జ్ ఎం.పి.డి.ఓ గా ఎ.పి.ఎల్. నరసింహం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తా మండల అభివృద్ధి కి కృషిచేస్తానని అన్నారు. మండల పరిషత్ అధ్యక్షులు దొమ్మేటి వెంకటేశ్వరరావు, మండల ఎం.పి.టి.సి. సమాఖ్య అధ్యక్షులు ఎం.ప్రశాంత్, డిప్యూటీ ఎం.పిడి.ఓ, కె.శ్రీనివాస్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, గ్రామపంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛం అందచేసారు.

## పోలీసులంటే భయాన్ని తొలగించడమే లక్ష్యం

గ్రామస్తులతో మమేకమైన సివిక్ యాక్షన్ కార్యక్రమం

కమాండెంట్ పార్థసారథి








**చింతూరు, పెన్ పవర్, జూలై 5 :** గ్రామీణ ప్రజలతో మమేకం అవుతూ, వారి నిత్యావసరాలు తీర్చడమే లక్ష్యంగా సివిక్ యాక్షన్ కార్యక్రమాన్ని సిఆర్పిఎఫ్ 219 బెటాలియన్ నిర్వహించింది. చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా, కుంట మండలంలోని ఎట్టగట్ట గ్రామంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. కమాండెంట్ పార్థసారథి ఘోష్, అసిస్టెంట్ కమాండెంట్ లలిత ఆదిత్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులకు రేడియోలు, వ్యవసాయ పరికరాలు, టార్చ్ లైట్లు, పంచెలు, వృద్ధులకు దుప్పట్లు, మహిళలకు రగ్గులు, విద్యార్థులకు బాగులు, ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులతో కలిసి సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమాండెంట్ పార్థసారథి మాట్లాడుతూ, గ్రామస్తుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, ప్రభుత్వంపై విశ్వాసాన్ని పెంపొందించడం, పోలీసులంటే భయం పోవడం, ప్రజలతో మమేకం కావడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముకుర్ తోంగ్, ఎట్టగట్ట, గేరపాడ గ్రామాల ప్రజలు, సిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా పద్దాలమ్మ అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు



**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 5 :** పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామంలో భక్తుల పాలిట కొంగు బంగారంలా విరాజిల్లుతున్న పద్దాలమ్మ అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు శనివారం అత్యంత వైభోపేతంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు, విశేష అర్చనలు, అభిషేకాలు, హెూమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

# గిరిజన విద్యార్థులపై పర్యవేక్షణ అవసరం

- తాడేపల్లి, బూసుగూడెం ఆశ్రమ పాఠశాలల పరిశీలన.. - బేస్‌లైన్ పరీక్షలతో విద్యార్థుల ప్రగతిని మదింపు చేయాలి..

- నాణ్యమైన బోధనపై ఉపాధ్యాయులు శ్రద్ధ పెట్టాలి.. : డిప్యూటీ డైరెక్టర్





**దేవీపట్నం,పెన్ పవర్, జూలై5 :** ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల విద్యా ప్రమాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ,విద్యా ప్రగతిని బలపరచాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య అన్నారు.శనివారం మారేడుమిల్లి మండలంలోని తాడేపల్లి, రంపచోడవరం మండలంలోని బూసు గూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ,ప్రతి విద్యార్థి ఎలా చదువుతున్నాడో తెలుసుకునే విధంగా బేస్‌లైన్ పరీక్షలు నిరంతరం నిర్వహించాలి. అలాగే విద్యా నాణ్యతపై అధిక శ్రద్ధ పెట్టాలి. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు గమనించాలని సూచించారు. విద్యార్థులకు ఆహారంలో పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం రూపొందించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ భోజనాన్ని అమలు చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు, అధికారులు క్రమం తప్పకుండా పాఠశాలలను పర్యవేక్షిస్తూ సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డైరెక్టర్ సూచించారు.

# కాకినాడలో టీడీపీ కాపు నాయకుల సమావేశం




**కాకినాడ, జూలై 5 పెన్ పవర్ :** కాకినాడలో ఈ రోజు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా టీడీపీ కాపు నాయకుల సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశం రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన వంగవీటి మోహన్ రంగ తనయుడు వంగవీటి రాధా గారిని పార్టీ నేతలు ఘనంగా సన్మానించి, భారీ గజమాలతో స్వాగతం పలికారు.ఈ సమావేశంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరపుల సత్యప్రభ రాజా, ఎమ్మెల్సీ పేరబత్తుల రాజశేఖరం, అమలాపురం టీడీపీ నాయకులు గంధం పల్లంరాజు, తోట నవీన్,



మొటుకూరి వెంకటేష్ (తుని), వాసిరెడ్డి యేసుదాసు (కాకినాడ రూరల్), ఆకుల రామకృష్ణ (కొత్తపేట), అల్లాడి శరత్, చిక్కాల గణేష్ (అమలాపురం), రాయపు రెడ్డి రాజా (ముమ్మిడివరం), ఎస్.ఎన్. రాజా, మెట్ల రమణ బాబు, ఆరేటి ప్రకాష్, చింతపల్లి అర్జున్, ఆనంద్ న్యూటన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో కాపు సామాజిక వర్గం రాజకీయ బలోపేతం, కాపు సామాజిక వర్గాల సంక్షేమం, మరియు టీడీపీ పార్టీని జిల్లాలో మరింత బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా సానా సతీష్ బాబు మాట్లాడుతూ, కాపు నాయకులు ఐక్యంగా పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి ముందుకు రావాలని సూచించారు. అలాగే, ప్రభుత్వ సంక్షేమ పథకాల విశేషాలను ప్రజలకు వివరిస్తూ, పార్టీ పునాదులను మరింత బలపర్చాలని పిలుపునిచ్చారు.

# మానవత్వం చాటుకున్న సీఐ విద్యాసాగర్

- ప్రమాదంలో పడ్డ వ్యక్తికి వెంటనే సహాయం

**రావులపాలెం పెన్ పవర్ జూలై 5 :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలంలో మానవతా విలువలు కలిగిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఆలమూరు మండలం బందోబస్తు విధుల్లో పాల్గొంటూ జొన్నాడ గోదావరి బ్రిడ్జిపై నుంచి రావులపాలెం వైపు వెళ్తున్న రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్, బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదాన్ని గమనించి తక్షణమే స్పందించారు. ఒక ద్విచక్రవాహన దారుడు ప్రమాదవశాత్తూ కింద పడిన దృశ్యాన్ని చూశారు. వెంటనే తన పోలీస్ వాహనాన్ని ఆపి, హుటాహుటిన తన జీపులో ఆ బాధితుడిని తీసుకుని రావులపాలెంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అతనికి కాలుపై తీవ్ర గాయమై, ఫ్రాక్చర్ అయ్యిందన్న అనుమానంతో వైద్య సిబ్బందికి వివరాలు చెప్పారు. బాధితుడి బంధువులకు సమాచారం ఇవ్వాలంటూ, ఆసుపత్రి సిబ్బందికి స్పష్టమైన సూచనలు చేశారు. ఈ ఘటనను చూశిన ప్రయాణికులు, స్థానిక ప్రజలు సీఐ విద్యాసాగర్,మానవతా స్పందనను గుండెతట్టించే చర్యగా అభివర్ణిస్తూ, ప్రశంసలతో ముంచెత్తారు. "ఇలాంటి పోలీస్ అధికారులే సామాజికానికి ఆశాజ్యోతి" అంటూ పలువురు అభినందనలు తెలిపారు. అలాగే, సమాచారం అందుకున్న బాధితుడి బంధువులు కూడా వెంటనే ఆసుపత్రికి చేరుకుని సీఐ విద్యాసాగర్ గారికి మరియు పోలీస్ సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ విద్యాసాగర్ మీడియాతో మాట్లాడుతూ "బాధితుడు తణుకు సమీపంలోని ఇరగవరం ప్రాంతానికి చెందినవాడు, ప్రాణాపాయం ఏమీ లేదు,





ప్రస్తుతం క్షేమంగా ఉన్నాడు" అని తెలిపారు. ఈ ఘటన మరోసారి నిరూపించింది. ఒక పోలీస్ అధికారి కేవలం చట్టాన్ని అమలు చేసే వ్యక్తి మాత్రమే కాకుండా, మానవత్వాన్ని కాపాడే రక్షకుడిగా కూడా నిలవగలడు.

## పాల గుమ్మిలో సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే ఆనందరావు




**అమలాపురం రూరల్ పెన్ పవర్ జూలై 5 :** సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికి తెలుగుదేశంలో భాగంగా అమలాపురం రూరల్ మండలం పాలగుమ్మి గ్రామంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పాల్గొన్నారు, ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి కూటమి ప్రభుత్వం ఏడాది చేసిన సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి, గ్రామస్తుల సమస్యలను తెలుసుకొని త్వరలోనే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే ఆనందరావు హామీ ఇచ్చారు .ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు,ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, రాష్ట్ర టిడిపి సెల్ అధ్యక్షులు పొలమూరి ధర్మపాల్, మాజీ జెడ్ పి టి సి అధికారి జయవెంకటలక్ష్మి బాబ్జి, అమలాపురం రూరల్ మండల టిడిపి అధ్యక్షులు చొల్లంగి సాయిబాబు, మట్టా మహాలక్ష్మిప్రభాకర్, దేవరపల్లి వీరేష్ కుమార్, మాజీ అమలాపురం రూరల్ మండల టిడిపి అధ్యక్షులు మల్లుల పొల్లయ్య, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు చంటిరాజు, పాలగుమ్మి సూర్య నాగ శ్రీనివాసరావు, దొమ్మేటి వెంకటేశ్వరరావు, విశ్వంధరాజు, ఈశ్వరప్రసాద్,ప్రసాద్, రాజబాబు , సతీష్,.బి. శ్రీకృష్ణ, వెంకటేశ్వరావు. పేరి సత్యనారాయణమూర్తి., జగన్నాధ రాజు,గనిశెట్టి సత్యనారాయణ, కుడిపూడి వెంకటేశ్వరరావు,మంద గెద్దయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్స్ రద్దుకు 9న బంద్ : సిఐటియు పిలుపు




**పెన్ పవర్, ఉంగుటూరు, జూలై 5 :** కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్స్ రద్దు కోసం ఈనెల 9న జరిగే బంద్‌ను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు పిలుపునిచ్చారు. శనివారం ఉంగుటూరు మండలంలో ఆయన అంగన్వాడీ, ఆశా వర్కర్లు, ఆటో డ్రైవర్లు, ఫ్యాక్టరీ కార్మికులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రస్తుత కార్మిక చట్టాల అమలులోనూ కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లిస్తూ వెట్టి చాకిరి చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఇక లేబర్ కోడ్స్ అమలులోకి వస్తే బానిసత్వమే గతి" అని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్స్ రద్దు కోసం చేపట్టిన పోరాటంలో ప్రతి కార్మికుడు పాల్గొనాలని, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు నారపల్లి రమణారావు, మండల అధ్యక్షుడు సీరా అప్పారావు, సిఐటియు మండల నాయకులు సుజాత, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## అంబరాన్నంటిన బుక్కా సంబరం



**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 5 :** భక్తుల పాలిట కొంగుబంగారంలా విరాజిల్లుతున్న పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో శనివారం బుక్కా సంబరం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆషాఢమాస జాతర మహెూత్సవాల్లో భాగంగా జాతర ప్రారంభమైన రెండవ గురువారం రాత్రి అమ్మవారికి కుంభం వేసి ఆలయాన్ని మూసివేస్తారు. శనివారం ఆలయాన్ని తెరచి సంప్రోక్షణ నిర్వహించిన అనంతరం బుక్కా సంబరం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గరగ నృత్యాలు, మేళతాళాలతో నిర్వహించిన ఈసంబరంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## సుపరిపాలనలో తొలి అడుగు మూడో రోజు



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జూలై 5 :** సుపరిపాలనలో తొలి అడుగు మూడో రోజు శనివారం తాడేపల్లిగూడెం నియోజకవర్గం లో కొనసాగింది. మాధవరం, జగన్నాధపురం, మారంపల్లి, నవాబుపాలెం, పట్టణంలోని 14 వ వార్డులో ఈ కార్యక్రమం కొనసాగింది. మండలంలో జరిగిన కార్యక్రమాల్లో పార్టీ ఇంచార్జి భవన నిర్మాణ కార్మికుల సమైక్య చైర్మన్ వలవల బాబ్జి, టైలర్స్ సమాఖ్య చైర్మన్ ఆకాశం స్వామి, మాజీ ఎంపీపీ మండల పార్టీ అధ్యక్షుడు పరిమి రవికుమార్, మాజీ సర్పంచ్ ముత్యాల సత్యనారాయణ, ముప్పిడి రమేష్, నవాబు పాలెం సొసైటీ మాజీ అధ్యక్షుడు వీరభద్రరావు, రామకృష్ణ, వాడపల్లి సుబ్బరాజు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మద్దుకూరు ధనరాజు, మాజీ సర్పంచ్ బల్నేడి కృష్ణ, వివిధ గ్రామాల టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఏపీఐఐసీ చైర్మన్ టిడిపి జిల్లా అధ్యక్షుడు రామరాజు పట్నంలోని 14 వ వార్డులో పర్యటించారు. ఏడాది కాలంలో ప్రభుత్వం చేసి కార్యక్రమాలను రాబోయే కాలంలో చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గత ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ఎలా ఉందని అమ్మ దీవెన ఖాతాలో పడిందా అని ప్రశ్నలతో నాయకులు ప్రజలను సందించారు. త్వరలో రైతు సుఖీభవ పథకం తో పాటు ఆగస్టు 15వ తేదీ నుండి ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు నాయకులు వివరించారు. జగన్నాధపురం రైతులకు త్వరలో ఇన్పుట్ సబ్సిడీ అందిస్తున్నామని, ధాన్యం సొమ్ము పడని రైతులకు ప్రభుత్వం వారి ఖాతాలో జమ చేస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయా గృహాల వద్ద తెలుగుదేశం పార్టీ ముద్రించిన కరపత్రాలను ప్రజలకు అందించారు.

# వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

స్వామి వారి సేవా కార్యక్రమాలతో భక్తిశ్రద్ధల ఉత్సవం







**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 5 :** వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం వేకువ జామున మొదలైన పూజా కార్యక్రమాలు, స్వామి దర్శనార్థం తరలివచ్చిన భక్తుల నిబిడీభావం, సేవా కార్యక్రమాల్లో భక్తుల చురుకుదనం అంతా కలసి ఆలయాన్ని భక్తిమయ వాతావరణంతో నింపాయి. ప్రదక్షిణ మార్గంలో ఉన్న హుండీ వద్ద భక్తులు తాము మొక్కుకున్న మొక్కుబడులను, ముడుపులను సమర్పిస్తూ తమ విశ్వాసాన్ని వ్యక్తపరిచారు. ఆలయ ప్రధాన ద్వార సమీపంలో శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి వారు భక్తులకు దర్శనమిస్తూ అచంచల భక్తిని రేకెత్తించారు. ఈ దర్శనానికి తరలివచ్చిన భక్తులు శ్రద్ధాభక్తులతో స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే, శ్రీ వేంకటేశ్వర స్వామి వసంత మండపంలో నిర్వహించిన వేద ఆశీర్వచన కార్యక్రమంలో వేద పండితులు వేదమంత్రాలు పారాయణం చేసి, భక్తులకు ఆధ్యాత్మిక స్ఫూర్తిని అందించారు. అనేక మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వచనాలు పొందారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు క్యూలైన్లో వేచి ఉన్న చిన్నపిల్లలకు పాల పంపిణీ కూడా



నిర్వహించారు. ఇది చిన్నారులను ఉల్లాసంగా ఉంచడంలో ఉపయోగపడింది. శ్రీవారి మాడ వీధుల్లో, "గోవింద... గోవింద..." నినాదాలతో భక్తులు నడిచారు. నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ ముందుకు సాగిన భక్తుల తారకమంత్రాలు ఆలయ ప్రాంగణాన్ని మారుమోగించాయి. స్వామి వారి ఆలయానికి హైకోర్ట్ జడ్జి వి. వెంకట జ్యోతిర్మయి ప్రతిప, ఆమె భర్త వి.శ్రీనివాసు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.ఎస్ చక్రధర్ రావు , వారిని సత్కరించి శ్రీ స్వామివారి చిత్రపటం బహూకరించారు. అంతేగాక, శ్రీనివాస పార్కింగ్ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కూడా నిర్వహించబడింది. భక్తులు మృదుస్వభావంతో సేవా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.ఈ తతంగమంతా వాడపల్లి దివ్య క్షేత్రంలో భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మికత సేవా భావన ఏకకాలంలో ఎలా వికసిస్తాయో చెప్పకనే చెప్పింది. భక్తుల తీర్థయాత్రకు, మానసిక పరిపక్వతకు ఇది ఒక మరిచిపోలేని అనుభవంగా నిలిచింది.

## సుపరిపాలన తొలి అడుగు పాల్గొన్న అమలాపురం ఎమ్మెల్యే



**అమలాపురం పెన్ పవర్ జూలై 5 :** పట్టణంలో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అమలాపురం పట్టణ టిడిపి అధ్యక్షులు తిక్కిరెడ్డి నేతాజీ, రాష్ట్ర వాణిజ్య విభాగం కర్రి రామస్వామి,నల్లా స్వామి, అబ్బాయి వెంకన్న,దిన్నా బాబు, గెల్లా మినాకుమారి. కుంచె రమేష్, గంధం శ్రీను,వలవల శివరావు, నల్లా చిట్టి, నల్లా సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శృంగార వల్లభ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ



**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 5 :** పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో కొలువై తొలి తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీదేవీ, భూదేవీ సమేత శృంగార వల్లభ స్వామి వారి దివ్యక్షేత్రం శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీగా మారింది. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకొనేందుకు వేకువజాము నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ సాంప్రదాయాల ప్రకారం స్వామి వారికి నిత్య కైంకర్యాలను అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులను అనుమతించారు. స్వామి వారిని ఈరోజు సుమారు పదిహేను వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 1,65,640, అన్నదాన విరాళాల ద్వారా రూ. 1,89,962, కేశఖండన ద్వారా రూ. 5040, తులాభారం ద్వారా రూ. 350, లడ్డు ప్రసాదం ద్వారా రూ. 23,970, మొత్తం రూ. 3,84,962, ఆదాయం సమకూరినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం పులిహోర ప్రసాదం, సుమారు మూడు వేల ఐదు వందల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణచార్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## హౌసింగ్ లే అవుట్ లలో అంతర్గత రహదారులకు, మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వండి : జేసీ చిన్న రాముడు





**కొవ్వూరు, పెన్ పవర్, జులై 5 :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహ నిర్మాణాల పనులను పూర్తి చెయ్యడంలో క్షేత్రస్థాయి అధికారులు పర్యవేక్షణ చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు పేర్కొన్నారు. ప్రతి శనివారం హౌసింగ్ డే సందర్భంగా క్షేత్రస్థాయిలో పర్యటించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా శనివారం కొవ్వూరు మండలం పరిధిలోని స్పిక్ పేజ్ 2 లే అవుట్ అధికారులతో కలిసి జేసి పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు మాట్లాడుతూ మధ్యలో నిలిచిపోయిన ఇళ్ళ నిర్మాణాల పనులను పూర్తి చెయ్యడంలో లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి అవగాహన పెంచాలన్నారు. గృహ నిర్మాణ కోసం ప్రభుత్వం అందజేస్తున్న అదనపు ఆర్థిక సహాయంతో స్టేజి కన్వర్షన్ విధానంలో దృష్టి సారించాలన్నారు. గృహ నిర్మాణాలు కోసం కేటాయించిన లే అవుట్లలో అంతర్గత రహదారుల విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వానికి ఆ మేరకు ప్రతిపాదన పంపాలని స్పష్టం చేశారన్నారు. జాయింట్ కలెక్టర్ వెంట హౌసింగ్ డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ శేఖర్ బాబు, తహసిల్దార్ దుర్గా ప్రసాద్, హౌసింగ్ ఏఈ చక్రవర్తి, మున్సిపల్ ఏఈ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పడిపోయిన వంతెనను పరిశీలించిన మెర్ల గారపాటి



**ఆలమూరు, పెన్ పవర్,జూలై 05 :** పినపళ్ళ నుంచి మండపేట గొల్లపుంతకు వెళ్ళే దారిలో గొడ్డుకాలువ మీద ఉన్న పురాతన వంతెన కూలిపోవడంతో అక్కడి రైతులకు ఇబ్బందులు ఏర్పడ్డాయని ఆలమూరు నీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ మెర్ల గోపాలస్వామి, చింతలూరు నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ చౌదరి అన్నారు. శనివారం వారిరువురు పడిపోయిన వంతెనను పరిశీలించారు. ఈ క్రమంలో మురుగునీటి పారుదల అధికారి పోచారావుతో మెర్ల గోపాలస్వామి ఫోన్లో మాట్లాడారు. త్వరలోనే పడిపోయిన వంతెనను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని పోచారావు తెలిపినట్లు మెర్ల గోపాలస్వామి తెలిపారు.

## నందంపూడి-వాకలగరువు రహదారి, బ్రిడ్జిని పరిశీలించిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ





**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 5 :** మండలంలోని నందంపూడి, వాకలగరువు ప్రధాన రహదారిని పి గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారిని అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు కృషి చేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

అనంతరం స్థానిక ప్రజలను వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని త్వరితగతిన పరిష్కరిస్తానని ఎమ్మెల్యే అన్నారు. బ్రిడ్జి ప్రాంతంలోని వర్షాకాలంలో వరద ముంపు సమస్యను దృష్టిలో పెట్టుకొని, బ్రిడ్జి పక్కన రిటైనింగ్ వాల్ నిర్మించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట శిరిగినీడి వెంకటేశ్వరరావు, ఎం.పి.టి.సి.లు వాకపల్లి దొరబాబు, వడ్లమాని పద్మావతి, నాయకులు మైపాల తాతాజీ, పేరాబత్తుల పెద సుబ్బరాజు, వాసంశెట్టి కుమార్, అరిగెల సూరిబాబు, సిహెచ్ రాజు, పితాని వీరాస్వామి, కేతా అర్జునుడు, విప్పర్తి నారాయణరావు, బెండ శ్రీను, పితాని రమేష్, ఏడిద నాగబాబు, పితాని బుజ్జి, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్ట్



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 5 :** జగ్గంపేట మండలం వెంగయ్యమ్మపురం గ్రామ శివారు పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో శనివారం జగ్గంపేట ఎస్సై టి.రఘునాధరావు సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రూ.5050 స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ రఘునాధరావు తెలిపారు. అలాగే ఇటీవల నమోదు చేసిన ఏడు కేసుల్లో 24 మంది పేకాట రాయుళ్లను శనివారం కోర్టులో ప్రవేశపెట్టగా ఒక్కొక్కరికి 300 రూపాయలు చొప్పున రూ.7200 జరిమానా విధించినట్లు సీఐ వై ఆర్ కే శ్రీనివాస్ తెలిపారు. జూదాలకు పాల్పడితే చర్యలు తప్పవని వై ఆర్ కె హెచ్చరించారు.

## జిల్లా వ్యాప్తంగా జూలై 10న మెగా పిటియం 2.0



**కాకినాడ, జూలై 5 పెన్ పవర్ :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 2.0 (మెగా పిటియం 2.0) కార్యక్రమాన్ని జూలై 10వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు మరియు జూనియర్ కాలేజీల్లో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి సూచించారు. శనివారం ఒక ప్రకటనలో కలెక్టర్ ఈ వివరాలను తెలియ జేశారు. ఈ కార్యక్రమం ద్వారా తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల పరస్పర సమన్వయం పెంపొందించడానికి, విద్యార్థుల విద్య, ప్రవర్తన, సామాజిక అవగాహన వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ లక్ష్యం ఉత్తమ మానవ వనరులను తీర్చిదిద్దడం అని కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లాలోని 1876 పాఠశాలల్లో 2,78,932 మంది విద్యార్థులు మరియు 141 జూనియర్ కళాశాలల్లో 45,344 మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. అన్ని విద్యా సంస్థల్లో నాలుగు రోజుల ముందుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీలు, పిటిఏలకు సూచనలు జారీ చేసినట్టు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమం అంశాల వారీగా: ఆహ్వానం, బడ్జెట్, పరిశుభ్రత, సుందరీకరణ, పర్యావరణ భద్రత, రెసెప్షన్, క్రమశిక్షణ, పార్కింగ్, వైద్య సహాయం, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు, తల్లికి వందనం, మీడియా కవరేజీ మొదలైన వాటికి ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగించాలని కలెక్టర్ ఆదేశించారు.గ్రీన్ పాస్ పోర్ట్ %-% అమ్మపేరుతో ఒక మొక్క కార్యక్రమం క్రింద విద్యార్థులు మొక్కలు నాటేలా ప్రోత్సహించాలనీ, ఆ ఫోటోలు పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి గ్రీన్ పాస్ పోర్ట్ జారీ చేయాలన్నారు. తల్లులకు పాదాభివందనం, తల్లుల కోసం ముగ్గులు, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, తండ్రుల కోసం టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించాలన్నారు.కార్యక్రమాల ఫొటోలు, 30%-%40 సెకండ్ల లైవ్ వీడియోలు (లీప్) (పిటిఎం) మాడ్యూల్ లో అప్‌లోడ్ చేయాలని, మార్గదర్శకాలు కూడా అదే యాప్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.విద్యా శాఖ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, యాజమాన్యాలు, పిటిఏలు సమిష్టిగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## శ్రీవనదుర్గాదేవి అమ్మవారి ఆలయంలో ముద్రగడ ప్రత్యేక పూజలు





**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 5 :** మండల కేంద్రమైన కిర్లంపూడి నుండి రాజుపాలెం వెళ్లే దారిలో వేంచేసియున్న శ్రీ వన దుర్గాదేవి అమ్మవారిని మాజీ మంత్రి, రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం, ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడగిరిబాబు శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ముద్రగడ పద్మనాభం, ముద్రగడ గిరిబాబులకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారిని దర్శించుకోవడమే కాకుండా, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. అమ్మవారి ఆలయ అభివృద్ధికి సహకరి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో జగపతినగరం మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మండలంలో కూటమి నేతలు తొలి అడుగు కార్యక్రమం





**కాజులూరు, పెన్ పవర్ జూలై 5:** మండల పరిధిలోని గొల్లపాలెం, ఆర్యవటం తదితర గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో కూటమి నాయకులు పర్యటించారు. కూటమి ప్రభుత్వ పాలన ఏర్పడి ఏడాది కావస్తుంది. ఏడాది పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందని టిడిపి పార్టీ సీనియర్ నాయకులు కోట తాతబ్బాయి అన్నారు. కూటమి నాయకులతో కలిసి ఆర్యవటం గ్రామంలో శనివారం ఆయన ఇంటింటికి కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. అలాగే గొల్లపాలెం తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు నక్క శ్రీను ఆధ్వర్యంలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రభు త్వం ఏర్పడిన అనంతరం చేసినటువంటి అభివృద్ధిని ఆయన ప్రజలకు వివరిస్తూ పార్టీ కరపత్రాలు పంపిణీ చేశారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి కానుందని ఆయన స్థానిక ప్రజలకు వివరించారు. అంతేకాక స్థానికంగా ఉన్న ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని కూడా త్వరలో పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు స్పష్టం చేశారు . ఇంటింటా ప్రచార కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షులు అత్తిలి వెంకన్న, కూటమి నాయకులు పెంకి అప్పారావు, ఆర్య టు గ్రామ కమిటీ అధ్యక్షులు కురుపూడి దొరబాబు, పలివెల రాజు పాల్గొన్నారు.

## వైభవంగా వారాహి అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు






**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 5 :** కోనసీమ ప్రాంతంలో మొట్టమొదటిగా శ్రీ వారాహి అమ్మవారి ఆలయాన్ని నిర్మించడంతో భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారని ఆలయ పురోహితులు మాచి రాజు తెలిపారు . మాచవరం శ్రీ పార్వతీ రాజేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవం పురస్కరించుకొని శనివారం పంచామృత అభిషేకములు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయాన్ని పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా అర్చకులు మాచరి రాజా ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

## నారాయణపురం కాలువ గట్టు రోడ్డులో భారీ వాహనాలకు గెడ్డర్లు బిగింపు





**ఉంగుటూరు పెన్ పవర్, జూలై 5 :** ఏలూరు వద్ద శిథిలావస్థలో ఉన్న వంతెనను మూసివేయడంతో నారాయణపురం కాలువ గట్టు మట్టి రోడ్డుపై ట్రాఫిక్ భారం పెరిగింది. సింగిల్ లైన్ మార్గమైన ఈ రహదారిలో కార్లు, లారీలు, ఆటోలు, స్కూల్ బస్సులు వెళ్లడం వల్ల తరచూ ఇరుకు సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ మార్గంలో వందలాది ఎకరాలకు సాగునీటిని అందించే సాగునీటి టన్నెల్ ఉండటంతో, 26 నుంచి 35 టన్నుల బరువు వాహనాల రాక వల్ల టన్నెల్ దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పంచాయతీ చర్యలకు దిగింది. సర్పంచ్ దిడ్ల అలకనందశ్రీను ఆధ్వర్యంలో శనివారం ఇనుము గెడ్డర్లు తెప్పించి కాలువ గట్టు రోడ్డులో రెండు చోట్ల బిగించారు. దీంతో ఇకపై భారీ వాహనాల రాక పూర్తిగా నిలిచిపోయింది. పంచాయతీ కార్యదర్శి గోపిశెట్టి కార్తీక్, సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామస్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారీ వాహనాల రాకను అడ్డుకున్న పంచాయతీ, పోలీసులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే 14వ వార్డులో మట్టి రోడ్డును సిమెంట్ రోడ్డుగా మార్చాలని నెక్కంటి కృష్ణ తదితరులు కోరారు. దీనిపై స్పందించిన సర్పంచ్ అలకనందశ్రీను, "ప్రతిపాదనలు పంపాం. నిధులు లభించిన వెంటనే పనులు చేపడతాం," అని వెల్లడించారు.

## మా ఎమ్మెల్యే ను విమర్శించే స్థాయి ధనలక్ష్మికి లేదు : స్థాయిని మరిచి మాట్లాడవద్దు



**కూనవరం,పెన్ పవర్,జులై 5 :** కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సర కాలంలో చేసిన అభివృద్ధి, సూపర్ సిక్స్ ఫలాల అమలుపై మండల పార్టీ అధ్యక్షుడు బారపాటి ప్రకాష్ రావు అధ్యక్షతన పార్టీ కార్యాలయం నందు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మాజీ జెడ్పిటిసి కన్యకా పరమేశ్వరి,మాజీ ఎంపీపీ పోడియం అప్పారావు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి ఎమ్మెల్యే శిరీష దేవిని విమర్శించే స్థాయి లేదని లేదని అన్నారు. 2022 వరదలు వచ్చినప్పుడు వరద ముంపు గ్రామాలలో పర్యటించి ప్రజలకు భరోసా కల్పించలేదని,ఎమ్మెల్సీ అనంత బాబు లేకుండా గ్రామాల్లో పర్యటించలేని మీరు మా ఎమ్మెల్యేని విమర్శిస్తారా అని అన్నారు.ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు బోదునూరు నుండి ఏడు గుర్రాల పల్లి వరకు రహదారి వేస్తామని ప్రజలకు మాట ఇచ్చి నెరవేర్చలేదని మీరు మా ఎమ్మెల్యేని విమర్శిస్తారా మీ స్థాయిని మరిచి మాట్లాడవద్దని అన్నారు. అనంతరం సూపర్ సిక్స్ పథకాలపై ప్రజల వద్దకు వెళ్లి అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి వెళ్లి కరపత్రాలను ఇవ్వాలని,ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఫలాలను ప్రజలకు తెలియజేయాలని సమావేశంలో అన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డిపాటి ప్రసాద్,చెలికాని ఉమా, గడేసుల ప్రేమ్చంద్,మాజీ సర్పంచ్ సునీత, సత్య నారాయణ, ఆదినారాయణ,క్లస్టర్ ఇన్చార్జిలకి, యూనిట్ ఇన్చార్జ్, బూతు కమిటీ సభ్యులు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు.

# అర్థాంతరంగా కూలిన మురుగు కాలువ వంతెన

– రెండు మండలాల్లోని వందలాది ఎకరాల సాగుపై ప్రభావం – ఎమ్మెల్యే బండారు సహకారంతో వంతెన నిర్మాణం

– పరిసర ప్రాంత రైతులకు గ్రామ సర్పంచ్ సుభాష్ హామీ





**ఆలమూరు, పెన్ పవర్,జూలై 05 :** ఆలమూరు మండలంలోని పినపళ్ల నుంచి గొల్లపుంత మీదుగా మండపేట వెళ్లేందుకు మూడున్నర దశాబ్ధాల క్రిందట 1990-92 మధ్య కాలంలో అప్పటి కాంగ్రెస్ పార్టీ హయాంలో పశుసంవర్ధకశాఖ మంత్రిగా పనిచేసిన సంగిత వెంకటరెడ్డి సహకారంతో నిర్మించిన వంతెన హఠాత్తుగా కూలిపోయింది. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఆగ్రామ రైతులకు మరింత సహకారం అందించాలన్న ఉద్ధేశ్యంతో ఈవంతెన రూపుదిద్దుకుంది. దీంతో మురుగుకాలువకు ఇరువైపుల వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతులకు వంతెన కూలిపోవడం తీవ్ర ఇబ్బందికరంగా మారింది. మండపేట, వల్లూరు ఆయుకట్టు భూమికి సంబంధించి మురుగు కాలువ వెంబడి సుమారు 800 ఎకరాల్లో ప్రతియేటా వరిసాగు చేపట్టడం పినపళ్ల రైతులకు ఆనవాయితీగా వస్తుంది. దీంతో నారుమడులు పూర్తి చేసి వరినాట్లు వేసేందుకు సన్నద్ధమైన తరుణంలో వంతెన హఠాత్తుగా కూలిపోవడం రైతులకు శాపంగా మారింది. అలాగే మురుగు కాలువ సమీపంలో నిర్మించిన శ్రీకృష్ణ ప్రభాస్ పేపరుమిల్లుకు చెందిన వ్యర్థపునీరు బయటకు వెళ్లేందుకు కూడా అంతరాయం కలగనుంది. దీనివల్ల ప్రత్యక్షంగాను, పరోక్షంగాను స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదమేర్పడింది.

**ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోతే ఇబ్బందే :**

వంతెన పునః నిర్మాణానికి చర్యలు తీసుకోకపోతే ఇబ్బందులు తప్పవని, జీవనోపాధిని కోల్పోతున్నామనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతుంది. స్థానిక పంటకు అవసరమైన ఎరువులు, పురుగు మందులను తరలించడంతో పాటు వ్యవసాయ పనులు చేపట్టేందుకు మండపేట నుంచి వయా గొల్లపుంత మీదుగా పినపళ్ల సరిహద్దులో ఉన్న ఆయుకట్టు భూమికి రావలసి ఉంది. దీనివల్ల వ్యయ ప్రయాసలకు గురయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సర్పంచ్ సంగిత సుభాష్, ఎంపీటీసీ పెదిరెడ్డి పట్టాభి, ఏఎంసీ మాజీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు సంఘటనా స్థలానికి విచ్చేసి పరిస్థితిని సమీక్షించి సమస్యను సంబంధిత ఉన్నతాధికారులకు నివేదించారు. పినపళ్ల గొడ్డు కాలువ వంతెనపై కూలిపోయిన వంతెన పునః నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని సర్పంచ్ సంగిత సుభాష్ తెలిపారు. ఈవంతెన శిథిలావస్థకు చేరిందని భావించి ముందస్తు జాగ్రత్త చర్యగా మూడేళ్ల క్రితమే ఇరిగేషన్ అధికారులు నివేదించి ప్రతిపాదనలు సిద్ధం చేయించామన్నారు. వంతెన కూలిపోవడం వల్ల రైతులకు కలిగే నష్టాన్ని, ఇబ్బందులను సత్వరమే నియోజకవర్గ స్థాయి ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి మరోసారి తీసుకువెళతానని ఆయన రైతులకు హామీ ఇచ్చారు.

## మా ఎమ్మెల్యే ను విమర్శించే స్థాయి ధనలక్ష్మికి లేదు : స్థాయిని మరిచి మాట్లాడవద్దు



**కూనవరం,పెన్ పవర్,జులై 5 :** కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సర కాలంలో చేసిన అభివృద్ధి,సూపర్ సిక్స్ ఫలాల అమలుపై మండల పార్టీ అధ్యక్షుడు బారపాటి ప్రకాష్ రావు అధ్యక్షతన పార్టీ కార్యాలయం నందు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మాజీ జెడ్పిటిసి కన్యకా పరమేశ్వరి,మాజీ ఎంపీపీ పోడియం అప్పారావు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి ఎమ్మెల్యే శిరీష దేవిని విమర్శించే స్థాయి లేదని లేదని అన్నారు. 2022 వరదలు వచ్చినప్పుడు వరద ముంపు గ్రామాలలో పర్యటించి ప్రజలకు భరోసా కల్పించలేదని,ఎమ్మెల్సీ అనంత బాబు లేకుండా గ్రామాల్లో పర్యటించలేని మీరు మా ఎమ్మెల్యేని విమర్శిస్తారా అని అన్నారు.ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు బోదునూరు నుండి ఏడు గుర్రాల పల్లి వరకు రహదారి వేస్తామని ప్రజలకు మాట ఇచ్చి నెరవేర్చలేదని మీరు మా ఎమ్మెల్యేని విమర్శిస్తారా మీ స్థాయిని మరిచి మాట్లాడవద్దని అన్నారు. అనంతరం సూపర్ సిక్స్ పథకాలపై ప్రజల వద్దకు వెళ్లి అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి వెళ్లి కరపత్రాలను ఇవ్వాలని,ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఫలాలను ప్రజలకు తెలియజేయాలని సమావేశంలో అన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డిపాటి ప్రసాద్,చెలికాని ఉమా, గడేసుల ప్రేమ్చంద్,మాజీ సర్పంచ్ సునీత, సత్యనారాయణ, ఆదినారాయణ,క్లస్టర్ ఇన్చార్జిలకి,యూనిట్ ఇన్చార్జ్, బూతు కమిటీ సభ్యులు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో మృతి చెందిన వెంకటేష్ కుటుంబ సభ్యులను పరామర్శించిన సర్పంచ్, ఉప సర్పంచ్



**తాళ్ళపూడి, పెన్ పవర్, జులై 5 :** పెద్దేవం గ్రామంలో ఇటీవల విద్యుత్ షాక్ తో ముదునూరి వెంకటేష్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం కుటుంబ సభ్యులను గ్రామ సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ప్రభుత్వం నుంచి వచ్చే సహాయ, సహకారాలు అందేలా చూస్తామని అన్నారు. వార్డు మెంబర్ మైలవరపు రాధాకృష్ణ, బెజవాడ వీర్రాజు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

## ప్రత్తిపాడులో ముద్రగడ ఆధ్వర్యంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతికి భారీ ఏర్పాట్లు



**ప్రత్తిపాడు, పెన్ పవర్, జూలై 5 :** ప్రత్తిపాడులో ఈనెల 8వ తేదీన మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు ఏర్పాట్లు నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ రామిశెట్టి నాని తెలిపారు. జులై 8వ తేదీ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా మండలంలో ఓమ్మంగి గ్రామంలో రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి మండల కన్వీనర్ రామిశెట్టి నాని రంగుల వేయించి రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను గ్రామంలో భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒమ్మంగి గ్రామంలో వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు జయంతి వేడుకల్లో పాల్గొంటారని రామిశెట్టి నాని తెలిపారు.

## మానవత్వం చాటుకున్న సీఐ విద్యాసాగర్





**ఆలమూరు, పెన్ పవర్, జూలై 05 :** రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఒక వ్యక్తిని హుటాహుటీన ప్రైవేటు ఆస్పత్రికి తరలించి రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్ మానవత్వం చాటుకున్న సంఘటన ఆలమూరులో శనివారం జరిగింది. 216 ఏ జాతీయ రహదారిలోని ఆలమూరు గౌతమీ గోదావరి కొత్త వంతెనపై నాలుగు చక్రాల వాహనం ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో అటువైపు వెళుతున్న సీఐ విద్యాసాగర్ ఈప్రమాద దృశ్యం కంటపడింది. హుటాహుటీన గాయపడ్డ ఆవ్యక్తిని సాటి వాహనదారుల సాయంతో తన జీప్‌లో ఎక్కించుకుని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స చేయించిన అనంతరం గాయపడిన వ్యక్తిని పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం గ్రామానికి చెందిన తేతలి దుర్గాప్రసాద్‌రెడ్డిగా గుర్తించారు.

ఆమేరకు సేకరించిన వివరాల ద్వారా బంధువులకు సమాచారాన్ని అందించి మెరుగైన వైద్యం అందించేందుకు సహకరించారు. అలాగే గత జూన్ 13న ఈవంతెనపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకోబోతున్న మహిళను రక్షించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

## ఇంటిగ్రేటెడ్ క్రిమినల్ జస్టిస్ సిస్టం 2.0

- ఏపీ జైలు శాఖ ఐజి ఇండ్ల శ్రీనివాసు.ను కమిటీ ఆన్ ఆడిట్ ఆఫ్ టెక్నాలజీ ఇన్ ప్రిజన్స్ చైర్మన్ గా నియమించిన కేంద్రం

- జైళ్లలో అత్యాధునికరణ పనులకు శ్రీకారం, కేంద్ర ప్రభుత్వం పోలీస్, న్యాయవ్యవస్థ జైల్ శాఖ అనుసంధాన ప్రక్రియ





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం, జూలై 5 :** కేంద్ర ప్రభుత్వం పోలీస్ న్యాయవ్యవస్థ జైల్స్ సౌజన్యంతో ఇంటిగ్రేటెడ్ క్రిమినల్ జస్టిస్ సిస్టం 2.0తో కేంద్ర ,రాష్ట్ర జైళ్లలో అత్యాధునిక టెక్నాలజీ వ్యవస్థ కు శ్రీకారం వివరాలు తెలియపరిచిన ఆంధ్రప్రదేశ్ జైలు శాఖ ఐజి ఇండ్ల శ్రీనివాస్. విశాఖ కేంద్ర కారాగారం లో విలేకరులతొ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న జైళ్లలో సూపరిండెంట్లకు14 లాప్టాప్ 108 కంప్యూటర్లు ప్రింటర్లు స్కానర్లు మంజూరు చేయడం జరిగిందని,జిల్లా,కేంద్ర, మహిళల కారాగారాల సూపరిండెండెంట్ లకు14 లాప్టాప్ లు, కంప్యూటర్లు ఇవ్వడం జరిగిందని, ఖైదీలకు సంబంధించిన సమాచారాన్ని నిక్షిప్తపరిచి సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ ఎఫైర్స్ కి అనుసంధానం చేయడం జరుగుతుందని సమాచార సౌలభ్యత కోసం వీటిని అనుసంధానం చేయడం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా ఈ ప్రక్రియ ద్వారా సాంకేతికతను పరిపాలనను అనుసంధానం చేసే దిశగా ఈ ఆధునిక ప్రక్రియను వాడుకులోకి తీసుకుని రావడం జరుగుతుందని, తద్వారా సమాచార సేకరణ సమాచార క్రమబద్ధీకరణ సమాచార నిల్వలకు సంబంధించి అత్యంత గోప్యంగా వీటిని ఉంచడం జరుగుతుందని దానికోసం ఈ నూతన అత్యాధునిక వ్యవస్థను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఈ వ్యవస్థ ద్వారా వ్యక్తిగత పూర్తి సమాచారాన్ని పొందు పరచడం అవసరాన్ని బట్టి ఆ వ్యక్తి యొక్క పూర్తి సమాచారాన్ని తెలుసుకోవడం అవ్వడానికి వ్యవస్థ ఉపయోగపడుతుందని, ఖైదీలు యొక్కప్రతి ఒక్కరి వ్యక్తిగత సమాచారం దేశం మొత్తం అధికారులకు తెలుస్తుందని తద్వారా సమయము సమాచారము అత్యంత వేగవంతంగా చేరవేయడం జరుగుతుంది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం దేశం లో రాష్ట్రాలు ఉన్న సీసీ కెమెరాలు వ్యవస్థ వాటి యొక్క పనితీరు మొత్తం కూడా ఎంతవరకు వీటిని వినియోగంలోనికి తీసుకుని వచ్చారు అన్నది కేంద్రం ఆడిట్ కమిటీని వేసింది ఇందులో నలుగురు జైలు శాఖ అధికారులు, ఇద్దరు బిపిఆర్‌డి అధికారుల మినిస్ట్రీ ఆఫ్ హోమ్ ఎఫైర్స్ నివేదిక మేరకు నియమించడం జరిగిందని, కమిటీ ఆన్ ఆడిట్ ఆఫ్ టెక్నాలజీ ఇన్ ప్రిజన్స్ చైర్మన్ ఇండ్ల శ్రీనివాసు ను నియమించింది. ఇందులో 20 రాష్ట్రాలను ఎంపిక చేయడం జరిగిందని ఈనెల 20 నుండి 20 రాష్ట్రాలలో కమిటీ ఐదు నెలల పాటు పర్యటించి ఇదే సంవత్సరం డిసెంబర్ నెలలో నివేదిక ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ పర్యటనలో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్, కెమెరా యొక్క క్వాలిటీ ఫిక్సెల్స్ టెక్నికల్గా వాటి యొక్క పనితనం కెమెరా ఎంత పరిధిలో వీడియో క్యాప్చర్ చేయడం జరుగుతుంది అనే అంశాలను, పర్యటనలు ఎంపిక చేసిన జైల్ల నే కాకుండా నిర్ణయం మేరకు వేరే ప్రాంతాలను కూడా ఉన్న జైలను కూడా సందర్శించడం జరుగుతుందని,ముఖ్యంగా ఇ – ప్రీజన్స్ ఇ –సిస్టం పనితీరు క్యాప్చర్ చేస్తున్న డేటా రక్షణ చర్యలు సీసీ కెమెరా పనితీరు మొదలగు అంశాలపై పర్యవేక్షణ ఉంటుందని వీటిలో గ్రేడ్లు ఉంటాయని ఉత్తమ గ్రేడ్ కనబరిచిన జై లను కూడా గుర్తించడం జరుగుతుందని తెలియజేశారు.


## ప్రతి ఎకరాకు రైతుకు సాగు నీరు అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే సత్యప్రభ



**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 5 :** ప్రతి ఎకరాకు రైతుకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు.ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ఎమ్మెల్యే సత్యప్రభ, ఏలేరు ప్రాజెక్ట్ జలాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ బస్వా వీరబాబుతో కలిసి ఏలేరు రిజర్వాయర్నుండి ఏలేరుప్రధాన కాలువకు,తిమ్మరాజు చెరువుకు ఏలేరు జలాలను శనివారం విడుదల చేశారు. తొలుత వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య ఏలేరు నది జలాలకు పూజలుచేసి, జల హారతి ఇచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే గంగమ్మకు వస్త్రాలు పసుపు కుంకుమలు ఇచ్చారు. అనంతరం మీడియాతోఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పుల వల్ల రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందలేదన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మేజర్, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, కాలువల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సాగునీటి కాలువలలో పూడిక తీత పనులు వేగవంతంగా నిర్వహించి నీటి పారుదల వ్యవస్థను మెరుగుపరచడం జరిగిందన్నారు. అసెంబ్లీలో సాగునీటి ప్రాజెక్టులు కాలువల అభివృద్ధి కోసం ప్రస్తావించడం జరిగిందని, 2014 లో చంద్రబాబు నాయుడు ఏలేరు గోదావరి నదులను అనుసంధానం చేయడం ద్వారా ఏలేరు పూర్తి స్థాయి లో నీటిని నిల్వ చేసే సామర్థ్యం కలిగింది అన్నారు. సకాలంలో వర్షాలు పడకపోయినా రైతుల సాగునీటి సమస్యను తీర్చేందుకు గోదావరి ఒక టీఎంసీ జలాలను ఏలేరు రిజర్వాయర్ లోకి తరలించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. ఆయకట్టు కింద ఉన్న రైతులకు ప్రతి ఎకరాకు నీరు అందించే లక్ష్యంతో ఓ అండ్ ఎం వర్క్స్ నాలుగు కోట్ల రూపాయలు విడుదల అయ్యాయన్నారు. ప్రస్తుతం రైతులు సాగు కోసం 200 క్యూసెక్కుల స్పిల్ వే రెగ్యులేటర్ ద్వారా విడుదల చేయడం జరిగిందని, అవసరమైతే మరింత పెంచుతామని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు మేడిశెట్టి బాబి, ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి, ఎస్ జీవీ సుబ్బరాజు, సామంతుల కిషోర్, బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, సింగిలిదేవి సత్తిరాజు, జ్యోతులు పెదబాబు, బుద్దాఈశ్వరరావు, పలివెల శ్రీనివాస్, దనేకుల భద్రం, బస్సా ప్రసాద్, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పుష్కర ఆయకుట్టుకు సాగునీరు ఇచ్చి రైతులకు న్యాయం చేయాలి

-లేని పక్షంలో రైతుల పక్షాన పోరాటానికి సిద్ధం సామజిక ఉద్యమకారుడు పాటంశెట్టి సూర్యచంద్ర హెచ్చరిక



**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 5:** పుష్కర ఆయకట్టు పరిధిలోని 42 వేల ఎకరాలకు సాగు నీరు అందించి రైతులకు న్యాయం చేయాలని,లేని పక్షంలో రైతులకు అండగా పోరాడుతామని సామాజిక ఉద్యమకారుడు పాటంశెట్టి సూర్యచంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.శనివారం కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామంలో సూర్యచంద్ర మాట్లాడుతూ రైతు సంక్షేమానికి, రైతులకు సాగునీరు ఇవ్వటంలో కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి నాయకుల మాటలు నీటి మూటలయ్యాయని సామాజిక ఉద్యమకారుడు పాఠం చెట్టి సూర్యచంద్ర ఆరోపించారు.జగ్గంపేట నియోజకవర్గంలో ఉన్న తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ పై 42 వేల ఎకరాల ఆయకట్టు రైతుల దుస్థితిని పట్టించుకోకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. గతంలో జరిగిన నిర్లక్ష్యం వల్ల పుష్కర తాళ్లూరు లిఫ్ట్ ఆయకట్టులో సుమారు 30 వేల ఎకరాలకు సాగునీరు అందక రైతన్నలు సర్వనాశనం అయ్యి అప్పుల పాలయ్యారన్నారు. మళ్లీ అటువంటి పరిస్థితి కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో వచ్చే అవకాశాలు ఉన్నాయని పాటంశెట్టి సూర్యచంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గెలిచిన వెంటనే పుష్కర ఎత్తిపోతల పథకాన్ని 50 కోట్ల రూపాయలు నిధులతో పైపులైన్ మార్చి మరమ్మతులు చేసి రైతన్నలకు సాగు నీరు ఇస్తానని చెప్పిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాటలు, వాగ్దానాలు నీటి మూటలయ్యాయని సూర్యచంద్ర తెలిపారు.నాడు రెండు సంవత్సరాల క్రితం ప్రతిపక్షంలో ఉండగా రైతులకు ఎకరానికి 50 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని జ్యోతుల నెహ్రూ నాటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారన్నారు, కనీసం ఎకరానికి 30,000 చొప్పున 90 కోట్ల రూపాయలు రైతులకు ఆ నష్టపరిహారాన్ని నేడు కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చి ఆదుకోవాలని పాటంశెట్టి సూర్యచంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రైతులను మోసం చేయడంలో నాటి ప్రభుత్వానికి నేటి ప్రభుత్వానికి తేడా లేదని,ఒకరిని మించి మరొకరు రైతన్నల నడ్డి విరుస్తున్నారని పాటంశెట్టి సూర్యచంద్ర ఆరోపించారు. రైతులకు నీరు ఇస్తున్నారా, లేదా అనే క్లారిటీ కూడా ఇవ్వలేని దుస్థితిలో పాలకులు, అధికారులు ఉండడం సిగ్గుచేటని సూర్యచంద్ర తెలిపారు. పుష్కర ఆయకట్టు పరిధిలో ఉన్న 42 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చి రైతులకు న్యాయం చేయకపోతే రైతుల పక్షాన రైతులకు అండగా పోరాడుతామని ప్రభుత్వాన్ని సూర్యచంద్ర హెచ్చరించారు

## టిడిపి మండల నాయకులు కార్యకర్తల సమావేశం



**వి.ఆర్.పురం పెన్.పవర్.జూలై 5 :** మండలం లోని రేఖపల్లి తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద శనివారం తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు బొర్రా నరసింహారావు, అధ్యక్షతనలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది.ముఖ్య కార్యకర్తల సమావేశంలో తెలుగు యువత రాష్ట్ర నాయకులు బొర్రా నరేష్,కుమార్,జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి,మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి సంక్షేమం గురించి మాట్లాడే అర్హత మాజీ శాసన సభ్యురాలు నాగులపల్లి ధనలక్ష్మి,లేదని విమర్శించారు.అనంతరం తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు బొర్రా నరసింహారావు మాట్లాడుతూ ఐదేళ్లు కాలంలో అవినీతి తప్పా అభివృద్ధి ఎక్కడ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.కళ్ళు మూసు కొని రహదారుల పై తిరుగు తున్నారో ఆది మీకే తెలవాలని ఎద్దేవా చేశారు.డీఎస్సీ ద్వారా16 వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీ దే అంటూ గుర్తు చేశారు.ఇచ్చినమాట ప్రకారం పెన్షన్లు పెంచి నాలుగు వేలు రూపాయలు పంపిణీ చేశారని,తల్లి వందనం పథకం ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని,వారన్నారు.

# గత అను భవాలను దృష్టిలో ఉంచుకొని పక్కా ఏర్పాట్లు





- సమన్వయంతో,విజయవంతంగా సింహగిరి ప్రదక్షిణ
- ప్రజా ప్రతినిధులతో కలిసి ఏర్పాట్లపై సమీక్షించి న జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, జూలై 05** :శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో జులై 09, 10వ తేదీల్లో నిర్వహించే సింహాచలం గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని సమన్వ యంతో విజయవంతంగా నిర్వహిద్దామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ మీటింగు హాలులో శుక్రవారం జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులతో ప్రత్యేకంగా ఏర్పాట్లపై సమీక్షించా రు. ముందుగా జిల్లా యంత్రాంగం తరఫున చేసిన ఏర్పాట్లను ప్రజా ప్రతినిధులకు వివరిం చారు. జులై 09వ తేదీ తెల్లవారు ఝాము నుంచి 10 సాయంత్రం వరకు కొండదిగువ తొలిపావంచా వద్ద భక్తులను, ట్రాఫిక్ క్రమబద్ధీ కరణకు పోలీస్ బందోబస్తు, పోలీస్ శిబిరాలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేశామని, క్యూ లైన్లు, రద్దీ ప్రదేశాల వద్ద ఎటువంటి అవాంఛనీ య సంఘటనలు, తోపులాటలు లేకుండా గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని వెల్లడిం చారు. ఇప్పటికే రెండు సార్లు ఏర్పాట్లపై సమీ క్షించామని చెప్పారు. 5-6 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి 200 మీటర్లకు ఒకటి చొప్పున మొత్తం 132 తాగు నీటి పాయింట్లు, 500 మరుగు దొడ్లు, ఆరు కంట్రోల్ రూమ్లు, 5 చోట్ల పబ్లిక్ అడ్రస్ సిస్టం, 32 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి 18 నెట్ వర్కింగ్ ఆసుపత్రులకు వాటిని అనుసంధానం చేస్తున్నా మని, 18 అంబులెన్సులను అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. ప్రతి టాయిలె ట్ వద్ద పారిశుధ్య కార్మికుడు, సూపర్ వైజర్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రద్దీ ప్రదేశాల్లో ప్రాథమికంగా 190 ఎల్.ఈ.డి. లైట్లు వేస్తున్నామని, అప్పుఘర్ వద్ద 5 బోట్ల ను, 60 మంది గజ ఈతగాళ్లను ఉంచుతున్నా మని చెప్పారు. నిరంతరాయంగా విద్యుత్ సర ఫరా ఉండేలా చర్యలు చేపట్టామని, 9 జనరే టర్లను సిద్ధం చేసుకున్నామని వెల్లడించారు. ముందు జాగ్రత్త చర్యగా 09, 10వ తేదీల్లో మద్యం షాపులను మూయించేస్తున్నామని చెప్పారు. భక్తుల సౌకర్యార్థం 50 ఉచిత బస్సు సర్వీసులను నడుపుతున్నామని పేర్కొన్నారు. స్వామివారి కొండపై అగ్నిమాపక యంత్రం, ఫైర్ నియంత్రిక పరికరాలతో పాటు అదనపు సిబ్బం దిని అందుబాటులో ఉంచుతున్నామని వివ రించారు. రహదారిలో ఉండే పాఠశాలలు, కళ్యా ణ మండపాల్లో మొత్తం 14 చోట్ల విశ్రాంతి ప్రాం తాలను గుర్తించామని చెప్పారు. చెట్ల కొమ్మ లను తొలగించి, విద్యుత్ తీగలు వేలాడకుండా చర్యలు చేపడుతున్నామని, ఈ మేరకు అన్ని విభాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేశా మని కలెక్టర్ వివరించారు. టాయిలెట్లకు నీరు సరఫరా చేసేందుకు గాను 50 ట్యాంకులను సిద్ధం చేశామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కొరకు యాప్ ను కూడా అందుబాటు లోకి తీసుకొస్తామని చెప్పారు. అడవివరం నుంచి పైనాపిల్ కాలనీ వరకు ఉండే ప్రాంతవా సుల సౌకర్యార్థం గిరి ప్రదక్షిణ రోజు మధ్యాహ్నం 2.00 గంటల వరకు తొలిపావంచాకు చేరుకు నేందుకు వీలుగా ప్రత్యేక బస్సులను నడుపు తామని పేర్కొన్నారు. 13 ప్రాంతాల్లో పార్కింగు సదుపాయం కల్పిస్తున్నామని వెల్లడించారు.

**గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పక్కా ఏర్పాట్లు చేయాలి,ప్రజా ప్రతినిధులు**

ఈ సమావేశంలో భాగస్వామ్యమైన ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు, విష్ణుకుమార్ రాజు, పంచకర్ల రమేశ్ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, డీసీసీబీ ఛైర్మన్ కోన తాతా రావు, ఏపీ ఆయిల్స్ అండ్ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ ఇతర ప్రతినిధులు మాట్లా డుతూ భక్తులకు ఇబ్బంది లేకుండా పక్కా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గత అను భవాలను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. సింహాచలం మెట్ల మార్గంలో నాచు పట్టిందని, మార్గంలో మొక్క లు, చెట్ల కొమ్మలు పెరిగిపోయాయని చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సాయినగర్ వద్ద బారికేడింగ్ పెట్టడం వల్ల ఆ ప్రాంత ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని, దారి ఉంచాలని పోలీసులకు సూచించారు. భక్తులు సేదతీ రేందుకు విశ్రాంతి శిబిరాలు ఏర్పాటు చేయాల ని, దారిలో ఇబ్బంది లేకుండా హైమాస్ లైట్లు, తాగునీటి పాయింట్లు, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని విన్నవించారు.09వ తేదీ మధ్యాహ్నం 2.00 గంటలకు ప్రచార రథం ప్రారంభం,ఆలయ ప్రధాన పూజారి, ఆలయ ఈవో వేంద్ర త్రినాథరావులు మాట్లాడుతూ కార్యక్రమం జరిగే తీరును వివరించారు. 09వ తేదీ మధ్యాహ్నం 2.00 గంటలకు తొలిపావం చా వద్ద అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతి చేతుల మీదుగా ప్రచార రథం ప్రారంభమవు తుందని తెలిపారు. జులై రాత్రి 10 నుంచి 11 గంటల మధ్యలో రథం ఆలయానికి చేరుకుం టుందని, స్వామివారి పవళింపు సేవ, ఇతర లాంఛనాల అనంతరం ఉదయం 5.00 గంటల నుంచి స్వామివారి దర్శనాలు ప్రారంభమవు తాయని పేర్కొన్నారు. 10వ తేదీ సాయంత్రం 4.00 గంటల వరకు దర్శనాలు కొనసాగుతా యని, 4.00 నుంచి 5.30 గంటల వరకు పవళింపు సేవ, తర్వాత 5.30 నుంచి 7.00 గంటల వరకు దర్శనాలు ఉంటాయని వివరించారు.

ఈ సమావేశంలో దేవాదాయ శాఖ జేసీ రామచంద్ర మోహన్, సీపీ శంఖబ్రత బాగ్చీ, డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఆలయ ఈవో వేంద్ర త్రినాధరావు, ఏఈవోలు, ఇతర విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచితంగా రైతులకువేగవతి రాగి మినీ కిట్స్ పంపిణీ.

- మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్



**చింతపల్లి పెన్ పవర్ జూలై 5:**-జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా అధిక దిగుబడి అధిక పోషకాలు నిచ్చే ఇంద్రావతి వేగవతి రాగి మినీ కిడ్స్ ను రైతు భరోసా కేంద్రాల ద్వారా మండలంలోని ఆదర్శ రైతులకు 100% రాయితీపై పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రైతులకు 100% రాయితీపై ఈ రెండు రకాల సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. 2003 కిడ్స్ ను మండలంలోని 2003 మంది రైతులకు 100% రాయితీపై అందిస్తున్నామన్నారు. ఇంద్రావతిలో క్యాల్షియం ఐరన్ జింక్ వంటి పోషకాలు అధికంగా ఉంటాయని పోషక లోపంతో బాధపడుతున్న వారు ఈ పంట సాగు చేసి ఆహారంగా తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చు అన్నారు. ఇటువంటి సదవకాశాన్ని గిరి రైతులు అందిపుచ్చుకొని పంటను సాగు చేసి ఈ విత్తనాలను అభివృద్ధి చేసి వీటి సాగును పెంచాలని వ్యవసాయ అధికారి కోరారు. ఈ రెండు రకాల విత్తనాలు ఖరీఫ్ మరియు రబీ సాగుకు అనుకూలంగా ఉంటాయని 110 నుండి 120 రోజుల పంట కాల పరిమితి ఉంటుందని తెలిపారు. ఇటువంటి సదవకాశాన్ని గిరి రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాస్ కోరారు.ద

# చింతపల్లి టిడిపి మండల అధ్యక్షునిగా పూర్ణచంద్రరావు.

రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నిక.



**చింతపల్లి పెన్ పవర్ జూలై 5 :-** చింతపల్లి మండల టిడిపి అధ్యక్షునిగా కిల్లో పూర్ణచంద్రరావు రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలో ప్రతి మండలానికి ఒక పరిశీలకున్ని నియమించి ప్రతి పంచాయితీలో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామ కమిటీలు నియమించారు. గ్రామ కమిటీల నియామకం అనంతరం శనివారం పాడేరు నియోజకవర్గ తెదేపా ఇంచార్జ్, మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి, నియోజకవర్గ పరిశీలకుడు బుద్ధా జగదీశ్, మూడు మండలాల ఎన్నికల అధికారి వెంకటరమణ, చింతపల్లి మండల పరిశీలకుడు దాసుబాబుల సమక్షంలో చింతపల్లి మండల పార్టీ అధ్యక్ష ఎన్నిక నిర్వహించగా ఆ పదవికి కిల్లో పూర్ణచంద్రరావు పేరు మాత్రమే పరిశీలనకు రాగా ఆయన ఎన్నికను పరిశీలకులు ఏకగ్రీవంగా ప్రకటించారు ఈ కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు చల్లంగి లక్ష్మణ రావు, గోల్లోరి మంగు, బందారు గంగరాజు, లోతుగెడ్డ సర్పంచ్ చింతల సునీల్, లోతు గెడ్డ, తమ్మంగుల ఎంపీటీసీ సభ్యులు పీ బాబురావు, అప్పారావు, చింతపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు, చింతపల్లి మండలంలోని 17 పంచాయితీల గ్రామ కమిటి అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, నాయకులు గెమ్మెలి అబ్బాయి నాయుడు, ఆంద్రాబు లక్ష్మణ్, పరమేశ్వరరావు, పురుషోత్తం, సుదర్శన్, కుందూరు వెంకటరావు, యస్వంత్, కేశవ నాయుడు, అనిల్, సాయి, కృష్ణ మూర్తి, ఐ టిడిపి అధ్యక్షుడు మహేంద్ర, చింతపల్లి మండల తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాతీయ రహదారి అప్రోచ్ రహదారులతో అవస్థలు.

- అప్రోచ్ రహదారులను పూర్తి స్థాయిలో చేయక పోవడంతో ఇబ్బంది పడుతున్న ద్విచక్ర వాహనదారులు.





**చింతపల్లిపెన్ పవర్ జూలై 5 :-** జాతీయ రహదారి విస్తరణ పనులలో భాగంగా ఎత్తైన ప్రధాన రహదారి నుంచి సమీపంలోని గ్రామాలకు వెళ్లే మార్గాలలోని అప్రోచ్ రహదారులతో ద్విచక్ర వాహన చోదకులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రౌ రింతాడ గ్రామస్తుడుపండా కృష్ణ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మన్య ప్రాంతంలో జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టడం సంతోష దాయకం అయినప్పటికీ, ఆ ప్రధాన రహదారి నుండి పక్క గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి మార్గమైన రౌ రింతాడ సమీపంలోని అప్రోచ్ రహదారిని అసంపూర్తిగా వదిలిపెట్టడంతో ఆటోలు, ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# అంగరంగ వైభోగం శ్రీ స్వామివారి స్వాతి హెూమం





- వేదమంత్రాలతో పులకించిన సింహగిరి పరవశించిన భక్తజనం
- ఆలయవర్గాలు విశేష ఏర్పాట్లు చేశారని ఇఓ వేంద్ర త్రినాధరావు

**సింహచలం, పెన్ పవర్, జూలై 5** : శ్రీ వరహాల లక్ష్మీ నరసింహస్వామివారి దేవస్థానం, సింహాచలంలో

వేదమంత్రాలతో పులకించిన సింహగిరి భక్త జనంతో కోలాహాలంగా మారింది. దక్షిణ భారతదేశంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న సింహచలం శ్రీవరహా లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో భక్తుల కోలాహాలం నెలకొంది. సింహగిరి భక్తులతో శోభాయమానంగా నిలిచింది. భక్తుల హరి నామస్మరణతో సింహగిరి పులకరించింది. సింహద్రినాధుడు జన్మనక్షత్రం స్వాతి పురస్కరించుకుని ప్రత్యక్షంగా పరోక్షంగా జంటలు స్వామివారి స్వాతి హెూమాన్ని వీక్షించారు. ఆలయ అర్చకులు తెల్లవారుజామునే సింహగిరిపై ప్రభాత ఆరాధానలు పూర్తిచేశారు. తదుపరి సుదర్శన స్వామిని ఆలయమండపంలో ఆశీనులను చేసి, ఒకవైపు సర్వాభరణాలతో గోవిందరాజు స్వామి, మరోవైపు శ్రీ సుదర్శన చక్ర పెరుమాళ్ ను వేద మంత్రాలతో మృధు మధుర మంగళ వాయిద్యాలు నడుమ శాస్త్రోక్తముగా ఆలయ స్థానాచార్యులు టిపి రాజగోపాల్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో ఆలయ అర్చక స్వాములు కలశారాధన, మండపం, బింభారాధనలు పూర్తి చేశారు. దేవాదాయ శాఖ కమీషనర్ రామచంద్ర మోహన్ స్వామివారి స్వాతి హెూమంలో పాల్గొని స్వామిని సేవించారు. అనంతరం భక్తులచే నృసింహ స్వామి అష్టోత్తర శతనామావళి పూజ చేయించారు. సింహద్రినాధుడునకు భక్తులు పూజలు గావించారు. ఇక అగ్ని ప్రతిష్టాపన, పంచ శుక్తాలు, నృసింహ సుదర్శన మూలమంత్రాలు అవహనం గావించారు. మహా పూర్ణాహుతి పూర్తి చేసి కలశతో ఆలయ ప్రదక్షిణ గావించారు. అందులో పవిత్ర జలాలను భక్తులకు ప్రోక్షణ గావించారు. భక్తులకు వేదపండితుల ఆశీర్వాదం అందజేసి యజ్ఞప్రసాద వితరణ అనంతరం భక్తులంతా సింహాద్రినాధుడు ను దర్శించుకుని సేవించుకున్నారు. ఆలయ ఈవో వేంద్ర త్రినాధరావు భక్తులకు ఎక్కడ ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ఉద్యోగులను అప్రమత్తం చేస్తూ స్వామివారి భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించారు.





# శ్రీహరిపురం ఎఫ్.ఆర్.యు ఆసుపత్రి ఫీజులు ప్రజలకు అందుబాటులో ఉంచండి

జీ.వీ.ఎం.సీ కమిషనర్ కేతన్ గార్గ్ .



**స్టాఫ్ రిపోర్టర్,పెన్ పవర్, విశాఖపట్నం, జూలై 5** : శ్రీహరిపురం ఎఫ్ ఆర్ యు ఆసుపత్రి ఫీజులు ప్రజలకు అందుబాటులో ఉంచి ప్రజలకు మెరుగై న వైద్య సేవలను అందించాలని జీవీఎంసీ కమి షనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. శనివారం జీవీ ఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాం బర్లో కోరమండల్ ఫెర్టిలైజర్స్, ఏ ఎం జి ఫౌం డేషన్ ప్రతినిధులతో శ్రీహరిపురం ఎఫ్ఆర్ యు ఆసుపత్రిని సి ఎస్ ఆర్ నిధులతో అభివృద్ధి పరుస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అం దించే విధి విధానాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ శ్రీహరిపురం ఎఫ్ ఆర్ యు ఆసుపత్రిని కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబి లిటీ తో కోరమండల్ ఫెర్టిలైజర్స్, ఏ ఎం జి ఫౌండేషన్ వారు నిర్వహించేందుకు ఆసక్తితో ముందుకు రావడం సంతోషదాయకమ ని, ప్రజలకు వైద్య సేవలను అందుబాటులో ఉంచేలా తక్కువ ఫీజులు వసూలు చేయాలని, వారికి శ్రీహరిపురం ఎఫ్ ఆర్ యు ఆసుపత్రి నిర్వహణపై కొన్ని ప్రతిపాదనలను సూచించడం జరిగిందని కమిషనర్ తెలిపారు. కమిషనర్ సూచనలపై ఏఎంజీ ప్రతినిధులు వారి ఉన్నతా ధికారులతో చర్చించి త్వరలోనే విషయాన్ని మరల తెలియపరుస్తామని కమిషనర్ కు తెలిపారు. ఎఫ్ ఆర్ యు ఆసుపత్రి కి సంబం ధించిన అంశంపై గతంలో కౌన్సిల్లో చర్చించా మని దానికి అనుగుణంగా ప్రజలకు ఎఫ్ ఆర్ యు సెంటర్ లీజు అగ్రిమెంట్, ప్రజలకు అందు బాటులో ఉండేలా వైద్య సేవల యొక్క ఫీజుల వసూలు, మెరుగైన వైద్య సేవలు తదితర అంశాలపై చర్చించడం జరిగిందని కమిషనర్ తెలిపారు.

# జనసేన కోర్ కమిటీలతో పార్టీ బలోపేతం

**జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం, మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు**





**చింతపల్లి పెన్ పవర్ జూలై 05** : పాడేరు నియోజకవర్గంలో జనసేన పార్టీ విస్తరణ, బలోపేతానికి ప్రత్యేక దృష్టి సారించింది. పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి వంపూరి గంగులయ్య ఆదేశాల మేరకు, శనివారం చింతపల్లి మండలంలోని బయలు కించంగి గ్రామంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం, చింతపల్లి మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు ఆధ్వర్యంలో పటిష్టమైన కోర్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఏర్పాటు పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తుందని పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. కోర్ కమిటీ ఏర్పాటు అనంతరం, నాయకులు గ్రామంలోని ప్రజలతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వ పథకాల అమలు తీరు వంటి అంశాలపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం, మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు లు మాట్లాడుతూ, పార్టీ బలోపేతం కావాలంటే కోర్ కమిటీల ఏర్పాటు అత్యంత అవసరం అన్నారు. ఈ కోర్ కమిటీలు పార్టీకి మూల స్తంభాలుగా పనిచేస్తాయి అని, క్షేత్రస్థాయిలో ప్రజలకు, పార్టీకి మధ్య వారధులుగా ఉండి, ప్రభుత్వ పథకాలను, జనసేన పార్టీ చేపట్టే మంచి పనులను ప్రజల దృష్టికి తీసుకెళ్లే వారిగా కోర్ కమిటీ పనిచేయాలన్నారు.

ఇదేగాక ఎక్కడ సమస్య ఉంటే అక్కడ జనసేన పార్టీ ప్రజలకు అండగా నిలుస్తుంది. ప్రజల తరఫున పోరాడుతుంది అన్నారు. పార్టీ అధినేత ఉపముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్ చేపడుతున్న గొప్ప గొప్ప పనులు, ప్రజా సంక్షేమం కోసం ఆయన నిరంతరం పడుతున్న తపన గురించి క్లుప్తంగా వివరించారూ. యువత, మహిళలు, అన్ని వర్గాల ప్రజలు పార్టీకి అండగా నిలబడితేనే మార్పు సాధ్యం అవుతుంది. అని స్పష్టం చేశారు. గత కొద్దికాలంగా జనసేన పార్టీ క్షేత్రస్థాయిలో తన ఉనికిని చాటుకునేందుకు చేపడుతున్న అనేక కార్యక్రమాల్లో భాగంగా ఈ కోర్ కమిటీల ఏర్పాటు జరిగిందనీ భవిష్యత్తులోనూ ఇలాంటి కమిటీల ద్వారా ప్రజలకు మరింత చేరువై, వారి సమస్యలను పరిష్కరించే దిశగా జనసేన పార్టీ ముందుకు సాగుతుందని నాయకులు పేర్కొన్నారు. ఇది పార్టీకి మరింత బలం చేకూరుస్తుందని, రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి ఈ కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కిముడు కృష్ణమూర్తి, పెదబరడ పంచాయితీ, నాయకుడు కూడా రామకృష్ణ, గసాడి దిలీప్, మనోహర్, కొర్ర కృష్ణ, మత్స్యరాజు, రవి, చిరంజీవి, చరణ్, చంటి, బాలు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# శుభం.. బాలినేని అదృష్టం పండింది ..!



ఔను.. ఒంగోలు రాజకీయ నాయకుల్లో ఇదే చర్చ సాగుతోంది. ఏ ఇద్దరు కలుసుకున్నా.. బాలినేని అదృ ష్టం పండిందనే చెబుతున్నారు. ప్రస్తుతం జనసేనలో ఉన్న బాలినేని శ్రీనివాసరెడ్డికి.. ఆ పార్టీ అధినేత అభయం ప్రసాదించారని అంటున్నారు. త్వరలోనే ఆయనకు కీలకమైన శు భవార్త అందుతుందని చెబుతున్నారు. దీనిపైనే ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతుండడం గమనార్హం గత ఎన్నికల తర్వాత వైసీపీ నుంచి బయటకు వచ్చిన బాలినేని జనసేనలో చేరారు.నేరుగా ఆయన జనసేన నాయకులు నాగబాబు, పార్టీ చీఫ్ పవన్‌ను కలిసి.. ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సమయంలో ఆయన ఎమ్మెల్సీసీటు కావాలని కోరారన్న ప్రచారం జరిగింది. అయితే.. ఇప్పటి వరకు నెరవేరలేదు. సుమారు 8 మాసాలుగా బాలినేని ఎదురు చూస్తున్నారు. కానీ.. దీనిపై క్లారిటీ రాలేదు. తాజాగా ప్రకాశం జిల్లా పర్యటనకు వచ్చిన పవన్ కల్యాణ్.. చివరి నిముషంలో బాలినేనిని ఆకాశానికి ఎత్తేశారు. ఆయనను తనకు అత్యంత ఆప్తుడిగా పేర్కొన్నారు.చాలా నిఖార్సయిన రాజకీయ నాయకుడిగా కూడా పవన్ ప్రశంసించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా తనకు ఎంతో సాయం చేశారని.. బాలినేని గురించి పవన్ చెప్పడం గమనార్హం. అనంతరం.. ఇరువురు నాయకులు రెండు నిమిషాల పాటు.. ప్రత్యేకంగా చర్చించుకున్నారు. ఈ చర్చల తర్వాతే.. బాలినేని అదృష్టం పండిందన్న వాదన బయటకు వచ్చింది. అంటే.. దీనిని బట్టి.. త్వరలోనే బాలినేనికి ఎమ్మెల్సీ చాన్స్ దక్కే అవకాశం ఉంటుందన్న చర్చ జరుగుతోంది. అయితే.. దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటనా రాలేదు.ఇదిలావుంటే.. స్థానికంగా బాలినేనిని వ్యతిరేకిస్తున్న జనసేన నాయకుడు కాశీనాథ్ సహా కొందరికి పవన్ కల్యాణ్.. పరోక్షంగానే బాలినేని వాల్యూ తెలిసేలా కామెంట్లు చేశారు. బాలినేని చాలా ముఖ్యనాయకుడని.. ఆయనతో తనకు ఎంతో పరిచయం ఉందని వ్యాఖ్యానించారు. తద్వారా.. ఇప్పటి వరకు బాలినేని విమర్శిస్తూ వచ్చిన నాయకులను పవన్ కంట్రోల్ చేసినట్టు అయింది. దీంతో ఇప్పటి వరకు పార్టీ మారినా.. పెద్దగా దూకుడు లేని బాలినేని ఇక నుంచి యాక్టివ్ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఏదేమైనా.. పవన్ ప్రకాశం పర్యటన.. బాలినేనిని ఖుషీ చేసిందన్నది వాస్తవం.

# 3 ఇన్నింగ్స్ లు.. 300 పరుగులు.. ఆ పేస్ బౌలర్ పై దారుణ ట్రోలింగ్



ఇంగ్లండ్ తో జరుగుతున్న టెస్టు సిరీస్ లో టీమ్ ఇండియా తరఫున యువ ఓపెనర్ యశస్వి జైశ్వాల్, కెప్టెన్ శుబ్ మన్ గిల్, సీనియర్ బ్యాట్స్ మన్ కేఎల్ రాహుల్ సెంచరీలతో దుమ్మురేపుతున్నారు. వీరితో పాటు మరో ఆటగాడు కూడా 'సెంచరీలు' చేస్తున్నాడు.. కానీ, అది బ్యాట్ తో కాదు.. బంతితో.. మంచి పేస్ తో పాటు ఎత్తు ఉన్న అతడు ఇంగ్లండ్ పిచ్ లపై బౌన్స్ రాబట్టి వికెట్లు తీస్తాడని తుది జట్టులోకి తీసుకుంటే తీవ్రంగా నిరాశపరుస్తున్నాడు. వికెట్లు తీయడం అటుంచి.. టి20ల స్థాయిలో పరుగులు ఇచ్చేస్తున్నాడు. అతడు బంతి అందుకుంటే ప్రత్యర్థి బ్యాట్స్ మెన్ కు పండుగే అన్నట్లు ఉంది పరిస్థితి. ఇటీవలి ఐపీఎల్ లో ప్రసిద్ధ్ క్రిష్ణ టాప్ వికెట్ టేకర్. మొత్తం 25 వికెట్లతో పర్పుల్ క్యాప్ గెలుచుకున్నాడు. ఆ ప్రదర్శనతోనే అతడిని ఇంగ్లండ్ తీసుకెళ్తే దారుణంగా విఫలం అవుతున్నాడు. తొలి టెస్టులో ఏకంగా రెండు ఇన్నింగ్స్ లో కలిపి 220 పరుగులు ఇచ్చేశాడు. ఐదు వికెట్లు తీశాడన్న మాటే కానీ.. ఇంగ్లండ్ చేసిన మొత్తం 838 పరుగుల్లో 25 శాతం ప్రసిద్ధ్ వే అయితే ఎలా?ఇక రెండో టెస్టులోనూ ప్రసిద్ధ్ పూర్తిగా గాడి తప్పాడు. పిచ్ నుంచి సహకారం లేదనే సంగతి వాస్తవమే. కానీ, పరుగులు ఇవ్వకుండా బ్యాట్స్ మెన్ ను కట్టడి చేయడమూ ముఖ్యమే కదా..? ఈ టెస్టులో ఏకంగా 13 ఓవర్లలో 72 పరుగులు ఇచ్చాడు. ఒక్క వికెట్ కూడా తీయలేదు. షార్ట్ పిచ్ బంతుల వ్యూహం పనిచేయకపోవడంతో ప్రసిద్ధ్ ను ఇంగ్లండ్ వికెట్ కీపర్ బ్యాటర్ జేమీ స్మిత్ ఉతికి ఆరేశాడు. అసలు స్మిత్ సెంచరీకి ప్రసిద్ధ్ బౌలింగే కారణమని సోషల్ మీడియాలో ట్రోలింగ్ నడుస్తోంది.ఓవైపు ఎడమచేతివాటంతో పాటు స్వింగ్ బౌలర్ అయిన అర్షదీప్ సింగ్ ను కాదని ప్రసిద్ధ్ ను ఆడిస్తున్నా.. అతడు తీవ్రంగా నిరాశపరుస్తున్నాడు. దీంతో నెటిజన్లు ఓ ఆట ఆడుకుంటున్నారు. "ప్రసిద్ధ్ కంటే.. 35 ఏళ్ల భువనేశ్వర్ మంచిగా బౌలింగ్ చేస్తున్నాడు. అతడు స్వింగ్ బౌలర్ కూడా. ఇంగ్లండ్ లో వికెట్లు తీయగలడు" అని ఒకరు... "ఇదేం సెలక్షన్? ప్రసిద్ధ్ ఓవర్ కు 6 బౌండరీలు ఇస్తున్నాడు. అర్షదీప్ డరెస్సింగ్ రూమ్ లో ఉన్నాడు. ప్రసిద్ధ్ మ్యాచ్ లు ఆడుతున్నాడు" అని మరొకరు దుమ్మెత్తిపోశారు. "విరాట్ కోహ్లి కాదు.. ప్రసిద్ధ్ క్రిష్ణ రన్ మెషిన్. భారత్ తరఫున హారిస్ రవూఫ్ (భారీగా పరుగులిచ్చే పాక్ పేసర్)" అని ఇంకొకరు ఎద్దేవా చేశారు. ప్రసిద్ధ్ కు రిటర్న్ టికెట్ బుక్ చేయండి.. బిజినెస్ క్లాస్ టికెట్ కొనిస్తా అని మరో అభిమాని ప్రపోజ్ చేశాడు.

# చిన్నమ్మ కోసం చంద్రబాబు చక్రం తిప్పుతారా ..!



రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరని అంటారు. అలానే.. చంద్రబాబు కుటుంబాని కి.. దగ్గుబాటి కుటుంబానికి మధ్య రాజకీయ వైరుధ్యాలు ఒకప్పుడు ఉన్నా.. ఇప్పుడు దాదాపు సమసిపోయాయన్న భావన అయితే ఉంది. ఒకప్పుడు ఆ ఇంటిపై కాకి.. ఈ ఇంటిపై వాలని విధంగా రాజకీయాలు చేసుకున్నారు. పరస్పర వైరుధ్యంగా రాజకీయాలు చేసుకున్నారు. కానీ, గత కొన్నాళ్లుగా ఈ రెండు కుటుంబాలు కలిసిపోయిన పరిస్థితి కనిపిస్తోంది.ఈ నేపథ్యంలో తాజాగా బీజేపీ జాతీయ అధ్యక్షురాలు రేసులో ఉన్నారని భావిస్తున్న రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి విషయంలో చంద్రబాబు చక్రం తిప్పుతారా? అనే చర్చ తెరమీదికి వచ్చింది. ప్రస్తుతం ఈ విషయం కూటమి పార్టీల్లోనూ చర్చగా మారింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడుగాఉన్న జేపీ నడ్డా .. ఈ నెల ఆఖరులో ఆ పదవిని వదులుకోనున్నారు. ప్రస్తుతం దేశంలోని 19 రాష్ట్రాల్లో బీజేపీ అధ్యక్షులను మారుస్తోంది. వీరి ఎంపిక పూర్తయిన దరిమిలా వెంటనే జాతీయ నాయకత్వంపై దృష్టి పెట్టనుంది.ఈ దఫా దక్షిణాది నుంచి జాతీయ అధ్యక్ష పదవికి నాయకులను ఎంపిక చేయాలని నిర్ణయించుకున్న విషయం తెలిసిందే. ఉత్తరాదిలో ఓటు బ్యాంకు తగ్గుతున్న నేపథ్యంలో బీజేపీ దక్షిణాదిపై ఎక్కువగా ఆశలు పెట్టుకుంది. పైగా.. దక్షిణాదిలోనూ ఎక్కువ మంది మిత్రులు ఉన్నారు. ఈ క్రమంలోనే దక్షిణాదికి చెందిన వారిని పార్టీ చీఫ్‌లుగా తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే దగ్గుబాటి పురందేశ్వరి, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, వానతి శ్రీనివాసన్‌ల పేర్లు వినిపిస్తున్నాయి.ఈ ముగ్గురిలో ఎక్కువగా అవకాశం దగ్గుబాటికే ఉందన్న చర్చ కూడా ఉంది. దీనికి కారణం.. కూటమిలో మిత్ర పక్షంగా ఉన్న టీడీపీ అధినేత చక్రం తిప్పే అవకాశంఉందని సమాచారం. వాస్తవానికి బీజేపీ వ్యవహారమే అయినా.. చంద్రబాబు చెబితే.. కేంద్రంలోని వారు కూడా వింటారన్న వాదన ఉంది. గతంలోనూ రెండు మూడు సార్లుఇలానే జరిగిందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు చిన్నమ్మకు కూడా.. చంద్రబాబు చక్రం తిప్పే అవకాశం లేకపోలేదని.. కొందరు అభిప్రాయపడుతున్నారు.

మెకు కూడా బీజేపీలో మంచి పలుకుబడి ఉండడం.. ఏపీలో కూటమి కట్టడంలోనూ.. అధికారంలోకి తీసుకురావడంలోనూ కీలకం గా వ్యవహరించిన నేపథ్యంలో బీజేపీ సంతృప్తిగానే ఉంది. సో.. ఈ పరిణామాలన్నీ కలిసి వచ్చి.. పురందేశ్వరికి పగ్గాలు అప్పగించే అవకాశం లేకపోలేదన్న వాదన బలంగా వినిపిస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# 'అతి' కూడా మంచిది కాదేమో బాబూ.. !



ఎప్పుడూ మంచిది కాదు. అది రాజకీయాలైనా, వ్యక్తిగతమైన, కుటుంబ సంబంధాలైన అతిగా వ్యవహరించిన, అతిగా మాట్లాడిన, అతిగా విమర్శించిన.. ఎప్పటికీ అది ప్రమాదకరమైన సంకేతాలనే ఇస్తుంది. అతిగా విమర్శించి, అతిగా తిట్టిపోసిన నాయకులు తర్వాత కాలంలో రాజకీయంగా పుంజుకున్నారనేది అందరికీ తెలిసిందే. ఉదాహరణకు ప్రధాన మంత్రిగా ఉన్న నరేంద్ర మోడీని 2014 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ భారీ ఎత్తున ప్రచారం చేసింది. ఆయనను సంఘ విద్రోహ శక్తిగా.. మతాల మధ్య చిచ్చుపెట్టే నాయకుడిగా.. ముస్లిం మైనారిటీలకు వ్యతిరేక వ్యక్తిగా కూడా దేశవ్యాప్తంగా ప్రచారం చేసింది. కానీ ఇదే వ్యతిరేక ప్రచారం.. నరేంద్ర మోడీ పట్ల ప్రజల్లో చర్చకు వచ్చేలాగా చేసింది. తర్వాత కాలంలో ఆయన ప్రధాని కావడానికి ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన వ్యతిరేక ప్రచారం ఒక కారణమనేది రాజకీయ విశ్లేషకులు చెబుతారు. ఆయన ఒక్కడే కాదు కేసీఆర్ను కూడా గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఉన్నప్పుడు తీవ్ర స్థాయిలో అసెంబ్లీలోను బయట కూడా విమర్శలు గుప్పించేవారు. – మీ వల్ల ఏం జరుగుతుంది. మీరు ఏం సాధిస్తారు – అని వైయస్ అడిగిన ప్రశ్నలు అసెంబ్లీలో పెద్ద ఎత్తున ప్రచారంలోకి వచ్చాయి. ఆ తర్వాత బహిరంగ సభలో కూడా కేసీఆర్ వల్ల ఏమీ కాదని చెప్పుకొచ్చారు. ఇలా కేసీఆర్ ను ఒక విలన్ గా, ఒక రాజకీయ అసమర్ధుడిగా చేసిన ప్రచారం.. తర్వాత కాలంలో ఆయనను ప్రజల్లో మరింత రాటు తేలే నాయకుడిగా మార్చాయి. అంటే అతిగా ప్రచారం చేయటం అనేది ఆనాడైనా.. ఏనాడైనా రాజకీయాల్లో మంచిది కాదు. ఇక ప్రస్తుత విషయానికి వస్తే జగన్ ను మరింతగా టార్గెట్ చేస్తూ చంద్రబాబు చేస్తున్న వ్యాఖ్యలు అంత మంచిది కాదనే అభిప్రాయం టిడిపి నాయకులు మధ్య వినిపిస్తోంది. సీనియర్ నాయకుల నుంచి జూనియర్ నాయకుల వరకు కూడా జగన్‌ను అనవసరంగా మనం ఎక్కువగా టార్గెట్ చేస్తున్నామేమో అని వ్యాఖ్యానిస్తున్నారు.ఇటీవల జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఒకరిద్దరు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు.. ఇదే అభిప్రాయాన్ని చంద్రబాబు ముందు చెప్పుకొచ్చారు. మనం అనవసరంగా జగన్ను టార్గెట్ చేయడం వల్ల ఆయనపై ప్రజల్లో నిరంతరం చర్చకు వచ్చేలాగా చేస్తున్నామేమో అన్న సందేహాలను వ్యక్తం చేశారు. కానీ దీని విషయంలో చంద్రబాబు చాలా తీవ్రంగా స్పందించారు. %--%నాకు తెలియదా? మీరా నాకు చెప్పేది? నేను తొమ్మిది సార్లు ఎమ్మెల్యేగా గెలిచాను. మీరు ఒక్కసారి గెలిచారు. మీరు నాకు పాఠాలు చెబుతారా?%--% అంటూ చంద్రబాబు సీరియస్ అయ్యారు. కానీ వారు చెప్పిన దాంట్లో ఒకంత వాస్తవం అయితే లేకపోలేదు.

ఎందుకంటే అతిగా విమర్శిస్తూ పోతే జగన్‌ను విలన్‌గా చూపిస్తూ పోతే ప్రజల్లో ఆయన పట్ల సానుకూలత, సానుభూతి పెరిగే అవకాశం లేకపోలేదు, ఇది రాజకీయాల్లో సహజంగా ఏర్పడేటటువంటి ఒక ప్రక్రియ. గతంలో జగన్ కూడా పవన్ కళ్యాణ్ ను పదేపదే విమర్శించడం వల్ల కాపులంతా ఏకమయ్యే పరిస్థితిని తీసుకువచ్చారు. ఇది ఆయనకు ఎంత మేలు చేసిందో ఎంత కీడు చేసిందో అందరికీ తెలిసిందే. అదే విధంగా చంద్రబాబును ఇక జైలుకే పరిమితం చేయాలి అని ఊహించి ఆయనను ఇబ్బంది పెట్టిన తీరు, అసలు టిడిపి లేకుండా చేయాలి.. మనమే 30 సంవత్సరాల పాటు అధికారంలో ఉండాలి.. అనే విధంగా వ్యవహరించిన విధానం వంటివి కూడా జగన్ను తీవ్ర స్థాయిలో ఇరకాటంలోకి నెట్టి చివరకు ఏం చేశాయి అనేది అందరికీ అర్థమైంది.

ఇంత పరిస్థితి టిడిపికి రాకపోయినా ఇప్పుడు జనంలో జగన్ గురించి చర్చ వచ్చేలాగా చంద్రబాబు పదేపదే ఆయనను టార్గెట్ చేయడం మంచిది కాదన్నది పార్టీ నాయకులు సూచిస్తున్న మాట. అవకాశం, అవసరం, సందర్భాన్ని బట్టి ప్రతిపక్షాన్ని విమర్శించడం వరకు తప్పు లేదని, కానీ ప్రతి విషయంలోను జగన్‌ను టార్గెట్ చేయటం ప్రతి విషయాన్ని ఆయనకు ముడిపెట్టి విమర్శించడం వల్ల కొత్తగా వచ్చే లాభం ఏమీ లేదని అంటున్నారు. మరి ఈ విషయంలో చంద్రబాబు ఏ వ్యూహంతో ఉన్నారు అనేది తెలియాల్సి ఉంది.

# పాకిస్తాన్ కి మైక్రోసాఫ్ట్ గుడ్ బై.. రోడ్డు మీదకు వచ్చిన పాకిస్తాన్ సాఫ్ట్ వేర్ ఇంజినీర్స్




ప్రపంచంలోని అతిపెద్ద సాంకేతిక సంస్థలలో ఒకటైన మైక్రోసాఫ్ట్ పాకిస్తాన్‌లో తన 25 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణానికి ముగింపు పలికింది. అధికారికంగా ప్రకటన రానప్పటికీ పాకిస్తాన్‌లోని మైక్రోసాఫ్ట్ సీఈవో జవాద్ రెహ్మాన్ "ఇది ఒక శకానికి ముగింపు" అని వ్యాఖ్యానించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ నిర్ణయంతో అక్కడ పనిచేస్తున్న అనేక మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు తమ భవిష్యత్తుపై ఆందోళన చెందుతూ రోడ్డెక్కారు. వారి నిరాశ, అనిశ్చితి దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. పాకిస్తాన్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు మైక్రోసాఫ్ట్ తమ కార్యకలాపాలను నిలిపివేయడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మీదకు వచ్చి ఆందోళన చేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. తమ దేశ పరిస్థితులు సరిగా లేనందుకు తాము బాధ్యులమా అని ప్రశ్నిస్తున్నారు. ఈ పరిణామం ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.

**25 ఏళ్ల సేవలకు ముగింపు**

మైక్రోసాఫ్ట్ పాకిస్తాన్‌లో 2000, మార్చి 7న తన కార్యకలాపాలను ప్రారంభించింది. దాదాపు రెండు దశాబ్దాలుగా అనేక రంగాలలో కీలక సేవలందిస్తూ 'డిజిటల్ పాకిస్తాన్' కలను సాకారం చేయడానికి కృషి చేసింది. గ్రామీణ పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటు, విద్యాసంస్థలతో భాగస్వామ్యం, యువతకు సాంకేతిక శిక్షణ, చిన్న వ్యాపారాలకు సాంకేతిక మద్దతు వంటి అనేక మైలురాళ్లను అధిగమించింది.

**ఎందుకు నిష్క్రమణ?**

మైక్రోసాఫ్ట్ ఈ నిర్ణయానికి రావడానికి గల కారణాలపై స్పష్టమైన ప్రకటన వెలువడనప్పటికీ నిపుణుల అంచనాల ప్రకారం పాకిస్తాన్‌లోని రాజకీయ, ఆర్థిక అస్థిరతలే ప్రధాన కారణాలుగా తెలుస్తున్నాయి. తరచుగా మారుతున్న ప్రభుత్వాలతో స్థిరత్వం లేని రాజకీయ వాతావరణం నెలకొంది. భారీ పన్నుల భారంతో వ్యాపార కార్యకలాపాలపై అధిక పన్నులు గుదిబండగా మారాయి. కరెన్సీ విలువ క్షీణతతో దేశ కరెన్సీ విలువ నిరంతరం పడిపోవడం మైక్రోసాఫ్ట్ కు భారంగా మారింది. టెక్నాలజీ దిగుమతుల్లో ఆంక్షలు.. సాంకేతిక దిగుమతులపై పరిమితులు... పెట్టుబడులపై భద్రతా సందేహాలు.. విదేశీ పెట్టుబడులకు భద్రత లేదనే అంచనాలు... మైక్రోసాఫ్ట్ వంటి ప్రపంచ స్థాయి కంపెనీలకు పెద్ద దెబ్బగా మారాయి.

**ఆర్థిక సంక్షోభం తీవ్రత**

పాకిస్తాన్‌లో ఆర్థిక సంక్షోభం తీవ్రస్థాయిలో ఉంది. 2024 ఆర్థిక సంవత్సరానికి పాకిస్తాన్ వాణిజ్య లోటు $24.4 బిలియన్లకు పెరిగింది. జూన్ 2025 నాటికి విదేశీ మారక నిల్వలు $11.5 బిలియన్లకు పడిపోయాయి. ఈ పరిస్థితి విదేశీ సంస్థల పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం చూపుతూ దేశానికి వచ్చే అవకాశాలను తగ్గించింది.

**పాకిస్తాన్ మాజీ అధ్యక్షుడి ఆవేదన**

ఈ సందర్భంగా పాకిస్తాన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఆరిఫ్ అల్వీ స్పందిస్తూ "మైక్రోసాఫ్ట్ నిష్క్రమణ పాకిస్తాన్ ఆర్థిక పరిస్థితికి పెద్ద దెబ్బ. రాజకీయ అస్థిరత వల్ల అవకాశాలు చేజారిపోతున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. 2022లో బిల్ గేట్స్‌తో తాను మాట్లాడినప్పుడు, పాకిస్తాన్‌లో పెట్టుబడులపై ఆసక్తి చూపారని ఆయన గుర్తు చేసుకున్నారు. సత్య నాదెళ్ల, అప్పటి ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌తో చర్చలు కూడా జరిగాయని, అయితే ఆ తర్వాత ప్రభుత్వ మార్పులు, అనిశ్చిత పరిస్థితులు మైక్రోసాఫ్ట్‌ను వియత్నాం వంటి ప్రత్యామ్నాయ దేశాల వైపు మళ్లించాయని వివరించారు.

**రోడ్డునపడ్డ ఇంజనీర్లు.. భవిష్యత్తు ప్రశ్నార్థకం**

మైక్రోసాఫ్ట్ నిష్క్రమణతో పాటు, పాకిస్తాన్‌లోని అనేక మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఉపాధి కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఈ కంపెనీలో పనిచేసిన ఇంజనీర్లు ఇప్పుడు తమ భవిష్యత్తు ఏమిటని ఆందోళనలో ఉన్నారు. రోడ్డున పడి ఆందోళనలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. దేశంలోని ఇతర టెక్ కంపెనీలు కూడా తమ వ్యాపార వ్యూహాలను పునరాలోచిస్తున్నాయని సమాచారం. ఒక ప్రఖ్యాత టెక్ దిగ్గజం ఒక దేశాన్ని విడిచి వెళితే, అది కేవలం వ్యాపారపరంగా మాత్రమే కాకుండా ఆ దేశ స్థిరత్వంపై, ప్రపంచ పెట్టుబడిదారుల నమ్మకంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మైక్రోసాఫ్ట్ నిష్క్రమణ పాకిస్తాన్‌కు ఒక గుణపాఠం. అయితే దీన్ని ఒక సవాలుగా స్వీకరించి, వ్యవస్థల పునర్నిర్మాణం వైపు అడుగులు వేయడం ఆ దేశానికి తక్షణ అవసరం.

# జగన్.. మీ ప్రత్యర్థి ఎవరో తేల్చుకున్నారా ..!



వైసీపీ అధినేత జగన్‌కు రాజకీయ ప్రత్యర్థి ఎవరు? అంటే.. తడుముకోకుండా.. చెప్పే మాట చంద్రబాబు!. ఇది వైసీపీ నాయకులే కాదు.. జగన్ కూడా ఇదే భావనతో ఉన్నారు. ఉంటున్నారు కూడా!. కానీ, చంద్రబా బు కంటే కూడా.. బలమైన ప్రత్యర్థి, జగన్‌ను ఓడించి తీరుతామని చెబుతున్న నాయకుడు జనసేన అధినేత పవన్ కల్యాణ్. ఈయనే అసలు సిసలు ప్రత్యర్థి.. అనడంలో సందేహం లేదు. అయితే.. ఈ విషయాన్ని వైసీపీ గ్రహించడంలో కొంత తాత్సారం చేస్తోందన్నది వాస్తవం. 2014కు ముందు జరిగిన పరిణామాలను గమనించినా.. తర్వాత జరిగిన పరిణామాలను గమనించినా వైసీ పీకి ప్రధాన ప్రత్యర్థి.. పార్టీ కాదు.. వ్యక్తే. ఆయనే పవన్ కల్యాణ్. 2014 ఎన్నికల్లో తాను పోటీ నుంచి దూరంగా ఉన్నా.. అప్పటి కూటమి.. బీజేపీ–టీడీపీలకు మద్దతు ఇవ్వడం ద్వారా తన అభిమాన గణాన్ని ఈ కూటమి వైపు నడిపించారన్నది వాస్తవం. దీంతో 2014లో దక్కాల్సిన అధికారం వైసీపీకి దక్కలేదు. ఇక, 2019 విషయానికి వస్తే.. ఇక్కడ కూడా పవనే జగన్‌కు ప్రత్యర్థి.

అయితే.. అప్పటి వ్యూహం మాత్రం కొంత మేరకు బెడిసి కొట్టింది. అప్పటి టీడీపీ–బీజేపీల మధ్య విభే దా లు రావడం.. ప్రజల్లో ప్రత్యేక హోదాపై ఆశలు ఉండడం. అదేసమయంలో అవినీతి.. ఆరోపణలు కూడా ఎక్కువగా రావడంతో పవన్ చాలా తెలివిగా.. వేర్వేరుగా పోటీకి దిగారు. నిజానికి అప్పట్లో వేర్వేరుగా చేసిన సమయంలో బీజేపీ–టీడీపీ–జనసేనకు ఆశించిన మేరకు సీట్లు వచ్చినా.. తిరిగి చేతులుకలిపేవారు. కానీ.. గుండుగుత్తగా జనం వైసీపీకి మద్దతు పలికారు.

ఇక, 2024 ఎన్నికలకు వచ్చేసరికి నేరుగానే జగన్‌ను టార్గెట్‌చేసి అధికారం నుంచి దింపేస్తామని ప్రకటిం చిన విషయం తెలిసిందే. అదే జరిగింది. అంటే.. మొత్తంగా జగన్ రాజకీయాలను నిశితంగా గమనిస్తున్న నాయకుల్లో పవన్ ముందు వరుసలో ఉన్నారన్నది సందేహం లేదు. సో.. జగన్ రాజకీయ ప్రత్యర్థి కూడా ఆయనే. తాజాగా కూడా.. మరోసారి అధికారంలోకి ఎలా వస్తారో చూస్తామన్న సవాల్ విసరడం ద్వారా.. టీడీపీకంటే ఎక్కువగా వైసీపీని నిలువరించేందుకు పవన్ వ్యక్తిగతంగా ఎంత ప్రయత్నం చేయొచ్చే.. అర్థం అవుతుంది.రాజకీయాల్లో దీనిని తప్పుపట్టాల్సిన అవసరం లేదు. ఏ నాయకుడి ఇష్టం వారిది. అయితే.. ఒక యుద్ధానికి దిగినప్పుడు లేదా.. దిగుతున్నట్టు అసలు ప్రత్యర్థి ఎవరు? అనేది తెలుసుకోకుండా అడుగులు వేస్తే.. అది ప్రమాదకరం. సో.. ఇప్పటికైనా.. వైసీపీ అధినేత జగన్.. తన ప్రత్యర్థి ఎవరు? అనేది తెలుసుకుని అడుగు లు వేస్తే.. అందుకు తగిన విధంగా తన వ్యూహాన్ని మలుచుకుంటే తప్ప.. తిరిగి ఆయన భావిస్తున్నట్టు అధికారం దక్కడం అనేది జరగకపోవచ్చు.

## 14 ఏళ్లకే ఆల్‌టైం రికార్డ్ బద్దలు: ఇంగ్లాండ్‌ను చితక్కొట్టిన సూర్యవంశీ.. 52 బంతుల్లోనే సెంచరీ




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్ అండర్19 తో జరుగుతున్న యూత్ సిరీస్‌లో టీమిండియా ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నాలుగో వన్డేలో చెలరేగి ఆడాడు. ఆడుతుంది వన్డే అయినప్పటికీ.. టీ20 తరహాలో చెలరేగిపోయాడు. శనివారం (జూలై 5) వొర్సెస్టర్‌లో జరుగుతున్న మ్యాచ్ లో ఇంగ్లాండ్ బౌలర్లను చితక్కొడుతూ కేవలం 52 బంతుల్లోనే తన సెంచరీ మార్క్ అందుకున్నాడు. వైభవ్ ఇన్నింగ్స్ లో 10 ఫోర్లు, 7 సిక్సర్లు ఉన్నాయి. 19వ ఓవర్‌లో ఇంగ్లాండ్ స్పిన్నర్ రాల్ఫీ అల్బర్ట్ బౌలింగ్‌లో సింగిల్ తో సెంచరీ మార్క్ అందుకున్నాడు.

ఓవరాల్ గా సూర్యవంశీ 78 బంతుల్లో 13 ఫోర్లు, 10 సిక్సర్లతో 143 పరుగులు చేసి ఔటయ్యాడు. ఈ ఇన్నింగ్స్ తో సూర్యవంశీ మెన్స్ యూత్ వన్డేల్లో అత్యంత వేగవంతమైన సెంచరీని నమోదు చేసి చరిత్ర సృష్టించాడు. పాకిస్తాన్ ఆటగాడు కమ్రాన్ గులాం 53 బంతుల్లో చేసిన సెంచరీని సూర్యవంశీ బద్దలు కొట్టాడు. ఆరంభం నుంచి వైభవ్.. దూకుడుగా ఆడాడు. ఈ 14 ఏళ్ళ కుర్రాడిని ఆపడానికి ఇంగ్లాండ్ బౌలర్ల వద్ద సమాధానమే లేకుండా పోయింది. ఈ సిరీస్ లో అంతకముందు హాఫ్ సెంచరీలతో అదరగొట్టిన ఈ బీహార్ చిచ్చర పిడుగు నేడు ఏకంగా సెంచరీ చేసి ప్రపంచ క్రికెట్ ను ఆశ్చర్యపరిచాడు.

ఈ మ్యాచ్ విషయానికి వస్తే మొదట బ్యాటింగ్ చేస్తున్న ఇండియా అండర్ 19 ప్రస్తుతం 31 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 239 పరుగులు చేసింది. సూర్యవంశీ (143) రికార్డ్ సెంచరీకి తోడు విహాన్ మల్హోత్రా (63) హాఫ్ సెంచరీ చేసి రాణించాడు. ఆయుష్ మాత్రే 5 పరుగులే చేసి ఔటయ్యాడు.

## చివరి టెస్ట్ ఆడేశాడా: రీ ఎంట్రీలోనూ ఘోరంగా.. ప్రమాదంలో కరుణ్ టెస్ట్ కెరీర్



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశవాళీ క్రికెట్ లో అసాధారణంగా రాణించి ఎనిమిదేళ్ల తర్వాత టీమిండియాలో చోటు సంపాదించిన కరుణ్ నాయర్ ప్రస్తుతం ఇంగ్లాండ్ తో జరుగుతున్న టెస్ట్ సిరీస్ లో ఘోరంగా విఫలమవుతున్నాడు. ఇంగ్లాండ్ తో లీడ్స్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో డకౌటయ్యాడు. పోప్ పట్టిన సూపర్ క్యాచ్ కు ఖాతా తెరవకుండానే ఔటయ్యాడు. రెండో ఇన్నింగ్స్ లో 20 పరుగులే చేసి నిరాశపరిచాడు. ప్రస్తుతం ఇంగ్లాండ్ తో ఎడ్జ బాస్టన్ లో జరుగుతున్న రెండో టెస్టులో సాయి సుదర్శన్ లాంటి యంగ్ టాలెంటెడ్ బ్యాటర్ ను పక్కనపెట్టి జట్టు యాజమాన్యం కరుణ్ నాయర్ కు మూడో స్థానంలో ప్రమోషన్ ఇచ్చారు. అయితే వచ్చిన ఈ అవకాశాన్ని కరుణ్ వినియోగించుకోలేకపోయాడు. తొలి ఇన్నింగ్స్ లో 31 పరుగులు చేసి పర్వాలేదనిపించినా రెండో ఇన్నింగ్స్ లో 26 పరుగులే చేసి విఫలమయ్యాడు. వరుసగా రెండు టెస్టుల్లో నాలుగు ఇన్నింగ్స్ ల్లో 19 యావరేజ్ తో ఈ కర్ణాటక బ్యాటర్ 77 పరుగులే చేసి తీవ్రంగా నిరాశపరిచాడు. రాహుల్, గిల్, జైశ్వాల్, పంత్ అద్భుతంగా రాణిస్తున్నా ఈ వెటరన్ ప్లేయర్ మాత్రం విఫలమయ్యాడు. మూడో టెస్టులో కరుణ్ కు ఛాన్స్ దక్కే అవకాశం కనిపించడం లేదు. ఒక్కసారి టీంఇండియాలో ఛాన్స్ కోల్పోతే మళ్ళీ ఎంట్రీ ఇవ్వడం చాలా కష్టం. అతని వయసు కూడా 33 ఏళ్ళు కావడం మైనస్ గా మారింది. 2016 లో ఇంగ్లాండ్ పై చెన్నై వేదికగా ట్రిపుల్ సెంచరీ కొట్టి భారత క్రికెట్ తరపున ఈ ఘనత సాధించిన రెండో ప్లేయర్ గా నిలిచాడు. భారత్ తరపున టెస్టులో ట్రిపుల్ సెంచరీ ఒక్కసారిగా అందరి దృష్టి తనవైపుకు తిప్పుకున్నాడు. వీరేంద్ర సెహ్వాగ్ తర్వాత టెస్టు క్రికెట్‌లో భారత్ తరపున ట్రిపుల్ సెంచరీ సాధించిన రెండో ఆటగాడిగా సరికొత్త చరిత్ర నెలకొల్పాడు. చెన్నై వేదికగా జరిగిన ఈ టెస్టులో 381 బంతుల్లో 303 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. 2017 లో ఆస్ట్రేలియాతో బోర్డర్ గవాస్కర ట్రోఫీలో స్థానం దక్కించుకున్న కరుణ్ విఫలమయ్యాడు. ఒక్క సిరీస్ లో విఫలమైనందుకే ఈ కర్ణాటక స్టార్ ను పక్కన పెట్టడం ఆశ్చర్యం కలిగించింది. కరుణ్ కు అన్యాయం జరిగిందని చాలామంది ఆరోపించారు.

## వన్డేల్లో ద్వైపాక్షిక సిరీస్ తొలగించండి.. ఐసీసీకి క్లాసన్ డిమాండ్



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత సౌతాఫ్రికా విధ్వంసకర బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ టీ20 లీగ్ లు ఆడుతూ బిజీగా ఉన్నాడు. ఇటీవలే ఐపీఎల్ ముగించుకున్న ఈ సఫారీ వికెట్ కీపర్ బ్యాటర్.. ప్రస్తుతం మేజర్ లీగ్ క్రికెట్ లో సియాటెల్ ఆర్కాస్ కు ఆడుతున్నాడు. ఈ లీగ్ తుది దశకు చేరుకుంటున్న తరుణంలో క్లాసన్ అంతర్జాతీయ క్రికెట్ లో వన్డేలపై హాట్ కామెంట్స్ చేశాడు. ఐసీసీకి తన డిమాండ్ ను తెలియజేస్తూ వన్డేల్లో ద్వైపాక్షిక సిరీస్ రద్దు చేయాలని కోరాడు. హెన్రిచ్ క్లాసెన్ ఇటీవల క్రిక్‌బజ్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. అంతర్జాతీయ క్యాలెండర్‌లో ద్వైపాక్షిక వన్డే మ్యాచ్‌లు ఇకపై అవసరం లేదని సూచిస్తూ. బదులుగా జట్లు మరిన్ని టెస్ట్ మ్యాచ్‌లు ఆడాలని ఆయన కోరారు. “ నేను కోరుకునే ఏకైక మార్పు ద్వైపాక్షిక వన్డే క్రికెట్‌ను అంతర్జాతీయ క్రికెట్ నుండి దూరంగా ఉంచడమే. ఎక్కువ టెస్ట్ మ్యాచ్‌లు ఆడని జట్లకు ఎక్కువ టెస్ట్ మ్యాచ్‌లు ఇవ్వండి. ఎక్కువ టీ20 క్రికెట్ కు ప్రాధాన్యమివ్వండి”. అని క్లాసెన్ క్రికెట్ క్రికెట్ గురించి తన అభిప్రాయాలను తెలపాల్సిందిగా కోరినప్పుడు ఈ విధంగా చెప్పుకొచ్చాడు. సౌతాఫ్రికా వికెట్ కీపర్-బ్యాటర్ గా పరిమిత ఓవర్ల క్రికెట్ లో అదరగొడుతున్న హెన్రిచ్ క్లాసెన్ సోమవారం (జూన్ 2) అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించి ఆశ్చర్యానికి గురి చేశాడు. వైట్ బాల్ ఫార్మాట్ లో తన పవర్ హిట్టింగ్ తో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసే క్లాసన్ క్రికెట్ కు గుడ్ బై చెప్పడం సంచలనంగా మారింది. 33 ఏళ్ళ క్లాసన్ సౌతాఫ్రికా తరపున 60 వన్డేల్లో 2141 పరుగులు.. 58 టీ20ల్లో 1000 పరుగులు చేశాడు. ఓవరాల్ గా తన అంతర్జాతీయ కెరీర్ లో 4 సెంచరీలు.. 16 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. క్లాసన్ 2024లో టెస్ట్ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించాడు. టెస్ట్ ఫార్మాట్ లో కేవలం నాలుగు టెస్టులు మాత్రమే ఆడాడు. 2019లో రాంచీ వేదికగా భారత్‌పై అరంగేట్రం తొలి టెస్ట్ ఆడిన క్లాసన్.. 2023లో వెస్టిండీస్‌పై తన చివరి టెస్ట్ ఆడాడు. ఈ వికెట్ కీపర్ బ్యాటర్ నాలుగు టెస్టుల్లో 13 యావరేజ్ తో 104 పరుగులు చేశాడు. సిడ్నీలో ఆస్ట్రేలియాపై చేసిన 35 పరుగులు క్లాసన్ టెస్టు కెరీర్ లో అత్యధికం.

# పిల్లల కోసం విడాకులు తీసుకున్న నటి!



వైవాహిక పుకార్ల మధ్య నుస్రత్ జహాన్ గ్లామరస్ లుక్‌తో తలదా చుకుంది



బాలీవుడ్ నటి ఛాహత్ ఖన్నా గురించి పరిచయం అవసరం లేదు. ‘ది ఫిలిం’, ‘థాంక్యూ’, ‘ప్రస్థానం’, ‘యాత్రాస్’ లాంటి చిత్రాలతో సుపరిచితమే. బుల్లి తెరపైనా అమ్మడు బాగా ఫేమస్. ‘ఖుబూల్’ హై వంటి సీరియల్ ఆమెకు అక్కడా మంచి గుర్తింపును తెచ్చి పెట్టింది. కెరీర్ పరంగా ఎలాంటి ఢోకాలేదు. కానీ వ్యక్తి గత జీవితంలో మాత్రం ఛాహత్ కూడా చాలా ఎదురుదెబ్బలే తిన్నది. 2006 లో భరత్ నర్సింగ్ ను వివాహం చేసుకుంది. కానీ ఆ బంధం ఏడాది కూడా నిలబడలేదు. పెళ్లైన నాలుగు నెలల్లోనే వీగిపోయింది. అటుపై 2013 లో పర్హాన్ మీర్జాను పెళ్లాడింది. కానీ ఐదేళ్ల కాపురం అనంతరం ఆ జోడీ కూడా విడాకులతో వేరైంది. అయితే రెండవ సారి విడాకుల విషయంలో ఛాహత్ ఖాన్నా ఓ కొత్త కారణాన్ని రివీల్ చేసింది. ఆమె మాటలు ప్రకారం భర్తతో ఎలాంటి వివాదం లేకుండానే విడాకులు తీసుకున్నట్లు కనిపిస్తుంది. పిల్లల భవిష్యత్ కోసమే విడాకులు తప్ప మరో కారణం లేదంది. - నాకెప్పుడు సరైంది అనిపిస్తేనే చేస్తాను. దానికే కట్టుబడి ఉంటాను. ఏదైనా తప్పు అనిపిస్తే అలాంటి పని జోలికి వెళ్లను. ఎవరైనా తప్పు చేసినా ధైర్యంగా నిలబడి ప్రశ్నిస్తాను. ఆ ధైర్యం, తెగువ నాలో ఉన్నాయి. తప్పు విష యంలో ప్రపంచమంతా ఒక్క వైపు ఉన్నా? నేను మరోవైపు ఉంటాను. ఆ రకమైన నమ్మకం, ధైర్యం నాకున్నాయి. అలాంటి స్వభావం నాకు చిన్నప్పటి నుంచే అలవాటైంది. పిల్లల కోసం ఎక్కువగా లోచిస్తాను. అలాగే వివాహ బంధం ఎంత బలంగా ఉందన్నది చూసుకుంటాను. సరిగ్గా లేని బంధంలో కొనసాగకూడదు అన్నది నా అభిప్రాయం. ఎందుకంటే పిల్లల కంటే ఏదీ ఎక్కువ కాదు. మనకంటే ఎక్కువగా పిల్లలు ప్రభావితం అవుతారు. అది కలిగించే నష్టం మనకు తెలియకుండానే జరిగిపోతుంది. వారు పెద్దాయ్యాక వారి స్నేహితుల నుంచే ఇలాంటి విషయలు మనకు తెలుస్తాయి. అందుకే కుమార్తెల కోసం కొన్ని నిర్ణయాలు తీసుకోక తప్పలేదని-తెలిపింది.



కావ్య కళ్యాణ్‌రామ్ సంతోష కరమైన దృశ్యాన్ని పంచుకున్నారు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com